అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

శుక్రవారం 24-05-2024



బుద్ధ విహారలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సంపుటి : 10 సంచిక : 94 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ఇండియా ఫోరందే అధికారం

లోక్‌సభ ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలు : రాహుల్ గాంధీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో జరుగుతోన్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యపరచనున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. దేశంలోని 90 శాతం పేద వర్గాలకు చెందిన ప్రజలు తమ వెంట ఉన్నారని, ఇండియా ఫోరమే అధికారంలోకి రానుందని తెలిపారు. గురువారం నాడిక్కడ ఏపీ, తెలంగాణ భవన్ లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కలిసి ఆయన లంచ్ చేశారు. అనంతరం రాహుల్ గాంధీ ...11లో

రేపే ఆరో దశ పోలింగ్

ముగిసిన ప్రచార పర్వం | ఎనిమిది రాష్ట్రాల్లో 58 లోక్‌సభ స్థానాలకు 889 మంది అభ్యర్థులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల ఆరో దశ పోలింగ్‌కు సంబంధించిన ప్రచారపర్వం గురువారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 58 నియోజకవర్గాలకు రేపు (శనివారం) పోలింగ్ జరగనుంది. 889 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారు. ఆరో దశలో ఉత్తరప్రదేశ్‌లో 14, బీహార్‌లో ...11లో

నేటి సమాజానికి బుద్ధుని సందేశం అవసరం

ధ్యాన మందిరానికి ఎస్డీఎఫ్ నిధులు : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సికింద్రాబాద్‌లోని మహాబోధి బుద్ధ విహారలో ధ్యానమందిరానికి అవసరమైన నిధులను స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్డీఎఫ్) నుంచి మంజూరు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. గౌతమబుద్ధుని జయంతిని పురస్కరించుకుని బుద్ధ విహారను సందర్శించిన ఆయన అక్కడ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసూయ, అసహనం, స్పర్థలు, ఉద్వేగాలు నిండిన వాతావరణం నెలకొని ఉన్న నేటి సమాజానికి బుద్ధుని సందేశం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఆయన సందేశాన్ని సమాజంలో ప్రతి ఒక్కరి వద్దకు తీసుకెళ్లేందుకు ఒక వ్యక్తిగా, ప్రభుత్వపరంగా అవసరమైన సహాయాన్ని అందించ నున్నట్టు తెలిపారు. విహారకు వచ్చిన తనకు గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని సీఎం తన అనుభవాన్ని వెల్లడించారు.

రాజ్యం, అధికారమున్నా... వాటిని కాదని 29 ఏండ్ల వయసులోనే శాంతి కోసం బుద్ధుడు పరితపించారని గుర్తుచేశారు. ఆయన సిద్ధాంతం 2,500 ఏండ్లుగా నిలబడి ఉందని తెలిపారు. ప్రతి పనిని ధ్యానంగా చేయాలన్న సూచనలో చాలా అర్థముందనీ, ఆ సూక్తి నుంచి తాను ఎంతో స్ఫూర్తిని పొందినట్టు రేవంత్ రెడ్డి తెలిపారు. తాను ఏ పనినైనా ఎంతో ధ్యానంతో చేస్తానని చెప్పారు. విహార నుంచి ఒక పాఠశాలను నిర్వహించాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బుద్ధిస్టులకు అన్ని రకాల సహాయ, సహకారాలుంటాయనీ, రాష్ట్రంలో బౌద్ధ భిక్కువులకు తగిన గౌరవం ఉంటుందని భరోసానిచ్చారు. ధ్యానాన్ని ఒక పనిగా చేయడం కాదనీ.. ప్రతి పనిని ధ్యానంగా చేయడాన్ని పాటించాలని సీఎం సూచించారు." సమాజంలో అశాంతి, అసూయలను అధిగమించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మంచి సందేశం, ఆలోచనలను పెంపొందించుకోవాలి. సమాజానికి మేలు చేయాలన్న తలంపును ఇతరులకు పంచాలి. గౌతమ బుద్ధుడి సందేశం అందరికీ స్ఫూర్తిదాయకం, అనుసరణీయం. మహాబోధి బుద్ధ విహార్‌కు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా, పూర్తిగా సహకరిస్తుంది. ధ్యాన మందిరం కోసం నిధులు కేటాయిస్తాం. ప్రతిపాదనలు పంపితే ఎన్నికల కోడ్ ముగిశాక నిధులు మంజూరు చేస్తాం" అని ఆయన హామీనిచ్చారు.

మోడీకి రైతు సెగ

మద్దతు ధర అమలు చేయాలని డిమాండ్ | నల్లజెండాలతో అడుగడుగునా నిరసన

పంజాబ్ పర్యటనలో ప్రధానికి అడ్డంకులు – బీజేపీ నేతల నిలువరింత..గోబ్యాక్ అంటూ నినాదాలు

- భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది మోహరింపు
- అన్నదాతలనూ అడ్డుకున్న వైనం..పలు ఆంక్షలు విధింపు
- తమకు కేటాయించిన ప్రాంతంలో వందలాది మంది రైతుల ర్యాలీ
- మూడు రహదారుల దిగ్బంధం



ప్రధానికి నిరసన తెలుపుతున్న పంజాబ్ రైతులు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీకి రైతు సెగ తగిలింది. దశాబ్దకాలంగా తమను మోసం చేస్తున్నారంటూ మోడీకి వ్యతిరేకంగా రైతులు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. దీంతో పోలీసులకు, భద్రతా బలగాలకు ముచ్చెమటలు పట్టాయి. పంజాబ్‌లోని పాటియాలలో మోడీ ఎన్నికల ప్రచారం భారీ భద్రత నడుమ సాగింది. రైతులు మార్చ్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పాటియాలలో మోడీ నిర్వహిస్తున్న సభ వేదిక వరకూ పోలీసు అధికారులు భారీ భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మోడీ పర్యటన, రైతుల నిరసన మార్చ్ నేపథ్యంలో 5,500 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. రైతులు పాటియాలలోకి ప్రవేశించకుండా నిరోధించటానికి, వాహనాల కదలికను నియంత్రించటానికి ర్యాలీ వేదికను పూర్తిగా చుట్టుముడుతూ ఎంట్రీ పాయింట్ల వద్ద ఇసుకతో నింపిన ట్రక్కులను భద్రతా అధికారులు ఉంచారు. దీంతో పంజాబ్‌లో బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని గురువారం సాయంత్రం ప్రారంభించటానికి మోడీ పర్యటనకు ముందు పాటియాలా ఒక ఉద్రిక్తమైన వాతావరణాన్ని చూసింది.

సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం)కు చెందిన రాజకీయేతర, రాజకీయ వర్గాలు, భారతీయ కిసాన్ యూనియన్ ...2లో

ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

ఏడుగురు మావోయిస్టులు మృతి



ఆటోమేటిక్ ఆయుధాలతో సహా పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం

ఈ ఏడాదిలో 100మందికి పైగా హతం

నవతెలంగాణ-చర్ల

మళ్లీ అబుజ్‌మడ్ అడవుల్లో యుద్ధమేఘాలు అలుముకున్నాయి. గత నెలలో వరుసగా జరిగిన ఎన్‌కౌంటర్లు మరవకముందే గురువారం తెల్లవారుజాము నుంచి ...11లో



ఓట్ల తారుమారుకు ఛాన్స్

120 పౌర సమాజ సంస్థల హెచ్చరిక

వివరాలు 3లో..

కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

నలుగురు కార్మికులు మృతి

25 మందికి గాయాలు

మహారాష్ట్ర థానేలో ఘటన



వివరాలు 11లో..


మత్తెక్కింది..నిజమే

బెంగళూరు రేవ్ పార్టీలో తెలుగు నటికి డ్రగ్ పాజిటివ్ : పోలీసులు



బెంగళూరు: బెంగళూరు రేవ్ పార్టీలో పట్టుబడిన వారిలో తెలుగు నటికి డ్రగ్ పాజిటివ్‌గా నమోదైంది. రేవ్ పార్టీ రచ్చకెక్కాక అక్కడ తాము లేమంటూ వీడియోలు కూడా విడుదల చేశారు. తాజాగా ఆ నటి డ్రగ్స్ పాజిటివ్ అని తేలటంతో తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. ఇంకెంతమంది డ్రగ్స్ తీసుకున్నారని వెల్లడిస్తారో.. నన్న ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ రేవ్ పార్టీలో పట్టుబడ్డ వారిలో 103 మందికి డ్రగ్ టెస్ట్‌లో ...11లో

ప్రజాస్వామ్యాన్ని బీజేపీ జైల్లో పెడితే.. అక్కడి నుంచే నడుపుతాం : కేజ్రీవాల్



అధికార బీజేపీ ప్రజాస్వామ్యాన్ని జైల్లో పెడితే, ప్రజాస్వామ్యాన్ని అక్కడి నుంచే నడుపుతామని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయడానికి, వాగ్దానాలు నెరవేర్చడానికి రాజ్యాంగం సాక్షిగా ప్రమాణం చేశానని, తాను పదవిలో కొనసాగడానికి రాజ్యాంగం, చట్టపరంగా ఎటువంటి అడ్డంకులు లేవని ఆయన తెలిపారు. ఒక ఈమెయిల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ ఈ విషయాలను వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించలేమని బీజేపీ అంగీకరించినందు వలనే తనపై తప్పుడు కేసులు పెట్టి జైలులో పెట్టారని ఆయన విమర్శించారు. కేజ్రీవాల్ ఇంటర్వ్యూ సాగిందిలా...

ప్రశ్న: అరెస్టైన తర్వాత మీరు ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయలేదు. ఏది ఏమైనప్పటికీ, ఇది ప్రభుత్వ పనితీరులో సమస్యలను తెచ్చి పెట్టవచ్చు, అది రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితినీ తీసుకురావచ్చు. ఫైలుపై సంతకం చేయలేని ముఖ్యమంత్రిగా ఎలా కొనసాగాలని ఆలోచిస్తున్నారు?

కేజ్రీవాల్ : నేను మూడుసార్లు ఎన్నికైన ముఖ్యమంత్రిని. ఢిల్లీ ఓటర్లలో 54 శాతం కంటే ఎక్కువ మంది ఓటు వేశారు. ముఖ్యమంత్రిగా మోడీకి కూడా 54 శాతం ఓట్లు రాలేదు. ప్రజలకు సేవ చేస్తానని, నా వాగ్దానాలను నెరవేరుస్తానని రాజ్యాంగం పై ప్రమాణం చేశాను. 2014 నుండి ఆప్‌ని నాశనం చేయడానికి బీజేపీ తన ప్లేబుక్‌లోని ప్రతి ఉపాయాన్ని ప్రయత్నించింది. కానీ ప్రజలు అవర్ కామ్ కీ రాజనీతి (పని రాజకీయాలు) పై విశ్వాసం ఉంచారు. బీజేపీ ద్వేషం, విభజన రాజకీయాలను తిరస్కరించారు.


ప్రశ్న: మీరు ఇండియా వేదిక భాగస్వాములతో మాట్లాడకుండానే "కేజ్రీవాల్ ..10 హామీలు" అంటూ హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా 22 స్థానాల్లో పోటీ చేస్తున్నారు. వేదికకు సంఖ్యాబలం వస్తే సంకీర్ణ భాగస్వామ్య పక్షాల్లో మీ స్వరం ప్రతిధ్వనిస్తుందని భావిస్తున్నారా?

కేజ్రీవాల్ : మా 10 హామీలు ఏమిటి? మన కలల భారతదేశాన్ని నిర్మించడానికి అవి ఒక రోడ్‌మ్యాప్. ఇక్కడ ప్రతి వ్యక్తి అభివృద్ధి చెందడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవకాశాలు ఉన్నాయి. 24 గంటల విద్యుత్ సరఫరా, మంచి విద్య, బీమా పథకాలపై ఆధారపడని ఉచిత వైద్యం, చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని స్వాధీనం చేసుకునేందుకు భారత సైన్యానికి స్వేచ్ఛ, అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయడం, స్వామినాథన్ కమిషన్ ప్రకారం అన్ని పంటలకు ఎమ్మెస్పీని నిర్ణయిస్తామని హామీ ఇచ్చాం. యువతకు రెండు కోట్ల ఉద్యోగాలు, వ్యాపారులకు సులభంగా ...3లో

ఐఐటీల్లో చదివినా కొలువుల్లేవ్

38 శాతం నిరుద్యోగులే

- ఈ ఏడాది మొత్తం 23 ఐఐటీ క్యాంపస్‌ల్లో ఎనిమిది వేల మందికి ఉద్యోగలేమి
- దేశంలో 61 శాతం పీజీ విద్యార్థులకు దక్కని ఉద్యోగం
- ఆర్టీఐ దరఖాస్తుకు సమాధానం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో ఐఐటీలకు ప్రత్యేక స్థానం ఉంది. ఐఐటీల్లో చదివిన వారికి మంచి ఉద్యోగాలు, లక్షల్లో వేతనాలు ఉంటాయని విన్నాం. కానీ, ప్రస్తుతం నిరుద్యోగం పెరగడంతో అందుకు భిన్నమైన పరిస్థితులు వెలుగుచూస్తున్నాయి. మన దేశంలోని ఐఐటీల్లో విద్యనభ్యసించిన విద్యార్థుల్లో ఈ ఏడాది దాదాపు 38 శాతం మందికి క్యాంపస్ ఉద్యోగాలు దక్కలేదు. దేశంలో 61 శాతం పోస్ట్ గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు దక్కలేదు. ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి ధీరజ్ సింగ్ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా సేకరించిన సమాచారంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఈ ఏడాది మొత్తం 23 ఐఐటీ క్యాంపస్‌ల్లో దాదాపు 8 వేల మంది (38శాతం) ఐఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని తేలింది. 2024లో 21,500 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా, కేవలం 13,400 మంది మాత్రమే ఉద్యోగాలు సాధించారు. మిగతా వారు (38 శాతం) ఇంకా కొలువుల కోసం అన్వేషిస్తున్నట్టు వెల్లడైంది. రెండేండ్ల క్రితం నాటితో పోలిస్తే ఈ పరిస్థితి దాదాపు రెట్టింపు అయినట్టు ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. పాత తొమ్మిది ఐఐటీల్లో ఈ ఏడాది 16,400 మంది విద్యార్థులు ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా, వారిలో 6,050 (37 శాతం) మందికి ఇంకా ఉద్యోగాలు దక్కలేదు. కొత్తగా ఏర్పాటు చేసిన 14 ఐఐటీల్లో అయితే ఈ పరిస్థితి మరింత క్షీణించింది. 5,100 మంది ఉద్యోగాల కోసం నమోదు చేసుకోగా, ఇంకా 2,040 మందికి కొలువులు రాలేదని తేలింది. గతేడాది ఖరగ్‌పూర్ ఐఐటీల్లో 33 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కలేదని ధీరజ్ సింగ్ పేర్కొన్నారు. ఉద్యోగ నియామకాల్లో సంక్షోభ పరిస్థితుల కారణంగా ఇంకా ఉద్యోగాలు రాని విద్యార్థులు ఒత్తిడి, ఆందోళన, నిస్సహాయతతో ఉన్నారని ఆయన తెలిపారు. "ఉద్యోగాలు రాని విద్యార్థుల సంఖ్య రెట్టింపు కావడం దేశంలోని అత్యుత్తమ ఇంజినీరింగ్ కళాశాలల్లో అనిశ్చిత స్థితిని సూచిస్తుంది. దాదాపు 61 శాతం పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లకు ఇప్పటికీ చోటు దక్కలేదు. ఇది ప్రధాన కళాశాలలు, యువ గ్రాడ్యుయేట్లు ఎన్నడూ ...11లో

మట్టినీ మింగుతుండ్రు



వాల్టా చట్టానికి మాఫియా తూట్లు

- అనుమతి గోరంత.. తవ్వేది కొండంత..
- అసైన్డ్, పట్టా భూముల్లో తవ్వకాలు
- చోద్యం చూస్తున్న ప్రభుత్వ శాఖలు
- స్థిరాస్తి వ్యాపారుల వెంచర్లు, ఇండ్లు, అపార్ట్‌మెంట్లకు తరలింపు
- కరిగిపోతున్న నీటి వనరులు, గుట్టలు, చెట్లు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మట్టి మాఫియా రెచ్చిపోతున్నది. అనుమతుల్లేకుండా ప్రభుత్వ ప్రయివేట్ భూముల్లో మట్టిని తవ్వేస్తున్నది. చెరువులు, కుంటల్ని సైతం విడిచిపెట్టట్లేదు. ప్రాజెక్టుల కింద తవ్విన కాల్వ మట్టిని ఎత్తుకెళ్తున్నది. వాల్టా చట్టానికి తూట్లు పొడిచి కోట్లు సంపాదిస్తున్నది. స్థిరాస్తి వ్యాపారులు వెంచర్లు, ఇండ్లు, ఫంక్షన్ హాల్స్, గోదాములు ఇతర నిర్మాణాల పేరిట విచ్చలవిడిగా మట్టిని తరలిస్తున్నా మైనింగ్, భూగర్భజల, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయలోపం వల్ల అడ్డుకట్ట వేసే పరిస్థితి లేకుండా పోయింది. రోడ్లు, ఇతర నిర్మాణాల పేర గోరంత అనుమతి పొంది కొండంత మట్టిని అక్రమంగా తవ్వుకెళ్తున్నారు. జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు పెట్టి రాత్రింబవళ్లు మట్టిని తోడేస్తుండటంతో నీటి వనరులు, గుట్టలు, కాల్వ కట్టలు, చెట్లు తరిగిపోతున్నాయి. గత ప్రభుత్వంలో ఇలాంటివి యథేచ్ఛగా జరిగినా పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఆ ఆలుసుతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమూ తమను ఏమీ చేయలేదన్న కారణంతో ఇలాంటి వాటికి పాల్పడుతున్నారన్న చర్చ మొదలైంది.

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మట్టి మాఫీయా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ మూడు జిల్లాల్లోని అనేక మండలాల్లో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో బుదేరా, గొర్రెగట్టు, కంకోల్, లింగంపల్లి గ్రామాల నుంచి మట్టిని తవ్వి ముంబయి హైవే వెంట వెలుస్తున్న వెంచర్లకు తరలిస్తున్నారు. సదాశివపేట ప్రాంతంలో విస్తరిస్తున్న వెంచర్లకు మట్టిని తోడుతున్నారు. గ్రామాల్లో జేసీబీలు పెట్టి తవ్వుతూ టిప్పర్లు, ట్రాక్టర్లతో రాత్రింబవళ్లు తరలిస్తున్నారు. చెరువుల్ని తలపించేలా తవ్వుతూ గుంతలమయం చేస్తుండటంతో సారవంతమైన నేలలు ధ్వంసమవుతున్నాయి. చెట్లు కూలిపోతున్నాయి. ఈ మట్టి దందాను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. కొండాపూర్, సంగారెడ్డి, కంది, వట్‌పల్లి, ఝరాసంఘం, రాయికోడ్, హత్నూర, పుల్కల్, చౌటకూర్, నారాయణఖేడ్, పెద్దశంకరంపేట వంటి మండలాల్లోని వందలాది గ్రామాల్లో ఈ మట్టి దందా జోరుగా సాగుతోంది. నారాయణఖేడ్ ప్రాంతంలో చెరువులు, కుంటల్ని సైతం తవ్వేస్తున్నారు. జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం, బొంతపల్లి ప్రాంతాల్లోని గుట్టలన్నీ కరిగిపోయాయి. అసైన్డ్, ప్రభుత్వ భూములన్నీ మట్టి తవ్వకాలకు కేంద్రాలుగా మారాయి. ఝరాసంగం మండలంలోని కుప్పానగర్, మాచునూరు, కల్హారు, చిల్లెపల్లి, ఏడాకులపల్లి, చిలుకపల్లి, గినియార్ వంటి గ్రామాల్లోని ప్రభుత్వ ...11లో

జాతీయస్థాయి కరాటేలో విద్యార్థుల ప్రతిభ
గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన క్రీడాకారులు



నవతెలంగాణ-వరంగల్ డెస్క్

జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన క్రీడాకారులు జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం కరాటే మాస్టర్లు మాట్లాడుతూ.. కరాటే క్రీడాకారులు పెద్ది హర్షిణి, పెద్ది ఉజ్వల్ షోటోకాన్ కరాటే, వెపన్ కటష్ విభాగంలో జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సొంతం చేసుకున్నట్టు తెలిపారు. చెన్నూరు గ్రామానికి చెందిన పెద్ది లక్ష్మణ్ కుమార్తె హర్షిణి, కుమారుడు ఉజ్వల్ హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు పాఠశాలలో చదువుతున్నారు. ఈ నెల 19న గోవాలో యూనివర్సల్ 369 షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా కరాటే చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచారు. హర్షిణి వెపన్ కటష్ విభాగంలో గోల్డ్, కటష్ విభాగంలో సిల్వర్ మెడల్, ఉజ్వల్ వెపన్ కటష్ విభాగంలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. చిన్నారులను హీరో సుమన్‌తో పాటు పలువురు కరాటే మాస్టర్లు అభినందించారు.

ప్రభుత్వ ఉద్యోగులా? ఉపాధి కూలీలా?

- పూర్వ వీఆర్వోలతో హరితహారం పనులు చేయించడాన్ని ఖండిస్తున్నాం
- మాతృశాఖలో వారిని సర్దుబాటు చేయాలి : గరికె ఉపేందర్‌రావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జూనియర్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లుగా నియమితులైన పూర్వ వీఆర్వోలతో మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం క్యాతనపల్లిలో గల హరితహారం నర్సరీలో పనులు చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ పూర్వ వీఆర్వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేందర్‌రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ చట్టం కింద హరిత హారం కోసం చేపట్టాల్సిన మొక్కల పెంపకం పనులు వారికి అప్పగించడం సరిగాదని పేర్కొన్నారు. జల్లెడ పట్టిన మట్టిని ప్లాస్టిక్ కవర్లలో నింపడానికి వీఆర్వోలు ఏమైనా ఉపాధి కూలీలా? అని ప్రశ్నించారు. రెవెన్యూ శాఖలో ఆరేండ్ల నుంచి 24 ఏండ్ల అనుభవం ఉన్న వారితో ఇలాంటి పనులు చేయించడం మానవ వనరులను దుర్వినియోగం చేయడమేనని పేర్కొన్నారు. గత ప్రభుత్వ తప్పుడు, కక్షాపూరిత, అనాలోచిత విధానాల వల్ల నేడు వీఆర్వోలు నేడు తలదించుకుని బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం దృష్టి సారించి దిద్దుబాటు చర్యలు చేపట్టి మాతృశాఖలోనే వీఆర్వోలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు.

కలకత్తా హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

- డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పశ్చిమబెంగాల్‌లో ముస్లిం ఉప కులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు వెలువరించిన తీర్పును స్వాగతిస్తున్నామని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ చెప్పారు. మైనార్టీలను సంతృప్తి పరిచేందుకు బీసీల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్న రాష్ట్రాలకు ఈ తీర్పు చెంపపెట్టులాంటిదన్నారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

ధాన్యం తూకంలో నిర్లక్ష్యం

వళ్లెంకుంటలో కొనుగోలు కేంద్రం ఎదుట రైతుల ఆందోళన




నవతెలంగాణ-మల్హర్‌రావు

తమ ధాన్యం మ్యాచర్ వచ్చినా తూకం వేయడంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత రైతులు ఆరోపించారు. గురువారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండలంలోని వళ్లెంకుంట గ్రామ రైతులు డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రంలో ఆందోళన చేపట్టారు. తాము ధాన్యం అమ్ముకోవడానికి నాలుగు వారాల క్రితం కొనుగోలు కేంద్రంలో కుప్పలు పోస్తే మ్యాచర్ రాలేదంటూ కొన్ని రోజులు, లారీల కొరత ఉందని, రైస్ మిల్లు అలర్ట్ రాలేదని ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు ఆరోపించారు. తాము వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ధాన్యం పండిస్తే ఒకవైపు అకాల వర్షాలు భయాందోళనకు గురిచేస్తున్నాయని, మరోవైపు కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ధాన్యం తూకం వేయాలని డిమాండ్ చేశారు. గంటకు పైగా తెలిపిన నిరసనలో గ్రామ మాజీ సర్పంచ్ భద్రపు సమ్మయ్య, ఆనంద రావు, మంథని జయలక్ష్మితోపాటు 50 మంది రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని జంతువు దాడిలో.. 65 గొర్రెలు మృత్యువాత

- 20గొర్రెలకు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-చిన్నకోడూరు

గొర్రెల మందపై గుర్తు తెలియని జంతువు దాడి చేయగా సుమారు 65 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. మరో 20 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామంలో జరిగింది. గొర్రెల పెంపకం దారుడు పున్నం మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీగా తన గొర్రెలను యథావిధిగా బుధవారం చీకటి పడే సమయానికి గొర్రెల షెడ్డులో వదిలి ఇంటికి వెళ్లిపోయాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వర్షం పడుతుండటంతో వడ్లు తడుస్తాయని బాయి వద్దకు పోయి వడ్లపై కప్పులు కప్పి, తిరిగి వస్తూ గొర్రెల మందను చూడగా ఎలాంటి సంఘటన జరగలేదు. వేకువజామున 4 గంటల సమయంలో గొర్రెల షెడ్డు వద్దకు పోయేసరికి గుర్తుతెలియని జంతువు మందలో నుంచి పారిపోయిందని తెలిపారు. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా, సంఘటనా స్థలానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఇక్రముద్దీన్, సెక్షన్ ఆఫీసర్ బుచ్చయ్య, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ చేరుకొని జంతువు కాలి గుర్తులు పరిశీలించారు. హైన లేదా తోడేలు దాడి చేసి ఉండొచ్చని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో బోను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మంజుల మాట్లాడుతూ.. 65 గోర్లు మరణించాయని, మరో 20 గోర్లు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయన్నారు. గాయపడిన గొర్లకు చికిత్స నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని బాధితునికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, గుర్తు తెలియని జంతువు దాడి చేయడంతో గ్రామస్తులంతా భయాందోళనలో ఉన్నారు.

దేశ ప్రజల కోసం కాంగ్రెస్... కార్పొరేట్ల కోసం బీజేపీ

జై జవాన్..జై కిసాన్ మా నినాదం

- పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దేశ ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుంటే బీజేపీ మాత్రం బహుళ జాతి కంపెనీల కోసం పని చేస్తున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు ఆయన పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్ కోట్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అమర్జీత్ కౌర్ సాహోకు మద్దతుగా పలు సభల్లో పాల్గొని ప్రసంగించారు. బుధవారం సాయంత్రం కొట్క్పూర అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. మచకి కలన్ గ్రామంలో ప్రశ్న-సమాధానం కార్యక్రమంలో విక్రమార్క పాల్గొన్నారు. గురువారం సాయంత్రం బాగా పురానలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశ వనరులు, సంపద ప్రజలకే చెందాలనే ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఇందుకు దేశంలోని ఆస్తులను, వ్యవస్థలను అమ్మి కొద్ది మందికే కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. దేశంలో శాంతి, సౌభాతృత్వం వెల్లి విరియాలని ఇండియా బ్లాక్ ఓ వైపు పోరాటం చేస్తుంటే, జాతి, మతం పేరిట విద్వేషాలు రెచ్చగొట్టి లబ్ది పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనీ, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలనీ, సంపద పేదలకు పంచాలని ఉద్దేశంతో రాహుల్ గాంధీ నాయకత్వంలో పెద్ద ఎత్తున పాదయాత్ర చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఓబీసీ, బీసీ, ఎస్సీల రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ఇంటి పెద్ద బ్యాంకు ఖాతాలో లక్ష రూపాయల నగదు జమ చేస్తామన్నారు. తాము మహిళలను మహారాణులుగా చేస్తామన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎప్పుడు పేదల గురించే ఆలోచిస్తుందనీ, బీజేపీ మాత్రం పేదలకు రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. అదానీ, అంబానీ వంటి కొద్ది మంది పెద్దలకు మాత్రం రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందన్నారు. మోడీ పదేండ్ల పాలనలో 100 లక్షల కోట్ల అప్పులు చేసి దేశాన్ని అప్పులకుప్పగా మార్చారని విమర్శించారు. జనాభా దామాషా ప్రకారం దేశ సంపద పంపిణీ జరగాలని కోరారు. తమిళనాడులో 69 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయనీ, అదే విధంగా అన్ని చోట్ల రిజర్వేషన్లు పెంచుతామని ఇండియా బ్లాక్ స్పష్టం చేసిందన్నారు. తాము పేదల కోసం పథకాలు ప్రకటించామనీ, బీజేపీ మాత్రం తమ పార్టీని విమర్శించడమే పని గా పెట్టుకుందన్నారు. యూపీఏ హయాంలో ఉపాధి హామీ చట్టం, ఆహార భద్రత, రూరల్ హెల్త్ మిషన్, భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ తదితర సందర్భాల్లో సైతం వారు విమర్శించారని గుర్తు చేశారు. ప్రాణాలు లెక్కచేయకుండా సరిహద్దుల్లో కాపలాకాస్తున్న వీర జవాన్ల స్థాయిని మోడీ ప్రభుత్వం కార్మికుల స్థాయికి దిగజార్చిందని విమర్శించారు. ఇండియా బ్లాక్ అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదల ఆరోగ్య బీమాకు సంబంధించిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచామనీ, అదే తరహాలో ఇండియా బ్లాక్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తుందని తెలిపారు. మద్దతు ధర, రుణమాఫీ కోసం ఢిల్లీలో రైతులు నెలల తరబడి ఆందోళన చేస్తే మోడీ పది నిమిషాలు కూడా వారి కోసం కేటాయించలేదని తెలిపారు.

ఆ పోరాటంలో వందలాది మంది రైతులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని గుర్తు చేశారు. జై జవాన్ జై కిసాన్ అదే తమ అసలుసిసలు నినాదమన్నారు. నెహ్రూ కాలం నుంచి మొన్నటి మన్మోహన్ సింగ్ వరకు సంక్షేమమే ధ్యేయంగా పని చేశామని గుర్తు చేశారు. దేశంలో హరిత విప్లవం తీసుకువచ్చి వ్యవసాయ ఉత్పత్తులను మూడింతలు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాల దేనన్నారు. రైతు, శ్రామికుల రుణమాఫీకి ఇండియా బ్లాక్ కట్టుబడి ఉందన్నారు. తెలంగాణలో రైతు రుణమాఫీ చేయబోతున్న విషయాన్ని వివరించారు. ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రతిరోజు రూ. 400 కూలీ భద్రతను ఇండియా బ్లాక్ కల్పిస్తుందని హామీనిచ్చారు. జనాభా దామాషా ప్రకారం ఈ దేశ సంపద, వనరులు పంపిణీ చేయడమే లక్ష్యంగా రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర, మణిపూర్ నుంచి ముంబై వరకు బస్సుయాత్ర నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు విక్రమార్క వివరించారు.

మోడీకి రైతు సెగ

(మొదటి పేజీ తరువాయి)

మార్చ్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పాటియాలలో మోడీ నిర్వహిస్తున్న సభ వేదిక వరకూ పోలీసు అధికారులు భారీ భద్రతను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. మోడీ పర్యటన, రైతుల నిరసన మార్చ్ నేపథ్యంలో 5,500 మంది పోలీసులు, భద్రతా సిబ్బంది విధుల్లో పాల్గొన్నారు. రైతులు పాటియాలలోకి ప్రవేశించకుండా నిరోధించటానికి, వాహనాల కదలికను నియంత్రించటానికి ర్యాలీ వేదికను పూర్తిగా చుట్టుముడుతూ ఎంట్రీ పాయింట్ల వద్ద ఇసుకతో నింపిన ట్రక్కులను భద్రతా అధికారులు ఉంచారు. దీంతో పంజాబ్‌లో బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని గురువారం సాయంత్రం ప్రారంభించటానికి మోడీ పర్యటనకు ముందు పాటియాలా ఒక ఉద్రిక్తమైన వాతావరణాన్ని చూసింది.

సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం)కు చెందిన రాజకీయేతర, రాజకీయ వర్గాలు, భారతీయ కిసాన్ యూనియన్ (బీకేయూ, ఉగ్రహన్), కిసాన్ మజ్దూర్ మోర్చా(కేఎంఎం) సహా అనేక రైతు సంఘాలు ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చాయి. ఆయన పర్యటనలో నల్ల జెండాలు చూపించాలని రైతులను, నిరసనకారులను కోరాయి. దీంతో పోలీసు ఉన్నతాధికారులు భద్రతను పెంచారు. వాస్తవానికి, సాయంత్రం ఐదు గంటలకు షెడ్యూల్ చేయబడిన మోడీ ర్యాలీకి కొన్ని గంటల ముందు నుంచే కొంత మంది రైతులు పాటియాలా ఎంట్రీ పాయింట్ల వద్ద నిరసనలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. మోడీ ర్యాలీకి వచ్చేవారిని నిర్దేశించిన పార్కింగ్ ప్రాంతాలకు ఆదేశించారు. వేదిక వద్దకు కనీసం ఒక కిలోమీటరు నడిచి వెళ్లవలసి వచ్చింది. అన్ని ఎంట్రీ పాయింట్ల వద్ద కూడా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాము శాంతియుతంగా నిరసనలు వ్యక్తం చేస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని రైతులు తెలిపారు. సింభు, ఖనౌరీతో పాటు తమను అనుమతించిన ఇతర సరిహద్దు ప్రాంతాల్లో రైతులు సమావేశమయ్యారు. తమ డిమాండ్ల సాధన కోసం కేంద్రానికి వ్యతిరేకంగా జరుపుతున్న పోరాటం వంద రోజులు పూర్తయిన నేపథ్యంలో రైతులు గుమిగూడారు. భద్రతా దళాలు, పోలీసులు రైతులను ఢిల్లీలోకి ప్రవేశించకుండా నిరోధించటంతో అన్నదాతలు సరిహద్దు ప్రాంతాల్లోనే ఈ ఏడాది ఫిబ్రవరి 13 నుంచి నిరసనలు వ్యక్తం చేస్తున్నారు.రైతులు మూడు రహదారులను దిగ్బంధం చేశారు. పాటియాలలోని అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ వద్ద తమకు కేటాయించిన ప్రదేశంలో రైతులు వందలాది మందిగా చేరి ర్యాలీ చేపట్టారు. కొందరు రైతులు గురువారం ఉదయం ధరేరి జట్టన్ టోల్ ప్లాజా వద్ద గుమిగూడి ర్యాలీకి అంతరాయం కలిగించకుండా నిరసన తెలిపారు. బీజేపీ నేత జగదీష్ జగ్గా, ఆయన మద్దతుదారులు ప్రయాణిస్తున్న బస్సులను రైతులు మోడీ పాటియాలా ర్యాలీకి వెళ్లకుండా అడ్డుకున్నారు. తాము ఉదయాన్నే వచ్చామని సిద్ధూపూర్‌కు చెందిన మరో రైతు కార్యకర్త దర్శన్ సింగ్ తెలిపారు. టోల్ ప్లాజా వద్ద రైతులు మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా.. "మేము ఇక్కడే ఉంటాం కానీ బీజేపీ నాయకులు తమ మద్దతుదారులను ముందుకు తీసుకెళ్లడానికి అనుమతించం" అని ఆయన అన్నారు. ఇంతలో, ఎస్కేఎం (నాన్ పొలిటికల్) పిలుపు మేరకు రైతులు గురువారం మధ్యాహ్నం శంభు సరిహద్దు నుంచి పాటియాలాకు వెళ్లటం ప్రారంభించారు. పోలీసులు వారిని నిరోధించారు.

గతంలోనూ మోడీకి రైతుల నుంచి వ్యతిరేకత

ప్రధాని మోడీ పంజాబ్ పర్యటనలో రైతుల ఆగ్రహాన్ని ఎదుర్కోవటం ఇదే మొదటిసారి కాదు. 2022లో, ఫిరోజ్‌పూర్ సమీపంలోని ఫ్లై ఓవర్‌పై రైతుల నిరసన కారణంగా మోడీ కాన్వాయ్‌కు అంతరాయం ఏర్పడింది. దిగ్బంధం కారణంగా.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ ర్యాలీలో ప్రసంగించే ప్రణాళికలను మోడీ రద్దు చేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

రైతుల నిరసనలు దేనికి?

వివిధ రైతు సంఘాలతో అనుబంధం ఉన్న రైతులు తమ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) చట్టంతో సహా తమ వివిధ డిమాండ్లను నెరవేర్చనందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్రంపై అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ వైపు వెళ్లకుండా తమను పంజాబ్, హర్యానాలోని శంభు, ఖానౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద వారిని బలవంతంగా క్యాంప్‌ను ఏర్పాటు చేసేలా ఒత్తిడి చేయటంపైనా రైతన్నలు ఆగ్రహంతో ఉన్నారు. సిర్హింద్ రోడ్‌లోని ఫగ్గన్ మజ్రా వద్ద పాటియాలా, పాత్రన్ రోడ్‌లోని అసర్‌పూర్ చుప్కీ, గురుద్వారాస్ పరమేషర్ ద్వార్ సంగ్రూర్ రోడ్, రఖ్రా మాండౌర్ నభా రోడ్, ఖాసియాన్ పెహోవా రోడ్ వద్ద ఐదు ఎంట్రీ పాయింట్ల వద్ద నిరసనకు రైతు సంఘాలు పిలుపునిచ్చాయి.

బీజేపీ, కాంగ్రెస్‌కు.. పట్టభద్రులు బుద్ధి చెప్పాలి

- సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-హసన్‌పర్తి

మోసాలతో గద్దెనెక్కిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు బుద్ధి చెప్పాలని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. హన్మకొండ హంటర్ రోడ్డులోని సీఎస్సార్ గార్డెన్స్‌లో జరిగిన వరంగల్-నల్లగొండ-ఖమ్మం నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు పేరుతో ఆరు నెలల్లోనే అబాసు పాలైందన్నారు. విద్యార్థులకు రూ.5లక్షల భరోసా, మహిళలకు నెలకు రూ.2500 ఆసరా, రూ.2లక్షల రైతుల రుణమాఫీ, రైతు బంధు ఇందిరమ్మ ఇండ్లు, నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి.. వాటిని అమలు చేయకుండా ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిందని ఆరోపించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నారాయణఖేడ్‌లో విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయడం బాధాకరమన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేండ్లు అయ్యిందని, కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలు హైదరాబాద్‌ను జాయింట్ రాజధానిగా చేయబోతున్నారని ఆరోపించారు. మెకిన్ ఇండియా అని చెప్పి అధికారంలోకి వచ్చిన బీజేపీకి పదేండ్లు అవకాశమిచ్చామని తెలిపారు. కానీ కేంద్ర ప్రభుత్వం.. పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచి ప్రజలపై అదనపు భారాన్ని మోపిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వాళ్లు మన గోదావరి నీటిని కర్నాటక, తమిళనాడుకు తీసుకెళ్తామంటే కాంగ్రెస్ వాళ్లు తలలు ఊపుతున్నారని విమర్శించారు. ఈ సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బండ ప్రకాష్‌రావు, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, సంజీవ్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయభాస్కర్, చల్ల ధర్మారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఇండ్ల నాగేశ్వర్‌రావు, పట్టభద్రులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, పీఏసీఎస్ చైర్మెన్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సరికొత్త పారిశ్రామిక పాలసీ

- సీఎం ఆదేశాలతో ఉన్నతాధికారుల కసరత్తు
- గత ప్రభుత్వ హయాంలో రూ.3,736 కోట్ల బకాయిలు
- బడ్జెట్‌లో కేటాయింపులూ అంతంత మాత్రమే

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో సరికొత్త పారిశ్రామిక పాలసీ కోసం ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. సీఎం ఆదేశాల మేరకు ఆ ప్రక్రియను ప్రారంభించినట్టు ఉన్నతాధికారులు వెల్లడించారు. నూతన పారిశ్రామిక విధానం పేరిట గతంలో హడావుడి చేసిన బీఆర్ఎస్ సర్కార్... చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు భారీగా బకాయి పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. పారిశ్రామికవర్గాలకు హామీనిచ్చిన ప్రోత్సాహకాలను సైతం కేసీఆర్ సర్కార్ పెండింగ్‌లో పెట్టిందనీ, దీంతో చాలా పరిశ్రమలు మూతబడ్డాయని పేర్కొంది. ఈ రూపంలో ఈనెల 20 నాటికి రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహాల కింద దాదాపు రూ.3,736 కోట్లు బకాయిలున్నాయి. వీటిలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించిన బకాయిలు రూ.3,007 కోట్లు కాగా.. భారీ, మెగా పరిశ్రమలకు సంబంధించినవి రూ.728 కోట్లున్నాయి. గత ప్రభుత్వం పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాల నిమిత్తం బడ్జెట్‌లో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినప్పటికీ, వాటిని ఆయా పరిశ్రమలకు విడుదల చేయలేదని ఓ అధికారి పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి కొన్ని పరిశ్రమలకు ఇచ్చిన రూ.684 కోట్ల విలువైన చెక్కులు కూడా ల్యాప్స్ అయినట్టు ఆర్థిక శాఖ వర్గాలు వివరించాయి. ఈ నేపథ్యంలో పరిశ్రమలను ప్రోత్సహించేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా సరికొత్త పాలసీని రూపొందించబోతున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించండి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-నల్లగొండటౌన్

ఈ నెల 27న జరగనున్న ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీల్లో కాంగ్రెస్ మాత్రమే భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో, లౌకిక విధానాన్ని కొనసాగించడంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని చెప్పారు. దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడే పార్టీగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని అన్నారు. బీజేపీ ప్రజల మధ్య మతం పేరిట చిచ్చుపెడుతోందన్నారు. కాకులను, గద్దలను కొట్టి రాబందులకు వేసినట్టు.. ప్రజలను పట్టించుకోకుండా బడా కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే పని చేస్తుందని విమర్శించారు.. నూతన విద్యావిధానం పేరిట విద్యారంగాన్ని ప్రయివేటీకరించేందుకు యత్నిస్తోందన్నారు. అలాంటి పార్టీ అభ్యర్థికి ఓటేయడమంటే.. ప్రజలు తమ కంట్లో తాము పొడుచుకున్నట్టేనని చెప్పారు. బీఆర్ఎస్ కూడా బీజేపీ దారిలో పోతున్నట్టు కనిపిస్తోందని, పదేండ్ల కాలంలో ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరిట నిర్మాణాల్లో అధిక దుబారా ఖర్చులు చేసిందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో వ్యక్తుల గుణగణాలను పెద్దఎత్తున చర్చకు తీసుకొస్తున్నారని, పార్టీల విధానాలు బాగాలేనప్పుడు వ్యక్తులుగా చేసేదేముండదని అన్నారు. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించటమే ఉత్తమమని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన మేడిగడ్డ పనులు చేయాలి

- ఎన్డీఎస్ఏ సిఫారసులు పాటించాలి
- ఎల్అండ్‌టీ, సాగునీటిశాఖ సమీక్షలో :మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశం
- ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక :వచ్చేవారంలో సీఎం, తాను పర్యటిస్తామని వ్యాఖ్య



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని రాష్ట్ర సాగునీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎల్అండ్‌టీ, సాగునీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఎన్డీఎస్ఏ సిఫారసులను కచ్చితంగా పాటించాలని సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన సమీక్షకు సాగునీటి పారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్‌పాటిల్, ఈఎన్సీ జనరల్ బి.అనిల్‌కుమార్, ఎల్అండ్‌టీ కంపెనీ సీనియర్ అధికారులు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్రస్తుత పరిస్థితి, ఎన్డీఎస్ఏ సిఫారసులు, సీడబ్ల్యూసీ బృందం తాజా పర్యటన, జస్టిస్ పినాకిని చంద్రఘోష్ న్యాయ విచారణ కమిషన్ తదితర అంశాలపై సమీక్ష చేసినట్టు తెలిసింది. కేవలం అధికారులు, ఎల్అండ్‌టీ ప్రతినిధులను మాత్రమే సమావేశంలోకి అనుమతించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ మరమ్మతులకు సంబంధించి ఎన్డీఎస్ఏ చేసిన సిఫారసులను కచ్చితంగా అమలుచేయాలని ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిధులకు ఆదేశాలు ఇచ్చారు. వచ్చేవారంలో తాను, ముఖ్యమంత్రి బ్యారేజీలు, పంపుహౌజ్‌లను సందర్శిస్తామని చెప్పారు. మరమ్మతుల సందర్భంగా అయ్యే ఖర్చంతా ఎల్అండ్‌టీ భరించాలనీ, పనుల్లో ఆలస్యం జరగొద్దని స్పష్టం చేశారు. వర్షాకాలం వచ్చేలోగా పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. జస్టిస్ పినానికి చంద్రఘోష్ విచారణ కమిషన్‌కు ఇటు అధికారులు, అటు ఎల్అండ్‌టీ కంపెనీ ప్రతినిదులు సహకరించాలని కోరారు. సమాచారం, ఫైళ్ల సమయానుకూలంగా ఘోష్ కమిషన్‌కు అందజేయాలనీ, సమాచారాన్ని దాస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు అమలు చేయాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు ఎందుకు విఫలమయ్యాయనే సంగతి తేల్చడానికే జస్టిస్ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తప్పుచేసిన వారిని ఎవరినీ వదలబోమని స్పష్టం చేశారు. మరమ్మతుల పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలి

- కేంద్రం ఖర్చు చేస్తుంటే.. రాష్ట్రానికేమి నొప్పి?
- అన్ని రకాల ధాన్యానికీ బోనస్ ఇవ్వాలి : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ-బీబీనగర్

"రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలి.. అన్ని రకాల ధాన్యానికీ బోనస్ ఇవ్వాలి.. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఖర్చును కేంద్రం భరిస్తుంటే.. కొనుగోళ్ల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఏం నొప్పి..?" అని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని బీబీనగర్ మండల పరిధిలోని రాఘవాపురం, రుద్రవెల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద వర్షానికి తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని మహిళా రైతులు మంత్రికి చూపించి తమ బాధను వెలిబుచ్చారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. 45 రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నా. ప్రభుత్వం కనికరం, దయ చూపకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో ఖర్చు చేస్తుందని తెలిపారు. ఐకేపీ సెంటర్ల వద్ద పనిచేసే సిబ్బందితోపాటు సివిల్ సప్లై అధికారులకు కేంద్ర ప్రభుత్వం కమీషన్ అందజేస్తుందని అన్నారు.

అలాంటప్పుడు ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు మాసాల్లోనే రైతు వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. ఆరు గ్యారంటీల హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో వరి ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని మోసం చేసిందన్నారు. ఇప్పుడు కేవలం సన్నరకం ధాన్యానికే రూ.500 బోనస్ ఇస్తామనడం రైతులను మోసం చేయడమేనని అన్నారు. అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ వెంటనే చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సురకంటి రంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం ఘనం...

ఆహార సబ్సిడీ పద్దులో కోతలు
నామమాత్రపు కేటాయింపులతో సరి

ఉచిత రేషన్ పంపిణీతో రాజకీయ లబ్ధికి బీజేపీ ప్రయత్నం

ప్రయోజనం స్వల్పం

దేశంలోని 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహారధాన్యాలు అందిస్తున్నామని ప్రధాని నరేంద్ర మోడీ గొప్పగా చెప్పుకుంటారు. ఈ పథకం తమపై ఓట్ల వర్షం కురిపిస్తుందని కమలనాథులు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ పథకం యూపీఏ ప్రభుత్వ పాలనలో చేపట్టిందే. కాకపోతే అప్పుడు సబ్సిడీ ధరపై పేదలకు ఆహారధాన్యాలు అందించే వారు. ఇప్పుడు ఉచితంగా ఇస్తున్నారు. అయితే ఈ ఉచిత పంపిణీ వల్ల నిరుపేదలు, పేదలకు ఆర్థికంగా పెద్దగా ఒరుగుతోంది ఏమీ లేదు. అదీకాక ప్రభుత్వం పెట్టే మొత్తం బడ్జెటరీ వ్యయంలో ఈ ఆహార సబ్సిడీ పద్దుకు విదిలిస్తోంది ఐదు శాతం కంటే తక్కువగానే ఉంటోంది. అంటే ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం నామమాత్రమే.



యూపీఏ హయాంలోనే ప్రారంభం

న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వ పాలనలో అందరికీ సుపరిచితమైన సంక్షేమ పథకం ఒకటి ఉంది. అదే ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పీఎంజీకేఏవై). ఈ పథకం కింద ఉచిత ఆహారధాన్యాలు పొందేందుకు దేశంలోని 80 కోట్ల మంది అర్హులు. ఈ పథకం ప్రధానికి మంచి పేరే తెచ్చి పెట్టింది. అయితే దీని నేపథ్యాన్ని గమనిస్తే...2013లో ప్రజల నుండి వచ్చిన డిమాండ్ మేరకు అప్పటి యూపీఏ ప్రభుత్వం జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం దేశంలోని గ్రామీణ జనాభాలో 75శాతం మంది, పట్టణ జనాభాలో 50 శాతం మంది సబ్సిడీ ధరపై ఆహారధాన్యాలు పొందారు. ఇతర ప్రభుత్వ పథకాల మాదిరిగా కాకుండా దీనికి చట్టరూపం కల్పించారు.

ఆహార భద్రతా చట్టం అంటే...

జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అత్యంత నిరుపేద కుటుంబాలకు నెలకు మొత్తం 35 కిలోల ఆహారధాన్యాలు అందించారు. కిలో బియ్యం మూడు రూపాయలు, కిలో గోధుమలు రెండు రూపాయలు, కిలో తృణధాన్యాలు రూపాయికి అందజేశారు. ఇక పేద కుటుంబాలకు సంబంధించి ఒక్కో లబ్దిదారుడికి ఇవే ధరలపై ఐదు కిలోల ఆహారధాన్యాలు అందించారు. మోడీ తొలిసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇది కొనసాగింది.

రేషన్ సంచులపై మోడీ బొమ్మ

2020లో కోవిడ్ మహమ్మారి దేశాన్ని అతలాకుతలం చేసినప్పుడు పేదలు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆహారధాన్యాల పంపిణీ పరిమాణాన్ని రెట్టింపు చేసింది. ఎనిమిది నెలల పాటు వాటిని ఉచితంగా అందజేసింది. గత సంవత్సరం జనవరి 1 నాటికి కోవిడ్‌కు సంబంధించిన అన్ని సహాయక చర్యలను నిలిపివేసినప్పటికీ ఉచిత ఆహారధాన్యాల పంపిణీని మాత్రం కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జనవరి 1 నుండి ఐదు సంవత్సరాల పాటు ఇది కొనసాగుతుంది. అయితే నిరుపేదలు, పేదలకు అందజేస్తున్న ఆహారధాన్యాల సంచులపై ప్రధాని మోడీ చిత్రాన్ని ముద్రించారు. దీంతో అందరూ ఇది మోడీ పథకమేమోనని భావించారు. వాస్తవానికి సబ్సిడీ ధరపై ఆహారధాన్యాల పంపిణీ అనేది యూపీఏ పాలనలోనే మొదలైంది. కాకపోతే ఇప్పుడది ఉచిత పంపిణీగా మారింది. అంతే తేడా.

> **10-14 కోట్ల మంది దూరం**
>
> ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే ఆహారధాన్యాల ఉచిత పంపిణీ 80 కోట్ల మంది ప్రజలకు ఎంతో కొంత లబ్ధి చేకూరుస్తున్నప్పటికీ మరో 10-14 కోట్ల మందికి ఈ పథకం వర్తించడం లేదు. ఈ లెక్కలు కూడా 2011 నాటివి. అప్పటి నుండి జనగణన సహా పలు పత్రాలను తాజా పరచలేదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు అర్హులైన లబ్ధిదారుల సంఖ్య మరింత పెరిగి ఉండవచ్చు.

గోరంత ప్రయోజనమే

వాస్తవానికి ఆహారధాన్యాల ఉచిత పంపిణీ పథకం నిరుపేదలు, పేదలకు పెద్దగా ఆర్థిక ప్రయోజనం కలిగించలేదు. అత్యంత నిరుపేద కుటుంబాలు తాము వినియోగించే ఆహారధాన్యాల పరిమాణం ఆధారంగా బియ్యంపై నెలకు రూ.70, గోధుమలపై రూ.105 మాత్రమే ప్రయోజనం పొందాయి. ఈ కొద్దిపాటి వెసులుబాటుతో పేదల కష్టాలు గట్టెక్కుతాయా? రేషన్ సంచులపై మోడీ బొమ్మను ముద్రించినంత మాత్రాన వారంతా బీజేపీకే ఓటేస్తారా? అసలు పీఎంజీకేఏవై ద్వారా ఎంతమంది లబ్ధి పొందారు అనేది పరిశీలిస్తే జాతీయ స్థాయిలో 2023 జూన్ 30 నాటికి 8.95 కోట్ల మంది నిరుపేదలు, 71.15 కోట్ల మంది పేదలు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందారు. అయితే పేదలతో పోలిస్తే నిరుపేదలే ఎక్కువ లబ్ధి పొందారు. ఎందుకంటే వారికి పేదల కంటే ఎక్కువ పరిమాణంలో ఉచితంగా ఆహారధాన్యాలు లభించాయి.

> **ఆర్థిక భారం తక్కువే**
>
> సబ్సిడీపై పంపిణీ నుండి ఉచిత పంపిణీకి నిర్ణయం తీసుకోవడం వల్ల ప్రభుత్వంపై ఎంత భారం పడిందో పరిశీలిద్దాం. జాతీయ ఆహార భద్రతా చట్టం కింద ఆహారధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీ ఖర్చును కలిపి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్‌లో 'ఆహార సబ్సిడీ'గా చూపుతోంది. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పుడు జాతీయ ఆహార భద్రతా చట్టం అమలు కోసం ప్రభుత్వం సుమారు 6 శాతం (మొత్తం బడ్జెట్ వ్యయంలో) ఖర్చు చేసింది. ఆ తర్వాత రెండు సంవత్సరాల పాటు ఆహార సబ్సిడీని పెంచింది. 2016 నుండి 2020 వరకూ ఆహార సబ్సిడీపై ప్రభుత్వ వ్యయం తగ్గుతూ వచ్చింది. 2020లో మొత్తం ప్రభుత్వ వ్యయంలో ఆహార సబ్సిడీ కోసం పెట్టిన ఖర్చు కేవలం 4 శాతం మాత్రమే. కోవిడ్ తర్వాత ఈ పద్దు కింద వ్యయం ఎప్పుడూ 5 శాతం కంటే తక్కువగానే ఉంటోంది. దీనిని బట్టి అర్థమవుతోంది ఏమంటే సబ్సిడీపై పంపిణీ నుండి ఉచిత పంపిణీకి మారడం వల్ల ప్రభుత్వంపై పెద్దగా ఆర్థిక భారం పడలేదు. కానీ ప్రచారం మాత్రం లభించింది.

రాజకీయ ప్రభావం ఉంటుందా?

దేశంలోని పలు రాష్ట్రాలు అర్హత కలిగిన కుటుంబాలన్నింటికీ దాదాపుగా ఆహారధాన్యాలు అందజేస్తున్నాయి. 2016 నాటికే జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని అన్ని రాష్ట్రాలు అమలు చేయడంతో ఇదేమీ ఆశ్చర్యం కలిగించే విషయం కాదు. అయితే ఆసక్తికరమైన విషయమేమంటే ప్రధాని స్వరాష్ట్రమైన గుజరాత్ మాత్రం లక్ష్యానికి దూరంగానే ఉంది. అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, ఒడిషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలు జనాభాలో 80 శాతం మందిని లబ్ధిదారులుగా గుర్తించాయి. ఈ రాష్ట్రాలన్నీ దాదాపుగా రాజకీయ ప్రాధాన్యత కలిగినవే. లోక్‌సభలోని మొత్తం స్థానాల్లో మూడో వంతు స్థానాలు ఈ రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఆహారధాన్యాల పంపిణీ ఓట్లను రాలిస్తే...లేదా కనీసం కొంతమంది లబ్ధిదారులైనా పాలక పక్షానికి ఓటేస్తే...ఈ పథకం చూపే రాజకీయ ప్రభావం గణనీయంగానే ఉంటుంది.



ఢిల్లీ మెట్రో రైలులో రాహుల్ గాంధీతో ప్రయాణికుల సెల్ఫీ

పట్టణ ఓటర్లపై రాజకీయ ప్రకటనల ప్రభావం



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీలు ఇచ్చిన ప్రకటనలు పట్టణ ఓటర్లపై ప్రభావం చూపాయని యూగవ్ సంస్థ నిర్వహించిన సర్వే తెలిపింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన ప్రతి పది మంది పట్టణ ఓటర్లలో ఆరుగురు బీజేపీ ప్రకటనల కారణంగా ప్రభావితులయ్యారని ఆ సర్వే తేల్చింది. ఎన్నికల సమయంలో తాము రాజకీయ ప్రకటనలు చూశామని 76శాతం మంది తెలుపగా కేవలం 14శాతం మంది మాత్రమే వాటిని పట్టించుకోలేదని చెప్పారు.

కనీసం ఒక ప్రకటన అయినా చూశామని చెప్పిన వారిలో 81 శాతం మంది బీజేపీ యాడ్స్‌ను వీక్షించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రకటనలు చూశామని 47శాతం మంది తెలియజేశారు. ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రకటనలు చూశామని కేవలం 12శాతం మంది మాత్రమే చెప్పారు. ఇతర పార్టీల యాడ్స్‌ను 7శాతం మంది చూశారు. 1981-1996 మధ్య జన్మించిన వారు ఎక్కువగా కాంగ్రెస్ ప్రకటనలు చూడడం గమనార్హం. రాజకీయ ప్రకటనలు వచ్చిన మాధ్యమాలలో యూట్యూబ్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ వేదికలో తాము యాడ్స్ చూశామని 67 శాతం మంది తెలిపారు. 58 శాతం వీక్షకులతో టీవీ రెండో స్థానంలో నిలిచింది. 43 శాతం మందితో ఇన్‌స్టాగ్రామ్, 38 శాతం మందితో వాట్సప్, 35 శాతం మందితో మెటా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. బీజేపీ ప్రకటనలు సృజనాత్మకంగా ఉన్నాయని 58 శాతం మంది పట్టణ ఓటర్లు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ యాడ్స్‌పై 28 శాతం మంది, ఆప్ ప్రకటనలపై 6 శాతం మంది ఈ రకమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



నోటీసు చూసి షాకయ్యా !

- పిలవకపోతే ఎలా ప్రచారం చేస్తా? : మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ జయంత్ సిన్హా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎన్నికల ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదంటూ పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై బీజేపీ సీనియర్ నేత, హజారీబాగ్ ఎంపీ జయంత్ సిన్హా స్పందించారు. నోటీసును చూసి ఆశ్చర్యపోయానన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఎందుకు ఓటు వేయలేదని, ఎన్నికల ప్రచారంలో ఎందుకు పాల్గొనలేదో వివరణ అడుగుతూ బీజేపీ జార్ఖండ్ ప్రధాన కార్యదర్శి ఆదిత్య సాహు షోకాజ్ నోటీసు జారీ చేశారన్నారు. వ్యక్తిగత కారణాల రీత్యా తాను విదేశాల్లో ఉండటంతో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు ఉపయోగించుకున్నట్టు ఆయన తన సమాధానంలో పేర్కొన్నారు. షోకాజ్ నోటీసుపై రెండు పేజీల వివరణతో కూడిన లేఖను జయంత్ సిన్హా విడుదల చేశారు. షోకాజ్ నోటీసు చూడగానే తాను షాకయ్యానని, ఆ లేఖ మీడియాలో ప్రత్యక్షమవ్వడంతో మరింత ఆశ్చర్యానికి గురయ్యానని సిన్హా పేర్కొన్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేయబోనని తాను ఈ ఏడాది మార్చి 2న ప్రకటించిన విషయాన్ని లేఖలో పొందుపర్చారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డాతో మాట్లాడిన తరువాత ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

పిలవకపోతే ఎలా ప్రచారం చేస్తా?

హజారీబాగ్ అభ్యర్థిగా పార్టీ మనీష్ జైస్వాల్‌ను ప్రకటించిందని, మార్చి8న ఆయనకు తాను అభినందనలు తెలపడంతో ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలిపానన్నారు. తాను ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని పార్టీ భావించి ఉంటే తనను సంప్రదించి ఉండేవారని, జార్ఖండ్‌కు చెందిన పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే, పార్టీ ముఖ్య నాయకులు ఎవరూ తనను సంప్రదించలేదని సిన్హా లేఖలో పేర్కొన్నారు. పార్టీ బహిరంగ సభలు, సంస్థాగత సమావేశాలకు తనను పిలవలేదన్నారు. లోక్‌సభ స్పీకర్‌కు సమాచారం ఇచ్చిన తరువాత వ్యక్తిగత పనుల కారణంగా మే10న విదేశాలకు వెళ్లానని జయంత్ సిన్హా స్పష్టం చేశారు. పార్టీ తనను ఎలాంటి కార్యక్రమాలకు పిలవకపోవడంతో తన అవసరం లేదనిపించిందన్నారు. విదేశాలకు వెళ్లే ముందు తాను పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. తాను ఓటు వేయలేదని ఆరోపించడం సరికాదన్నారు. పార్టీలో తన బాధ్యతలను ఎంతో నిబద్ధతతో, నిజాయితీతో నిర్వర్తించానని, అలాగే తన పనితీరుకు ఎన్నోసార్లు ప్రశంసలు లభించిన విషయాన్ని లేఖలో సిన్హా గుర్తుచేశారు.

నిరాశకు లోనయ్యా

తనకు పార్టీ ఇచ్చిన షోకాజ్ నోటీసుపై మీడియాలో ప్రచారం కావడం నిరాశ పర్చిందన్నారు. ఈ లేఖను బహిరంగ పర్చడం తన దృష్టిలో సరికాదన్నారు. ఇటువంటి వైఖరి అంకితభావంతో పనిచేసే పార్టీ కార్యకర్తలను నిరాశ పరచడమే అవుతుందన్నారు. పార్టీ కోసం విధేయతతో పనిచేసే తనను కావాలని టార్గెట్ చేసినట్లు కనిపిస్తోందని సిన్హా తన వివరణలో పేర్కొన్నారు.

ఇదేం తీరు?

ఈసీని ఎండగట్టిన ది హిందూ, డక్కన్ హెరాల్డ్ సంపాదకీయాలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల నిర్వహణ తీరుపై రెండు ఆంగ్ల పత్రికలు గురువారం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి. ఎన్నికల నిర్వహణలో ఈసీ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించాయి. ఈ మేరకు ది హిందూ, డక్కన్ హెరాల్డ్ పత్రికలు తమ సంపాదకీయాల్లో ఈసీ తీరును ఎండగట్టాయి.

ఎన్నికల ప్రసంగాల్లో మతపరమైన అంశాలు లేవనెత్తవద్దని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈసీ తాజాగా రాసిన లేఖను 'ది హిందూ' పత్రిక సంపాదకీయం ప్రస్తావించింది. అయితే ఇప్పటికే ఆలస్యమైందని, తాను నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నానని ప్రజలకు ఈసీ నచ్చచెప్పలేకపోయిందని వ్యాఖ్యానించింది. డక్కన్ హెరాల్డ్ పత్రిక మరింత కఠిన పదజాలంలో ఈసీపై మండిపడింది. అన్ని విషయాల్లో ఈసీ వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోందని తెలిపింది.

అసమర్థత చాటుకున్న ఈసీ : ది హిందూ

'బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఈసీ లేఖలు రాయడం గుడ్డిలో మెల్ల మాదిరిగా ఉంది. ఈసీ తన అసమర్థత కారణంగా ఓటర్లను నిరుత్సాహానికి గురిచేసింది. సమర్థతతో, నిష్పాక్షికతతో సజావుగా ఎన్నికలు నిర్వహించి కాపలా కుక్క మాదిరిగా ఉండాల్సిన ఈసీ తన అసమర్థతను చాటుకుంది. దీనంతటికీ కమిషన్ సభ్యులను నియమించిన పాలకులే బాధ్యత వహించాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ మంత్రి కొండా సురేఖ, బీజేపీ నేతలు శోభా కరంద్లజే, దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకులు సుప్రియా శ్రినాటే, రణదీప్ సూర్జివాలాపై ఈసీ తీసుకున్న చర్యల కారణంగా కొంత నిష్పాక్షికత కన్పించినా అది సరిపోదు' అని 'ది హిందూ' సంపాదకీయం తెలిపింది. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్, అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై వచ్చిన ఫిర్యాదులు ఇప్పటికీ పెండింగులోనే ఉన్నయని ఆ పత్రిక గుర్తు చేసింది.



దాని పనులు కోర్టులు చేస్తున్నాయి : డక్కన్ హెరాల్డ్

ఈసీ చేయాల్సిన పనులను ఇప్పుడు న్యాయస్థానాలు చేస్తున్నాయని డక్కన్ హెరాల్డ్ వ్యాఖ్యానించింది. 'అభ్యంతరకరమైన, అపవాదులు వేసే ప్రకటనలు ఇవ్వవద్దని కలకత్తా హైకోర్టు బీజేపీని ఆదేశించింది. ఫిర్యాదులపై ఈసీ సకాలంలో స్పందించడం లేదని చెప్పడానికి ఇదో ఉదాహరణ. కోల్‌కతా కేసు ఒక్కటే కాదు. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి సకాలంలో చర్యలు తీసుకోవడంలో ఈసీ వైఫల్యం అనేక సందర్భాల్లో బహిర్గతమైంది. ఒకవేళ చర్యలు తీసుకున్నప్పటికీ అవి ఛోటా నాయకుల పైనే. అది కూడా సకాలంలో కాకుండా ఆలస్యంగా తీసుకున్నది. గత ఎన్నికల్లో కంటే ఇప్పుడు విద్వేష ప్రసంగాలు, మతపరమైన ప్రకటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రధాని మోడీ ముస్లింలపై విషం చిమ్ముతున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ తన స్వతంత్రతను తానే నీరుకారుస్తోంది. ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోవడంలో విఫలం కావడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. రాజకీయ పార్టీలకు బుధవారం జారీ చేసిన సాధారణ మార్గదర్శకాలు ఈ అభిప్రాయాన్ని మార్చలేకపోతున్నాయి' అని తెలిపింది.

ఓట్ల తారుమారుకు అవకాశం

120 పౌర సమాజ సంస్థల హెచ్చరిక



న్యూఢిల్లీ : లెక్కింపు రోజున ఓట్లను తారుమారు చేసే అవకాశం ఉన్నదని 120 పౌర సమాజ సంస్థలు హెచ్చరించాయి. ఎన్నికల కమిషన్‌ను ఎలా జవాబుదారీ చేయాలనే విషయంపై పలువురు హక్కుల కార్యకర్తలు, ప్రభుత్వ మాజీ ఉన్నతోద్యోగులు, నిపుణులు కర్నాటకలో ఆరు గంటల పాటు కూలంకషంగా చర్చించారు. న్యూఢిల్లీలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. విధి నిర్వహణలో ఈసీ తరచుగా విఫలమవుతున్న నేపథ్యంలో ఈ సమావేశం అవసరమైందని రాజకీయ ఆర్థికవేత్త పరకాల ప్రభాకర్ తెలిపారు.

'ఇప్పుడు మాకు ఓ పరిమితమైన లక్ష్యం ఉంది. ప్రజలు బ్యాలెట్ ద్వారా తమ తీర్పును వెలువరించాలి. అది ఏదైనా సరే. అలా జరగకపోతే ప్రజల పౌర హక్కుల పరిరక్షణ కోసం పౌర సమాజం దానిని సవాలు చేయాల్సి వస్తుంది' అని పరకాల చెప్పారు. ఎన్నికల కమిషన్ సభ్యుల నియామక ప్రక్రియ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పించడం ఈసీ నిష్పాక్షికతపై తీవ్రమైన అనుమానాలు రేకెత్తిస్తోందని అన్నారు. తాము ఈసీని నిందించడం లేదని, అయితే తమ అనుమానాలు నిరాధారమైనవని ఆ సంస్థ తేల్చాల్సి ఉంటుందని చెప్పారు. కానీ ఈసీ చర్యలు తమ అనుమానాలను మరింత పెంచుతున్నాయని అన్నారు. ప్రధాని, ఆయన పార్టీ విద్వేష ప్రసంగాలు చేస్తున్నా, ప్రవర్తనా నియమావళిని తరచూ ఉల్లంఘిస్తున్నా దానిని అడ్డుకోవడంలో లేదా కనీసం నిరుత్సాహపరచడంలో ఈసీ విఫలమైందని ఆరోపించారు.

దేశంలో ఇప్పుడు జరుగుతున్నంతగా గతంలో ఎన్నడూ ఎన్నికలు అనుమానంతో, అపోహలతో జరగలేదని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎంజీ దేవసహాయం చెప్పారు. ప్రజాస్వామ్యం కావాలా నియంతృత్వం కావాలా అనేదే ఇప్పుడు ప్రజల ముందు ఉన్న ప్రశ్న అని ఆయన అన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాద్ సూచించారు. ఉత్తరప్రదేశ్‌లోని సంబల్, అమేథీలో ఓటర్లపై లాఠీఛార్జీ చేశారని 'యునైటెడ్ అగనెస్ట్ హేట్' సంస్థకు చెందిన నదీమ్ ఖాన్ తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని బీజేపీ జైల్లో పెడితే..

అక్కడి నుంచే నడుపుతాం: కేజ్రీవాల్



(మొదటి పేజీ తరువాయి)

వ్యాపారం చేయడం, ఢిల్లీకి పూర్తి రాష్ట్ర హెూదా ఇస్తాం. అవినీతిపరులకు రక్షణ కల్పించే బీజేపీ "వాషింగ్ మెషీన్"ని నాశనం చేయడంలో ఇండియా వేదిక పార్టీలు భాగస్వాములౌతాయని నేను కచ్చితంగా అనుకుంటున్నా. ఇండియా వేదికకి బలమైన మూలస్తంభం ఆప్. జూన్ 4న ఇండియా వేదిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, మేము ఈ హామీలను సమిష్టిగా నెరవేరుస్తాం.

మీరు గతంలో శరద్ పవార్, సోనియా గాంధీ వంటి పలువురు నేతలను అవినీతిపరులని అన్నారు. మీరు ఇప్పుడు వారిలో కొందరితో వేదికను పంచుకుంటు న్నారు. మార్పును మీరు ఎలా వివరిస్తారు?

కేజ్రీవాల్ : చరిత్రలో ఎన్నడూలేనంతగా భారతదేశ ప్రజాస్వామ్యం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 'ప్రతిపక్ష-ముక్త్' భారతదేశం అనే కల కోసం మన ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ప్రతి సంస్థపై 10 సంవత్సరాలు ఎడతెగని దాడులను మనం చూశాము. ప్రతిపక్ష పార్టీలుగా విభేదాలను లెక్కించడానికి ఇది సమయం కాదు. అందరూ ఏకమై భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి భాగస్వాములు కావాల్సిన సమయం ఇది. ప్రజాస్వామ్యం లేకపోతే, మనం ఏ పార్టీలో ఉన్నామన్నది ఎలా ముఖ్యం అవుతుంది? రష్యాలో పుతిన్ తన శాశ్వత పాలనను స్థాపించి, ఇటీవల ఎన్నికల్లో 84 శాతం ఓట్లతో ఎలా గెలిచారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాకు ఇటీవల 75 శాతం ఓట్లు వచ్చాయి. ప్రతిపక్షాన్ని ఎలా తుడిచిపెట్టి గెలిచారు. అదే విధంగా భారతదేశంలో ప్రధాని మోడీ 'వన్ నేషన్, వన్ లీడర్' మిషన్‌ను ప్రారంభించారు. వీరే ప్రధాని మోడీకి ఆదర్శం. దేశంలో ఇది జరగడానికి మనం అనుమతిస్తే, సాధారణ ప్రజల స్వరం లేకుండా పోతుంది. మనకు శాశ్వతంగా ఒకే పార్టీ పాలన మిగిలిపోతుంది. ఇప్పటికే చాలా నష్టం జరిగిపోయినప్పటికీ, అది జరగకుండా నిరోధించడానికి, నియంతత్వం నుంచి మన దేశాన్ని రక్షించడానికి '2024' భారతదేశ ప్రజలకు ఉన్న చివరి అవకాశం.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మీ పార్టీ రెండు నిర్ణయాత్మక విజయాలు సాధించగలిగింది. కానీ ఢిల్లీ నుంచి లోక్‌సభ సీటును గెలుచుకోలేకపోయింది. ఈసారి మీ పార్టీ విధానం దీనికి భిన్నంగా ఉంటుందా?


కేజ్రీవాల్ : ఈసారి రెండు పెద్ద మార్పులు చోటుచేసుకున్నాయి. గత పదేండ్లలో ఆప్ శరవేగంతో అభివద్ధి చెందింది. దశాబ్దంలో జాతీయ పార్టీగా అవతరించిన మొదటి పార్టీగా నిలిచింది. బీజేపీ, కాంగ్రెస్ తర్వాత రెండు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఉన్న ఏకైక పార్టీ మాదే. మాకు నాలుగు రాష్ట్రాలలో ఎమ్మెల్యేలు ఉన్నారు. భారతదేశం అంతటా స్థానిక సంస్థలకు ఎన్నికైన అసంఖ్యాక సభ్యులు ఉన్నారు. గతంలో లోక్‌సభ ఎన్నికల్లో చిన్న ప్రాంతీయ పార్టీగా పోటీ చేశాం. నేడు మేము జాతీయ శక్తిగా ఉన్నాం. జాతీయంగా ఆకర్షించే పాలనా నమునాను కలిగి ఉన్నాం. మరో పెద్ద మార్పు ఏమిటంటే మేము పోరాడడం ఇదే మొదటిసారి.

మీరు కుల ఆధారిత రిజర్వేషన్లకు మద్దతిస్తారా?

కేజ్రీవాల్ : కచ్చితంగా. సమాజంలోని అట్టడుగున నివసిస్తున్న వర్గాలు ప్రధాన స్రవంతిలో ఖాళీలను ఆక్రమించుకోవడానికి కుల ఆధారిత రిజర్వేషన్లు సహాయపడతాయి. ఇది వారి హక్కు. రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్‌ను అంతం చేయాలని భావిస్తున్నందున తమకు 400 ప్లస్ సీట్లు కావాలని సీనియర్ బీజేపీ సభ్యులు బహిరంగంగా చెప్పడం నాకు షాకింగ్‌గా ఉంది. బీజేపీ రాజ్యాంగాన్ని, బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను గౌరవించడం లేదు. వారు దానిని మార్చడానికి తహతహలాడుతున్నారు. కాని మేము మా చివరి శ్వాస వరకు వారితో పోరాడుతాం.

సంపాదకీయం

ఆ నిర్ణయాన్ని స్వాగతిద్దాం..



అనేక తర్జన భర్జనల తరువాత 2024 మేనెల 28లోగా పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలని స్పెయిన్, ఐర్లాండ్,నార్వే నిర్ణయించాయి. నిజానికి 2014 నవంబరు 17న ఒక తీర్మానంలో 319-2 ఓట్ల తేడాతో గుర్తించేందుకు ప్రభుత్వానికి అధికారమిస్తూ ఒక తీర్మానాన్ని స్పెయిన్ పార్లమెంటు తీర్మానించింది. ప్రధాన స్రవంతికి దూరంగా లేదా వ్యతిరేక శిబిరంలో ఉండి ఇంతకాలంగా విమర్శలపాలైన ఈ దేశాలు ఇప్పటికైనా ఈ సముచిత నిర్ణయం తీసుకోవటాన్ని స్వాగతించాల్సిందే. అయితే దీనివలన కొత్తగా పాలస్తీనా అరబ్బులకు ఒరిగేదేమి ఉంటుంది అన్న వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇప్పటికే 139 దేశాలు గుర్తించాయి. ఐరాసలో పాలస్తీనాకు ఇప్పుడున్న పరిశీలక హోదా స్థాయికి బదులు పూర్తిస్థాయి దేశంగా గుర్తించాలనే బాటలో మరొక అడుగువేసే తీర్మానంపై తాజాగా 143 దేశాలు మద్దతుగా ఓటువేశాయి. పరిశీలక హోదాకు పరిమితం కాకుండా కొత్త హక్కులు, చర్చల్లో అన్ని అంశాలపై మాట్లాడే సభాహక్కులు ఇవ్వాలన్నదే దాని సారం, మరో విధంగా చెప్పాలంటే పూర్తి స్థాయి సభ్యత్వ హోదాను ఆమోదించటమే. భద్రతా మండలిలో తీర్మానం పెడితే నరుకుతా అంటూ 'వీటో' కత్తితో వీరంగం వేస్తున్న అమెరికా ఉన్నంతవరకు ఇలాంటి ఎన్ని తీర్మానాలు చేసినా ప్రయోజనం ఉండదు. మరి మూడుదేశాల గుర్తింపుతో ఎలాంటి ప్రభావం ఉండదా అంటే తప్పకుండా ఉంటుంది. పాలస్తీనాను వ్యతిరేకిస్తున్న శక్తులపై ఒత్తిడి పెరుగుతుంది. వాటి ప్రజాస్వామ్య, మానవత్వ ముసుగులు మరికొంత చిరిగి నగ్నరూపాలు మరింతగా కనిపిస్తాయి. మొద్దుబారిన పాలకుల దున్నపోతు చర్మాల మీద స్పందన లేకున్నా పౌరుల్లో చురుకు పుట్టిస్తాయి. అమెరికా, ఐరోపా దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో ఉద్యమిస్తున్న విద్యార్థులకు ఊపుని స్తాయి, దూరంగా ఉన్నవారికి మనమెందుకు స్పందించటం లేదనే ఆలోచన కలిగిస్తాయి.

> మూడు దేశాల చర్యతో ఐరోపాలో మరికొన్ని దేశాలు అదే బాట పట్టవచ్చనే చర్చ జరుగుతోంది.తాము కూడా పరిశీలిస్తున్నట్లు మాల్టా, స్లోవేనియా మార్చినెలలో ప్రకటించాయి. ఐరోపా స్పందన ఎంతో బలహీనంగా ఉన్నందున మిగతా దేశాలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా గుర్తింపు ఇచ్చేందుకు ముందుకు పోవాల్సిన పరిస్థితిలో ఉన్నామని ఈ రెండు దేశాల ప్రధానులతో మాడ్రిడ్‌లో జరిపిన చర్చల తరువాత స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ ప్రకటించాడు.తాము కూడా వీటితో జతకడతామని బెల్జియం, పోర్చుగల్ దేశాలు సంకేతాలు పంపినప్పటికీ అడుగు ముందుకు పడలేదు.

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, రక్షణ మంత్రి గాలాంట్‌కు సమన్లు జారీచేయాలని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ప్రాసిక్యూటర్ కోరటం ఇజ్రాయిల్‌కు దిగ్భ్రాంతి కలిగించింది. దీనికి తోడు మూడు దేశాల ప్రకటనతో ఇజ్రాయిల్‌కు ఆగ్రహం కలిగింది. ఉక్రోషంతో ఆ దేశాల నుంచి తమ రాయబారులు వెనక్కు రావాలని ఆదేశించింది. ఉగ్రవాదానికి ఇచ్చిన బహుమతి అంటూ చిందులేసింది. స్వతంత్ర పాలస్తీనాను రెండుగా విభజించి ఇజ్రాయిల్ ఏర్పాటుకు ఐరాస తీర్మానించిన సంగతి తెలిసిందే. తరువాత అడ్డం తిరిగిన పశ్చిమదేశాలు పాలస్తీనాను గుర్తించేందుకు అంగీకరిస్తూనే ఆచరణ సాధ్యం గాని షరతులను ముందుకు తెస్తూ అడ్డుపడుతున్నాయి.రెండు పక్షాల మధ్య నేరుగా సంప్రదింపులు జరిగిన తరువాతే తప్ప ఏకపక్షంగా గుర్తింపు ఇవ్వకూడదన్న తన అప్రజాస్వామిక వైఖరిని మరోసారి మూడు దేశాల ప్రకటన తరువాత అమెరికా ప్రదర్శించింది. గాజాలో హమాస్ ఉన్నంత వరకు పాలస్తీనా దేశాన్ని తాము గుర్తించబోమని బ్రిటన్ విదేశాంగ మంత్రి కామెరాన్ సెలవిచ్చాడు. హమాస్ నిన్నగాక మొన్న ఉనికిలోకి వచ్చింది, అంతకు ముందు ఎందుకు గుర్తించలేదన్న ప్రశ్నకు సమాధానం ఏమిటి ? మేకపిల్లను తినదలచుకున్న తోడేలు చెప్పిన కుంటిసాకు కథ తప్ప మరొకటి కాదు. తనకు కేటాయించిన ప్రాంతాలకు పరిమితం గాకుండా తమ రక్షణకు హామీగా ఉండాలంటూ అడ్డగోలు వాదనలతో పాలస్తీనా ప్రాంతాలను ఆక్రమించుకోవటమే కాదు, జనాభా స్థితిగతులను మార్చివేసేందుకు ఆ ప్రాంతాలలో యూదుల నివాసాలను ఏర్పాటు చేసింది ఇజ్రాయిల్. అరబ్బులను మైనారిటీగా మార్చి వాటిని చూపి అవి కూడా తమవే అంటున్న ఇజ్రాయిల్‌తో పాలస్తీనా విముక్తిని కోరుకుంటున్నవారికి ఏకీభావం ఎలా ఉంటుంది.

మూడు దేశాల చర్యతో ఐరోపాలో మరికొన్ని దేశాలు అదే బాట పట్టవచ్చనే చర్చ జరుగుతోంది.తాము కూడా పరిశీలిస్తున్నట్లు మాల్టా, స్లోవేనియా మార్చినెలలో ప్రకటిం చాయి. ఐరోపా స్పందన ఎంతో బలహీనంగా ఉన్నందున మిగతా దేశాలతో నిమిత్తం లేకుండా ఏకపక్షంగా గుర్తింపు ఇచ్చేందుకు ముందుకు పోవాల్సిన పరిస్థితిలో ఉన్నామని ఈ రెండు దేశాల ప్రధానులతో మాడ్రిడ్‌లో జరిపిన చర్చల తరువాత స్పెయిన్ అధ్యక్షుడు పెడ్రో సాంచెజ్ ప్రకటించాడు. తాము కూడా వీటితో జతకడతామని బెల్జియం, పోర్చుగల్ దేశాలు సంకేతాలు పంపినప్పటికీ అడుగు ముందుకు పడలేదు. ఇన్ని దేశాలు తమ వైఖరిని స్పష్టంగా వెల్లడిం చినా ఇజ్రాయిల్, దాని దుండగాలకు మద్దతు, పాలస్తీనా స్వతంత్ర దేశ ఏర్పాటుకు మోకాలడ్డుతున్న అమెరికా మరికొన్ని దేశాల వైఖరిలో రాని మార్పు ఇప్పుడు వస్తుందని భావించనవసరం లేదు. వీటో కత్తిని ఝులిపిస్తున్న అమెరికా ఉన్నంత వరకు దానికి తోడుగా ఇజ్రాయిల్ మినహా ప్రపంచ దేశాలన్నీ గుర్తించినా ఆచరణలో తక్షణ ప్రయోజనం కనిపించదు.

మోడీకి కలలో అయోధ్య రాముడెందుకు చెప్పలేదూ?


డాక్టర్ దేవరాజు మహారాజు


ప్రజలు వాస్తవమైన ఆనందం ఏమిటో గ్రహించిన రోజున, ఆ ఆనందాన్ని పొందడం సాధ్యమేనని తెలుసుకున్న రోజున, మతం అదృశ్యమౌతుంది- అయితే, పాలకవర్గాలు తమ ప్రయోజనాల రీత్యా- ప్రజలు అసలు విషయం తెలుసుకోకుండా అడ్డుపడు తుంటారు. తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి మతాన్ని ఉపయోగించుకుంటారు.

- ఆగస్ట్ బెబెల్, రచయిత, వక్త, జర్మన్ సోషలిస్ట్ రాజకీయవేత్త.

తెలివిగలవాడికైతే వాడి మెదడు పనిచేస్తుంది. తెలివిలేనివాడికైతే వాడి నాలుక పనిచేస్తుంది - అనే మాట ఉంది. తెలివిగల నాయకుడే కదా సకారాత్మకమైన నిర్ణయాలు తీసుకుని, ఒకవైపు ప్రజా సంక్షేమం మీద, మరోవైపు అభివృద్ధి మీద దృష్టి పెడతాడూ? అవి చేయలేని నాయకుడు మన్‌కీ బాత్ పేరిట నాలుకను తెగ ఉపయోగిస్తాడు. కోతల పురాణం వినిపిస్తాడు. అది పదేండ్ల పాటు విన్న ఈ దేశ ప్రజలు తమకు రవ్వంతైనా లాభం చేకూరిందా?- అని ఆలోచనలో పడ్డారు! ఒక సంప్రదాయవాదుల ఇంట్లో నామకరణ మహోత్సవం జరుగుతూ ఉంది. పురో హితుడు పిల్లవాడికి 'నరేంద్ర' అనే పేరు పెట్టమని సూచించాడు. పక్కన ఓమూల కూర్చున్న పిల్లవాడి నానమ్మకు దు:ఖం ఆగలేదు. బోరున ఏడ్చింది. "ఏందమ్మా? ఏమైందీ?"- అని అందరూ ఆత్రంగా అడిగారు. "నా మనవడు ఇక ఎప్పుడూ నిజం మాట్లాడలేడు కదా?- అని ఏడుపొచ్చింది!" - అని చెప్పింది. పురోహితుడు తలవంచుకున్నాడు. బంధువులంతా పగలబడి నవ్వారు.

ఒక బఫూన్ (హాస్యగాడు) రాజు మందిరంలోకి ప్రవేశించినంత మాత్రాన అతను రాజు కాలేడు. కానీ, రాజమందిరమే సర్కస్ అవుతుంది-అనేది ఒక టర్కిష్ సామెత. ఇది మన దేశంలో ఎవరికి వర్తిస్తుందో ఈ దేశ ప్రజలకు తెలుసు. చిత్ర విచిత్ర వేషధారణలతో జనాన్ని ఆకర్షించాలనుకునే వాడు-ఈ దేశ ప్రధాని నరేంద్ర మోడీనే! ఆయన కాలంలో విదేశాల్లో దేశానికి ఉన్న పరువుపోయింది. దేశంలో కరువు పెరిగింది. ధర్మ వ్యాధి గ్రస్తుడయిన అధర్మ పాలకుడుగా ఆయన చరిత్రలో మిగిలి పోయాడు. పెద్దనోట్ల రద్దు కాలంలో ఒక పెద్దాయన ఇలా అన్నాడు. 'మాటిమాటికీ నోట్లు మార్చుకునే బదులు, ఒక్కసారే ప్రభుత్వాన్ని మార్చుకోవడం మేలు' - అని! ఈ దేశ ప్రజలు ఎప్పటినుండో అనుకుంటున్నారు. ఇక ఇప్పుడు మార్చుకునే సమయం రానే వచ్చింది.

ఇటీవల ఈ దేశ ప్రధాని తాను విలేకరుల సమావేశాలు ఎందుకు ఏర్పాటు చేయడో దాని వెనుక ఉన్న రహస్యం ఏమిటో బట్టబయలు చేశాడు. సోషల్ మీడియాలో అబద్ధపు వార్తలు ప్రచారమవుతున్నాయనీ, అందుకని తాను ప్రెస్‌మీట్లు పెట్టడం లేదని సెలవిచ్చారు. వంద ఎలుకల్ని మింగిన పిల్లి సత్యవచనాలు ప్రవచించినట్టుగా ఉందా వివరణ. పైగా ఆయన ఈ దేశ ప్రజల్ని కూడా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించాడు. తప్పుడు వార్తల్ని నమ్మొద్దన్నాడు. బాగానే ఉంది కానీ, నాలుగు వేల ఐటి ఉద్యోగులతో ఐటిసెల్ ఏర్పాటు చేసి తప్పుడు వార్తలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు రోజూ వేలకు వేలు దేశ వ్యాప్తంగా పంపిణీ చేస్తున్న పార్టీ ఏది తండ్రీ? ముందా విషయం చెప్పు అని అడిగేవాడు లేకనే కదా? ఇలాంటి పనికి మాలిన వివరణలా? సరే, ఆ విషయం అలా ఉండనివ్వండి. "బీజేపీ- ఆవు- రాముడు- మధుర- కాశీ- కబ్రస్థాన్- పాకిస్థాన్- శ్మశాన్- తాలిబన్‌ల మీద ఆధారపడి ఇంకా ఎంత కాలం ఎలక్షన్లు గెలుస్తుందీ? అసలు ఎప్ప టికైనా తమ స్వంత బలం మీద గెలుస్తుందా?"- అని ప్రశ్నిం చాడు ప్రసిద్ధ జర్నలిస్ట్ అశోక్ వాంఖడే.



భారత సైన్యంలో మూడు వేల అగ్నివీర్‌లను నియుక్తం చేయడానికి అప్లికేషన్‌లు ఆహ్వానిస్తే తొమ్మిది లక్షల యాభై అయిదు వేల నిరుద్యో గులు అప్లికేషన్ పెట్టు కున్నారు. దేశం ఎంత ప్రమాదకర స్థితిలో ఉందో ఎంత దయ నీయమైన స్థితిలో ఉందో చెప్పుకొవాలంటే మన ముందు ఇలాంటి ఎన్నో సంఘటనలున్నాయి. ఇలాంటి విషయాలేవీ పట్టించుకోకుండా. "మనమంతా కలిసి అమృత్ మహోత్సవంలో పాల్గొందాం!" అని ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే బీజేపీ ప్రభుత్వ పెద్దలకు, బాధ్యులకు కండ్లు మూసుకుపోయాయా ? దేశ పరిస్థితులేవీ కనిపించడం లేదా? అని ఈ దేశ ప్రజలు ఆందోళన పడుతున్నారు. వీరిది ఎంతగొప్ప పరిపాలనో చెప్పుకోవడా నికి మరొక సంఘటన చూడండి- మణిపూర్ ముఖ్యమంత్రి రాజీనామా పత్రం సమర్పిద్దామని వెళుతూ ఉంటే, ఆయన మద్దతుదారులు ఆయన రాజీ నామా పత్రాన్ని ఆయన నుండి లాక్కుని చింపేశారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రికే రక్షణ లేకపోతే ఇక, సామాన్యుల సంగతేమిటీ? వెంటనే అక్కడ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి కదా? చేశాడా? బీజేపీ వారి పాలన ఆ విధంగా సాగిందన్నమాట!

> దేశానికి తిండి పెట్టే రైతుల మీద మోడీ ప్రభుత్వం బుల్లెట్లు కురిపిస్తుందా? వారి దారిలో మేకులు కొట్టిస్తుందా? ఏడు వందల మంది రైతుల ప్రాణాలు తీసి మోడీ ప్రభుత్వాన్ని ఈ దేశ ప్రజలు ఇప్పుడే కాదు, ఇక ఎప్పటికీ క్షమించరు. గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించిన మోడీ-షాలు తమ గొయ్యి తామే తవ్వుకున్నారు. మనుషులుగా కూడా మిగిలిలేరు. అయినా, జడ్జిని చంపించిన వాడిని దేశ హోంమంత్రిగా చేసుకోవడమా? ఎంత అమానవీయం? ఎంత అమానుషం? రచయితల్ని, ఆలోచనాపరుల్ని, ప్రతిపక్ష నాయకుల్ని చంపించి, లేదా జైళ్లలోకి తోయించి రాజ్యమేలుతామనుకుంటే ఎలా? ప్రశ్నను ఎవడూ అణిచివేయలేడని తెలుసుకోని బుద్ధిహీనులు అహంకారంతో ప్రవర్తిస్తే ఏమవుతుందీ? ఆలస్యమవుతుందేమోగానీ, చివరికి మట్టి కరవాల్సిందే తప్పదు!

"జ్ఞానవంతుడు తన శత్రువులను ప్రేమించడమే కాకుండా తన స్నేహితులను ద్వేషించనూగలడు" అని అన్నాడు జర్మన్ తత్వవేత్త ఫ్రెడరిక్ నీషే. ఆ మాట అర్థం చేసుకోగలిగే స్థాయి ఆరెస్సెస్ బీజేపీలకు ఎక్కడుందీ? ప్రశ్నించిన వారిని జైల్లో తోయడమో లేక చంపేయడమో చేస్తున్న మోడీ ప్రభుత్వానికి అంతకన్నా లేదు. పదేండ్లుగా చూస్తూనే ఉన్నాం కదా? "మనిషి అత్యంత క్రూర జంతువు' - అని కూడా అన్నాడు. మరో సందర్భంలో ఫ్రెడరిక్ నీషే. గుజరాత్, మణిపూర్ మారణ కాండలు జరిపించిన మోడీ- షాల గురించే చెప్పాడా నీషే? కాదు. ఆయనె ప్పుడో ఒక యూనివర్సల్ ట్రూత్ చెప్పాడు. ఇక్కడ మన దేశ నాయకులు దాన్ని నిజం చేసి చూపారు. ఇటీవల ఒక లోక్‌సభ ఎన్నికల ర్యాలీలో మాట్లా డుతూ దేశ ప్రధాని ఇలా అన్నాడు. "కాంగ్రెస్ గనక అధికారంలోకి వస్తే అయోధ్య రామాలయం పైకి బుల్‌డోజర్లు పంపి కూలగొడతారు'' -అని! గతంలో ఆలయాలను కూల్చిన రికార్డు ఆ పార్టీకి లేదు. కానీ, ఉత్తరప్రదేశ్‌లో పేద ముస్లింల ఇండ్లపైకి బుల్‌డోజర్లు పంపిన గొప్ప సంప్రదాయం బీజేపీ - యోగి ప్రభుత్వానికి ఉందని ఈ దేశ ప్రజలకు తెలియదా? ప్రజల చెవుల్లో బీజేపీ వారు కమలం పూలు ఏనాటికీ పెట్టలేరు. వాళ్లు పెడతామన్నా ప్రజలు పెట్టించుకోరు. ముస్లిం మహిళలు చేపట్టిన షహీన్‌బాగ్ ఉద్యమం తక్కువదా? ఒక్కసారి గుర్తు చేసుకోండి! వంటచేసి టిఫిన్ బాక్స్‌లు పెట్టి పిల్లల్ని స్కూలుకు పంపే మహిళలు, భర్తల్ని ఆఫీసులకు పంపే మహిళలు, రాజకీయాలు అంతగా తెలియని మహిళలు రోడ్డెక్కి షహీన్‌బాగ్‌లై విస్తరిం చారు. నిరసన గళాల్ని బలంగా వినిపిం చారు. నియంతలమని అనుకున్న వాళ్లంతా ఊడిపోయే 'ఖాకీ నిక్కర్లు' పట్టుకుని పరుగులు తీశారుకదా?

అది అలా ఉండనిచ్చి, రైతుల నల్లచట్టాల్ని ఈ దేశంలో రైతులు ఎలా తిప్పికొట్టారో చూశాం. వృద్ధులు, యువకులు పొలం పనులు మానుకుని, నిద్రాహారాలు మానుకుని నిరసన నినాదాలు చేస్తే-అవి ఢిల్లీ దాకానే కాదు. ప్రపంచ దేశాలన్నిటికీ వినిపించాయి. బీజేపీ ప్రభుత్వం తోకముడిచి నల్లచట్టాల్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. దేశానికి తిండి పెట్టే రైతుల మీద మోడీ ప్రభుత్వం బుల్లెట్లు కురిపిస్తుందా? వారి దారిలో మేకులు కొట్టిస్తుందా? ఏడు వందల మంది రైతుల ప్రాణాలు తీసి మోడీ ప్రభుత్వాన్ని ఈ దేశ ప్రజలు ఇప్పుడే కాదు, ఇక ఎప్పటికీ క్షమించరు. గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించిన మోడీ-షాలు తమ గొయ్యి తామే తవ్వుకున్నారు. మనుషులుగా కూడా మిగిలిలేరు. అయినా, జడ్జిని చంపించిన వాడిని దేశ హోంమంత్రిగా చేసుకోవడమా? ఎంత అమానవీయం? ఎంత అమానుషం? రచయితల్ని, ఆలోచనా పరుల్ని, ప్రతిపక్ష నాయకుల్ని చంపించి, లేదా జైళ్లలోకి తోయించి రాజ్యమేలుతామనుకుంటే ఎలా? ప్రశ్నను ఎవడూ అణిచివేయలేడని తెలుసుకోని బుద్ధిహీనులు అహంకారంతో ప్రవర్తిస్తే ఏమవుతుందీ? ఆలస్యమవుతుందేమోగానీ, చివరికి మట్టి కరవాల్సిందే తప్పదు!

ఇది హిందూ దేశమని అంటున్నారు కదరా? హిందూ దేవీ దేవతలు శక్తిమంతులని భ్రమిస్తున్నారు కదరా? మరి ఈ దేశాన్ని ఈ దేవుళ్లు వందల ఏండ్లు ముస్లింలకూ, క్రైస్తవులకు ఎందుకు అప్పగించినట్లూ? విశాలమైన హిందూ దేశాన్ని లోగడ ఏ హిందూ రాజు పరిపాలించాడూ? కాస్త చరిత్ర పుస్తకాల దుమ్ము దులిపి చదువుకోండి. విశాలమైన భారత సామ్రాజ్యాన్ని పరిపాలించింది బౌద్ధ చక్రవర్తి ఆశోకుడు ఒక్కడే! మరి ఆ స్థాయి హిందూ రాజు ఎందుకు లేడూ? ఉన్నా ఎవరో కొందరు చిన్నా చితక రాజులున్నారు తప్ప, ఆ స్థాయి చక్రవర్తులే లేరు కదా? అయినా చదువుకున్న వారికి విషయాలు తెలుస్తాయి.

దొంగ సర్టిఫికెట్లు సంపాదించుకున్న వారికి దొంగ మాటలే వస్తాయి. ఈ బీజేపీ పాలకులు హిందూ హిందూ అని అంటూ ఉంటే దేశంలోని హిందువులకే అసహ్యం వేస్తోంది. ఏదైనా అతి చేయకూడదు కదా? మోడీ స్కాంలలో అయోధ్య రాముడు కూడా ఒక స్కామే! ఇంత అశక్తుడైన అయోధ్య రాముణ్ణి ఈ దేశ ప్రధాని ఎందుకు ప్రమోట్ చేస్తున్నట్టూ? బూచీ- అని పిల్లల్ని భయ పెట్టినట్టు ఈయన రాముణ్ణి చూపించి ప్రజలను భయపెడుతున్నాడని ఇట్టే అర్థమైపోతుంది. స్కాం అంటే కుట్ర- మోసం. అధిక సంఖ్యలో ప్రజలు నమ్ము తున్నారు కదా అని మోసపూరితంగా రాముణ్ణి రాజకీయాల్లోకి లాగి, జనాన్ని మోసపుచ్చడం స్కామ్‌కాక మరేమిటీ? అయోధ్య రామాలయం సర్వరోగ నివారిణి అనుకుంది మోడీ ప్రభుత్వం.

అయోధ్య రాముడికి అన్ని మహిమలే ఉంటే, వాటిని ఉపయోగించి ఈ ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగాలిప్పించాలి కదా? రైతుల సమస్యకు, పౌరసత్వ సమస్యకు పరిష్కారం కనుక్కోవాలి కదా? పడిపోయిన రూపాయి విలువను హంగర్ ఇండెక్స్‌లో స్థానాన్ని గణనీయంగా పెంచు కోవాలి కదా? మన ప్రధానికి రాముడు కలలో కనిపించి మతాల వారిగా జనాన్ని విడగొట్టమ న్నాడా? అవినీతి పరులైన వారినందరినీ తమ పార్టీ వాషింగ్ మిషన్‌లో వేసి ఉతుక్కోమన్నాడా? అయోధ్య రాముడు కలలో కనిపిం చి మోడీకి ఏం చెప్పాడు? మన ప్రజలకి తెలియాలి! - సృష్టికర్త, శక్తిమంతుడు అని చెప్పే ఆ దేవుడికి అందరినీ కలిపి ఉంచగలిగే శక్తి లేదా? ఆ ఆయోధ్య రాముడి ఆశీస్సులతో ఈ బీజేపీ ప్రభుత్వ పెద్దలు భారత రాజ్యాంగాన్ని కాపాడేపని చేయ లేరా? రోజుకు పది అబద్ధాలాడమని రాముడేమైనా కలలో కనబడి మోడీకి చెప్పాడా? గుజరాత్, మణిపూర్ మారణ కాండలు జరిపించమని ఆ అయోధ్య రాముడే మోడీకి షాలకు కలలో కనబడి ఆజ్ఞాపించాడా? ఒక వేల ఆ దేవుడే ఇవన్నీ జరిపించండని చెప్పి ఉంటే - మణి పూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించమని చెప్పిఉంటే- ఈ దేశ ప్రజలు ఆ దేవుణ్ణీ, ఈ ప్రభుత్వాన్నీ తిరస్కరించడానికి సిద్ధంగా ఉన్నారు.

> మన ప్రధానికి రాముడు కలలో కనిపించి మతాల వారిగా జనాన్ని విడగొట్టమన్నాడా? అవినీతి పరులైన వారినందరినీ తమ పార్టీ వాషింగ్ మిషన్‌లో వేసి ఉతుక్కోమన్నాడా? అయోధ్య రాముడు కలలో కనిపించి మోడీకి ఏం చెప్పాడు? మన ప్రజలకి తెలియాలి! - సృష్టికర్త, శక్తిమంతుడు అని చెప్పే ఆ దేవుడికి అందరినీ కలిపి ఉంచగలిగే శక్తి లేదా? ఆ ఆయోధ్య రాముడి ఆశీస్సులతో ఈ బీజేపీ ప్రభుత్వ పెద్దలు భారత రాజ్యాంగాన్ని కాపాడే పని చేయలేరా? రోజుకు పది అబద్ధాలాడమని రాముడేమైనా కలలో కనబడి మోడీకి చెప్పాడా? గుజరాత్, మణిపూర్ మారణకాండలు జరిపించమని ఆ అయోధ్య రాముడే మోడీకి షాలకు కలలో కనబడి ఆజ్ఞాపించాడా? ఒక వేల ఆ దేవుడే ఇవన్నీ జరిపించండని చెప్పి ఉంటే - మణిపూర్‌లో మహిళల్ని నగ్నంగా ఊరేగించమని చెప్పిఉంటే- ఈ దేశ ప్రజలు ఆ దేవుణ్ణీ, ఈ ప్రభుత్వాన్నీ తిరస్కరించడానికి సిద్ధంగా ఉన్నారు.

- కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

మెయిల్ @ నవతెంగాణ

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలి

కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీ రోజురోజుకూ విపరీతమవుతున్నది. రోగికి ఉన్న జబ్బు బాధ కన్నా హాస్పిటల్స్‌లో కట్టే బిల్లే మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఎందుకంటే రోగమొక్కటే కానీ డాక్టర్‌ను, హాస్పిటల్‌ను బట్టి డబ్బులు వసూలు చేస్తున్నారు. అవసరమున్నా, లేకున్నా రోగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఈ హాస్పిటల్స్‌కు వైద్య చికిత్స కోసం వెళ్తే రెండునెలలకు మందులు రాసి తీసుకోమంటున్నారు.కానీ వారం, పదిరోజుల్లో ఉచితంగా వైద్య సేవలు పొందచ్చని చెబుతున్నారు. పూర్తిగా మందులు వాడితేనే కదా జబ్బు తగ్గిందా లేదా అనే విషయంలో ఒక నిర్ధారణకు వస్తాము. పదిరోజుల్లో ఎలా తెలుస్తుంది?ఒక్కసారి ఆలోచించాలి. పేరుకు మాత్రం ఉచితం అనడమే గానీ దీనివల్ల ఎవరికి ఉపయోగం లేదు. ఇంకా వ్యాధికి సంబంధించిన ఏదైనా ఇంజక్షన్లు రాస్తే అవి కొని తెచ్చుకోవడం మనవంతు. అది వేసినందుకు కూడా అదనంగా వంద రూపాయలు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమో హాస్పిటల్ యాజమాన్యాలకే తెలియాలి. అందుకే ప్రభుత్వం ప్రయివేటు,కార్పొరేట్ ఆస్పత్రుల్లో బిల్లుల్ని నియంత్రించాలి. ఓపి ఫీజులు ఒకే విధంగా ఉండేలా చూడాలి. దానికి ఒక నిపుణులతో కూడిన కమిటీని నియమించి పర్యవేక్షించాలి.అలాగే అన్ని హాస్పిటల్స్‌లో వారానికి ఒకసారి ప్రజలందరికీ ఉచిత వైద్య సేవలందించేలా నిబంధన తీసుకురావాలి. ప్రస్తుతం ఏ హాస్పిటల్‌లో చూసిన డాక్టర్ల కనుసన్నల్లోనే మందుల దుకాణాలు నడుస్తున్నాయి. అవసరానికి మించి మందులు రాసి రోగి దగ్గర మరిన్ని డబ్బుల్ని పిండుకుంటున్నారు. అందుకే ప్రతి హాస్పిటల్‌లో ఎక్కువ నాణ్యత ఉండి తక్కువ ధరకు లభించే జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసేలా, ఇందులో అన్ని రకాల మందులు ఇతర వైద్య పరికరాలు ఉండేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

-డి.రాంచందర్ రావు,
9849592958

అవకాశవాదం...ఆరెస్సెస్ వ్యూహం!


ఎం.వి.ఎస్. శర్మ

ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి, దాని మిత్రులకు దేశమంతటా ఎదురు గాలులు వీస్తున్నాయి. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా, లోలోపల మోడీ అండ్ కో భయపడుతున్నారు. రానురాను మరింత ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టటం, ప్రతిపక్షాలపై పచ్చి అబద్ధాలను, పుకార్లను ప్రచారంలో పెట్టడం చేస్తున్నారు. స్వయానా మోడీయే ఈ పనిలో ముందున్నారు. అయినా ప్రయోజనం వుండేలా కనిపించడంలేదు. ఈ పరిస్థితుల్లో ఒక కొత్త ప్రచారం తెర మీదికి వస్తోంది. మోడీ బృందానికి, ఆరెస్సెస్ అధినాయకత్వానికి మధ్య విభేదాలు పెరుగుతున్నాయన్నదే ఆ ప్రచార సారాంశం. ఈ మారు మోడీ కోరుతున్న 400 సీట్లు కాదుగదా మెజారిటీ అయినా ఎలా వస్తుందో చూస్తాం అని ఒక ద్వితీయ శ్రేణి ఆరెస్సెస్ నాయకుడు పత్రికా సమావేశం పెట్టి మరీ సవాలు చేసినట్టు ఒక వీడియో వైరల్ అవుతోంది. ఆరెస్సెస్‌ను మరిచిపోయి మోడీ తన స్వంత ఇమేజ్‌ను పెంచుకుంటున్నారని, రామాలయ ప్రారంభానికి కూడా ఆరెస్సెస్ నేతలను పిలవలేదని, గౌరవించలేదని..ఇలా ప్రచారం జరుగుతోంది.

ఈ ప్రచారం కూడా ఆరెస్సెస్ వ్యూహంలో భాగమే. అప్రదిష్టపాలై ప్రజల్లో చెడ్డ పేరు వస్తే అదేదో మోడీ బృందానికి రావాలే తప్ప ఆ పాపం ఆరెస్సెస్‌కు అంటకూడదన్నదే దాని విధానం. ఈ మారు ఒకవేళ మోడీ ఓడిపోయినా, ఇప్పటికే ప్రభుత్వ యంత్రాం గంలో వివిధ రాజ్యాంగ, రాజ్యాంగేతర వ్యవస్థల్లో లోతుగా చొచ్చుకుపోయిన నెట్‌వర్క్ ఆరెస్సెస్‌కు వుండనే వుంది. ఎన్డీయేకు ప్రత్యామ్నాయంగా వేరే ప్రభుత్వం వచ్చినా, అందులోని భాగస్వాముల్లో సైతం మోడీ పట్ల వ్యతిరేకత వున్నా, ఆరెస్సెస్ హిందూత్వ పట్ల సానుభూతి, మెతకదనం ప్రదర్శించేవారు వున్నారు. కనుక వ్యూహాత్మకంగానే వెనకడుగు వేసినట్టు నటిస్తూ తన హిందూత్వ ఎజెండాను కొనసాగించడానికి ఆరెస్సెస్ ప్లాన్-బి రూపొందించి నట్టు కనిపిస్తోంది.

ఇదేమీ ఆరెస్సెస్‌కి కొత్త కాదు. ఆ సంస్థ పుట్టుకే కపటత్వంతో మొదలైంది. సావర్కర్ అండమాన్ జైలులో వున్నపుడు క్షమాపణలు కోరుతూ రాసిన లేఖలు, అందులో బ్రిటిష్ వలస పాలకుల ఎడల ప్రదర్శించిన రాజభక్తి అందుకు మొదటి ఉదాహరణ. ప్రజలలో స్వాతంత్ర్యాభిలాష వుంది కనుక ముందు స్వాతంత్ర్యం కోసం పోరాడేందుకు రంగంలోకి దిగి, నిర్బంధం చవిచూడగానే వలస పాలకులకు దాసోహం అన్నాడు. ఆరెస్సెస్‌కి మూల పురుషుడిగా, సిద్ధాంతవేత్తగా పరిగణించబడే సావర్కర్ ప్రదర్శించిన కపటత్వం ఆరెస్సెస్ సంస్థ నరనరాల్లో జీర్ణించుకు పోయింది. ప్రజలలో ముస్లింల పట్ల విద్వేషాన్ని రగిల్చే విష ప్రచారం చేసే సంఘపరివారం సింథ్, బెంగాల్ ప్రావిన్షియల్ ప్రభుత్వాలలో ముస్లింలీగ్‌తో కలిసి (1946లో) అధికారం పంచుకుంది.



అఖండ భారత్ గురించి ప్రచారం చేసి ఆఫ్ఘనిస్తాన్ నుంచి బర్మా దాకా వున్న ఉపఖండం యావత్తూ హిందూ దేశమేనని తప్పుడు ప్రచారం చేయడం ఆరెస్సెస్ విధానం. కాని ముస్లిం లీగ్ మాదిరిగానే ద్విజాతి సిద్ధాంతాన్ని బలపరిచి దేశ విభజనకు దోహదం చేసింది.విభజన వెనువెంటనే దేశవ్యాప్త మత కల్లోలాలకు తెరతీసింది ఆరెస్సెస్. మహాత్ముడు నిరశన దీక్షకు పూనుకుని ప్రజల మధ్య సామరస్యం నెలకొనాలని విజ్ఞప్తి చేస్తే, దేశ వ్యాప్తంగా వచ్చిన స్పందన చూసి సంఘ్ పరివార్ నేతలు గాంధీ దగ్గరకు పోయి దీక్షకు సంఘీభావం ప్రకటించి వచ్చారు.కొద్ది రోజుల్లోనే, అంతా సద్దు మణుగుతుంది అనుకున్న ప్పుడు గాంధీజీని హత్య చేశారు. ఈ కుట్ర వెనుక సావర్కర్ హస్తం వుందని స్పష్టం అయ్యింది. వెంటనే ఆరెస్సెస్ తమ సంస్థకు, గాంధీ హత్యకు సంబంధం లేదని..సావర్కర్‌కు, ఆరెస్సెస్‌కు సంబంధంలేదని ప్రకటించింది. చెడ్డ పేరు వస్తే గాడ్సేకు, సావర్కర్‌కు రావాలి తప్ప ఆ మకిలి ఆరెస్సెస్‌కు అంటకూడదన్నదే వాళ్ల విధానం. మళ్లీ మోడీ ప్రధాని అయ్యాక సావర్కర్‌ను, గాడ్సేను ఆకాశానికెత్తే ప్రచారం ప్రారంభించారు. అవకాశవాదం ఆరెస్సెస్ వ్యూహం.

జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో 1974లో ఇందిరాగాంధీ నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం మొదలైంది. భారతీయ జన సంఘం (ప్రస్తుత బీజేపీకి అప్పటి పేరు) అందులో భాగస్వామి అయ్యింది. 1975లో ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి ఆరెస్సెస్‌పై నిషేధం ప్రకటించింది. వెంటనే ఆరెస్సెస్ అధినేత బాలా సాహెబ్ దేవరస్ ఎమర్జెన్సీకి మద్దతు ప్రకటించాడు. జె.పి ఉద్యమానికి, ఆరెస్సెస్ కి సంబంధం లేదని ప్రకటించాడు. ఎమర్జెన్సీని ప్రజలు తిరస్కరించిన తర్వాత ఆరెస్సెస్ నేతలు నియంతృత్వాన్ని ఓడించింది తామేనని చెప్పుకుంటూ తిరగడం మొదలుబెట్టారు. నియంతృ త్వాన్ని ఓడించి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టిన జనతా పార్టీ ముక్కలై మళ్లీ ఇందిరా గాంధీ గద్దెనెక్కారు. జనతా పార్టీ ముక్కలు కావడానికి ప్రధాన కారణం ఆరెస్సెస్ అనేది అందరికీ తెలుసు.

'అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తాం' అంటూ దేశమంతటా తిరిగారు. కాని అక్కడ బాబ్రీ మసీదును కూల్చివేశారు. దానిపై దేశమంతటా వ్యతిరేకత వ్యక్తమైంది. వెంటనే ఆరెస్సెస్ తమకు, మసీదు విధ్వంసానికి సంబంధం లేదని ప్రకటించింది. గుజరాత్ మారణ హోమం విషయంలో కూడా అదే వైఖరి తీసుకున్నారు. ప్రపంచం యావత్తూ ఆనాడు మోడీ ప్రభుత్వాన్ని (2002లో) ఖండించింది కనుక వాజ్‌పేయి కూడా ఖండించారు. కాని మోడీ ప్రభుత్వానికి ఢోకా లేకుండా చూసుకున్నారు.ఇప్పుడు కూడా వారిది అదే వైఖరి. దేశంలో విజయాలు ఏవైనా సాధిస్తే ఆ ఘనతనంతటినీ వాళ్ల ఖాతాలోకి వేసుకుంటారు.బీజేపీ గాని ఆరెస్సెస్ గాని దేశానికి చేసిందేమీ లేదు. కాని అంతా తమ ఘనతేనంటారు. అదే పేదరికం, అవినీతి, నిరుద్యోగం, ఆకలి వంటి అంశాలు చర్చకొస్తే ఆ పాపం అంతా 2014కు ముందు పాలించిన వారిదేనంటారు. వెరసి, ప్రజలు నిజానిజాలు గ్రహించి స్పందించిన ప్రతీ సందర్భంలోనూ ఆరెస్సెస్ కొందరు అనుయాయుల్ని ఎంచి బలిపశువులను చేస్తుంది. తాను తప్పుకుంటుంది. తనకేమీ సంబంధం లేదంటుంది. మళ్లీ ప్రజలు తన హిందూత్వ మాయాజాలంలో చిక్కుతూంటే తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తుంది.

> 'అయోధ్యలో రామ మందిరం నిర్మిస్తాం' అంటూ దేశమంతటా తిరిగారు. కాని అక్కడ బాబ్రీ మసీదును కూల్చివేశారు. దానిపై దేశమంతటా వ్యతిరేకత వ్యక్తమైంది. వెంటనే ఆరెస్సెస్ తమకు, మసీదు విధ్వంసానికి సంబంధం లేదని ప్రకటించింది. గుజరాత్ మారణ హోమం విషయంలో కూడా అదే వైఖరి తీసుకున్నారు. ప్రపంచం యావత్తూ ఆనాడు మోడీ ప్రభుత్వాన్ని (2002లో) ఖండించింది కనుక వాజ్‌పేయి కూడా ఖండించారు. కాని మోడీ ప్రభుత్వానికి ఢోకా లేకుండా చూసుకున్నారు.ఇప్పుడు కూడా వారిది అదే వైఖరి. దేశంలో విజయాలు ఏవైనా సాధిస్తే ఆ ఘనతనంతటినీ వాళ్ల ఖాతాలోకి వేసుకుంటారు. బీజేపీ గాని ఆరెస్సెస్ గాని దేశానికి చేసిందేమీ లేదు. కాని అంతా తమ ఘనతేనంటారు. అదే పేదరికం, అవినీతి, నిరుద్యోగం, ఆకలి వంటి అంశాలు చర్చకొస్తే ఆ పాపం అంతా 2014కు ముందు పాలించిన వారిదేనంటారు.

వాజ్‌పేయి ప్రధానిగా వున్నా, ఇప్పుడు మోడీ ప్రధానిగా వున్నా వాళ్ల హయాంలో సాధ్యమైన మేరకు అమలు జరిపింది సంఘ పరివార్ ఎజెండానే. ఆ ఎజెండా అమలులో ఆరెస్సెస్‌కి పూర్తి ఏకీభావం వుంది. కార్పొరేట్లకు దోచిపెట్టడం ఆరెస్సెస్ విధానమే. నిరంకుశత్వం ఆరెస్సెస్ విధానమే. మోడీకి వేరే ఎజెండా లేదు.ఇప్పుడు మోడీ ప్రభుత్వానికి ఎదురుగాలి వీస్తోంది. ఆ గాలికి కొట్టుకుపోతే మోడీ బృందం పోవాలి తప్ప ఆరెస్సెస్ సంస్థ మాత్రం చెక్కు చెదరకూడదు. అందుకోసం అవసరమైతే మోడీని దూరం పెడతారు. తామేదో పవిత్రులమన్నట్టు పోజు కొడతారు.

ఎర్రజెండా ముద్దుబిడ్డ సోందన్న

- నేడు ముదిగొండలో సంతాప సభ
- హాజరుకానున్న సీపీఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులు

నవతెలంగాణ- ముదిగొండ



ఎర్రజెండా ముద్దుబిడ్డ సోందుమియా పోరు బాటలోనే కడవరకు కొనసాగారు. ఎర్రజెండా అంటే అమితమైన ప్రేమ. సిపిఐ(ఎం) అంటే ప్రాణంగా, ఉద్యమమే ఊపిరిగా కామ్రేడ్ పఠాన్ సొందుమియా జీవించారు. సోందన్న గ్రామంలో జరిగిన అనేక ప్రజా ఉద్యమాలలో విరివిగా పాల్గొని, చురుకుగా వ్యవహరించి ఎర్రజెండాను భుజాల మీద మోసాడు. రైతు కూలీ పోరాటాల్లో భాగస్వామయ్యాడు. పేదలకు అండగా, ఎర్రజెండా నాయకత్వంలో జరిగిన ప్రతి కార్యక్రమంలో సోందన్న అడుగుల్లో, అడుగేస్తూ అందరి మన్నలను పొందాడు. ముస్లిం, మైనార్టీల హక్కుల కోసం సొందుమియా ఉద్యమించాడు. గ్రామంలోని అనేకమంది యువకులకు స్ఫూర్తిగా నిలిచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. కష్టజీవులు, కర్షకులు, శ్రామికుల కోసం పనిచేసేది కమ్యూనిస్టు పార్టీయేనని, నమ్మిన సొందుమియా సోషలిజం సిద్ధాంతం కోసం ఎన్ని కష్టాలైనా అనుభవించాడు. ప్రభుత్వ అణిచివేత, నిర్బంధాలు, పోలీస్ కేసులను ఎదిరించే గుండె ధైర్యంతో సోందన్న నిలబడ్డారు. కమ్యూనిస్టు పార్టీ నేతగా గెలిచి, ఎర్రజెండా కోసం కష్టపడి అట్టడుగు వర్గాల అభ్యున్నతకు పఠాన్ సొందుమియా గ్రామంలో కృషి చేశారు. సోందన్న తన నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేస్తున్న క్రమంలో అనారోగ్యానికి గురై మే 14వ తేదీన అస్తమించాడు. ఆ అమరజీవిని స్మరిస్తూ స్థానిక నవతేజ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సంతాప సభ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సొందుమియా సంతాపసభకు సిపిఐ(ఎం) రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు పార్టీ మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం గురువారం తెలిపారు. సోందన్న సంతాప సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ప్రచారరథాలను ప్రారంభించిన ఎంపీ రవిచంద్ర

నవతెలంగాణ ఖమ్మం



నల్లగొండ -ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ప్రచార రథాలను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు గురువారం ఖమ్మం తెలంగాణ భవన్ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శాసనమండలికి నల్లగొండ -ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఏనుగుల రాకేష్ రెడ్డి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. ఆయనకు ఘన విజయం చేకూర్చేందుకు గాను బీఆర్ఎస్ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆర్జేసీ కృష్ణ, శీలంశెట్టి వీరభద్రం, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం), సీపీఐ బలపర్చిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

- ప్రచారంలో సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎర్ర శ్రీకాంత్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దుర్గాప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం



సీపీఐ(ఎం), సీపీఐ బలపర్చిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం త్రీ టౌన్‌లో ఖమ్మం, వరంగల్, నల్లగొండ ఎమ్మెల్సీ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలని కోరుతూ ఖమ్మం మెయిన్ బ్రాంచ్ ఎస్బిఐ జూబ్లీ పుర బ్యాంకులో ఉద్యోగస్తులందర్నీ కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎర్రా శ్రీకాంత్, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఈ దేశంలో ఉన్న మతోన్మాద శక్తులని ఓడించాలనే నిర్ణయంతో కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిపిఎం కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు తెలిపిందన్నారు. ఈ దేశంలో బిజెపి గెలిస్తే మతోన్మాదాన్ని రెచ్చగొట్టి కులమతాల మధ్య చిచ్చుపెట్టి గొడవలు సృష్టించాలని చూస్తుందన్నారు. బిజెపి గత పదేండ్ల పాలనలో పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. నిరుద్యోగ యువతకి ఉద్యోగావకాశాలు కల్పించడంలో వెనకబడిపోయిందన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వ సంస్థలన్నీ అప్పగించడానికి రంగం సిద్ధం చేసుకుందన్నారు. మేధావులు, ఉద్యోగస్తులు, విద్యార్థులు అందరూ బాగా ఆలోచించి బిజెపికి బుద్ధి చెప్పాలని, కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని, తీన్మార్ మల్లన్న గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, కాంగ్రెస్ ఖమ్మం నగరం అధ్యక్షులు జావీద్, ఎర్రం బాలగంగాధర్ తిలక్, రాష్ట్ర గిడ్డంగుల విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సిపిఎం ఖమ్మం 3 టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, టూ టౌన్ కార్యదర్శి సుదర్శన్, 3 టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజ్జేపల్లి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు బండారు యాకయ్య, 35వ డివిజన్ సిపిఎం కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, సిపిఎం త్రీ టౌన్ కార్యదర్శివర్గ సభ్యులుషేక్ సైదులు, షేక్ హిమామ్, శీలం వీరబాబు, పోతురాజు జార్జి, వీరభద్రం, షేక్ ఖాసిం, గుమ్మడి బిక్షం, దుగ్గ్నోతు శంకర్, మహిళా సంఘం నాయకురాలు బండారు సునీత, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



తీన్మార్ మల్లన్న విజయానికి అందరమూ కృషి చేయాలి

- కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో రఘురాంరెడ్డి పిలుపు
- మార్పు ఆవశ్యకతను వివరిద్దాం: ఇన్‌చార్జ్ రఘునాథ్ యాదవ్

నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు భారీ విజయాన్ని అందిద్దామని, ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా కృషి చేయాలని కాంగ్రెస్ ఖమ్మం లోక్ సభ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ నాయకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టభద్రులకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. ప్రజా గొంతుకను చట్టసభలో వినిపించేందుకు తీన్మార్ మల్లన్నను ఎమ్మెల్సీ చేద్దామని అన్నారు. ప్రతి గ్రామంలో కమిటీగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ గ్రామ గ్రామాన పట్టభద్రుల వద్దకు వెళ్లి.. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాల్సిన ఆవశ్యకత వివరిద్దామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం, పట్టభద్రుల వాణి వినిపించేందుకు తీన్మార్ మల్లన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యా, మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, సీనియర్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, జెడ్పిటిసి బెల్లం శ్రీను, ఎంపీపీ మంగీలాల్, కాంగ్రెస్ రూరల్ మండలాధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, నాయకులు నెల్లూరి భద్రయ్య, చావా శివరామకృష్ణ, కొప్పుల అశోక్, మద్ది మల్లారెడ్డి, రైట్ చాయిస్ అధినేత మెండెం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీపై విశ్వాసం...వ్యక్తిపై గౌరవంతో ఉండాలి

- సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండురంగారావు
- కాలనీకి సుందరయ్య పేరు నామకరణం

నవతెలంగాణ-సత్తుపల్లిరూరల్

పార్టీపై విశ్వాసంతోను, వ్యక్తిపై గౌరవం తోనూ ఉండాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మోరంపూడి పాండు రంగారావు తెలిపారు. బుధవారం రాత్రి మండల పరిధిలోని కాకర్లపల్లి గ్రామంలోని బోడు కాలనీ వాసులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు, శాఖా గ్రామ కార్యదర్శి వేపులపాటి కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో మోరంపూడి పాండురంగారావు, జాజిరి శ్రీనివాస్, పట్టణ కమిటీ కార్యదర్శి రావుల రాజబాబు, సీఐటీయు జిల్లా నాయకుకు కొలికపోగు సర్వేశ్వరావులు పాల్గొని సుందరయ్య చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్ల అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఈ పేటకు సుందరయ్య పేరు పెట్టడం అభినందనీయమన్నారు. ఆ ఘనత గ్రామ శాఖలోని బండి వేలాద్రి, కుమారస్వామిలతో పాటు జాజిరి శ్రీనివాస్‌దన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో బండి వేలాద్రి, కుమారస్వామి, కే బిక్షంల సహకారంతో. సీపీఐ(యం) జిల్లా, రాష్ట్ర నాయకత్వం సహకారంతో ఇక్కడి నిరుపేదలకు ఇంటి స్థలం, ఇందిరమ్మ కాలనీ కోసం ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని అలుపెరగని పోరాటం చేశారన్నారు. ఇక్కడి నాయకులపైనా, ప్రజలపైనా కేసులు పెడితే సుమారు 10 సంవత్సరాల పాటు కోర్టు చుట్టు తిరిగి మరీ పాతిక నిరుపేద కుటుంబికులకు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇంటి పట్ట ఇప్పించడం జరిగిందన్న విషయం అందరికి తెలిసిందే అన్నారు. సుమారు 18 సంవత్సరాల తరువాత..ఇక్కడ కాలనీవాసులు గూడును కల్పించిన పార్టీని గుర్తించి, ఆపార్టీ పై విశ్వాసం వుంచి కీలనికి పుచ్చలపల్లి సుందరయ్య కాలనీగా నామకరణం, పార్టీ దిమ్మను కట్టించుకోవడానికి సిద్ధమవడం జరిగిందన్నారు. ఇదే నిజంగా మీరు సుందరయ్య కు నిజమైన నివాళ్లు అంటూ అందుకు కాలని వాసులకు విప్లవాభివందనాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు బండి వేలాద్రి, కే.భిక్షం, మహిళసంఘం నాయుకులు వేపులపాటి పుష్పవతి, చిట్టెమ్మ, అబ్జల్, లక్ష్మణ రావు, శ్రీను, నాగమణి, సాహెబ్, రహీమ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



విత్తన దుకాణాల్లో తనిఖీ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లిలోని విత్తన దుకాణాలను కారేపల్లి మండల వ్యవసాయాధికారి కే.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎస్సై ఎన్.రాజారామ్‌లు గురువారం తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలపై గట్టి నిఘా పెట్టటం, రైతులు మోస పోకుండా కాపాడి ప్రయత్నంలో భాగంగా అధికారులు దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విత్తనాలు లైసెన్స్, ఇన్‌వాయిస్ పరిశీలించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరిగా రశీదు ఇవ్వాలని ఆదేశించారు. విత్తనాలను ఎంఆర్‌పీ ధరకంటే ఎక్కువ అమ్మితే క్రిమినల్ చర్యలు తీసుకోవటంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించాలని కోరారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు మేడేపల్లి విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ముదిగొండ



నేషనల్ మినీ మెరిట్స్ స్కాలర్షిప్ టెస్ట్‌లో మండల పరిధిలోని మేడేపల్లి హైస్కూల్‌కు చెందిన 11మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఎంపికయ్యారని పాఠశాల పిఈటి బి.కృష్ణయ్య గురువారం తెలిపారు. వీరిలో పాఠశాల నుండి జిల్లా స్థాయిలో టాపర్గా నిలిచిన దుశర్ల యశ్వంతి అనే విద్యార్థి ప్రథమ ర్యాంకు సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌కు ఎంపికైన వారిలో దుశర్ల యశ్వంతి, జూలకంటి పునీత్ రెడ్డి, తోట ఆనంద్ తీర్థ, కటికాల లావణ్య, రెడ్డిమల్ల వరుణ్ సందేశ్, బయ్యం చందన, చెన్ను సింధు, పెండ్యాల సాత్విక్, ఎలకల కార్తీక్, బొడ్డు ముఖేష్, ఎస్సీ కేటగిరీలో, రెడ్డిమల్ల హర్షిత బీసీ కేటగిరిలో ఉత్తీర్ణత సాధించారు. వీరందరికీ ఇంటర్మీడియట్ చదువు పూర్తి వరకు సంవత్సరానికి రూ. 12 వేల రూపాయలు స్కాలర్షిప్ అందనున్నది. నేషనల్ మినీ, మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైన విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులను ఎంపీపీ సామినేని హరిప్రసాద్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి నాగేశ్వరరావు, మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్‌లు కొత్తపల్లి నాగలక్ష్మి, సామినేని రమేష్, పాఠశాల పీఈటి కృష్ణయ్య, గ్రామ పెద్దలు భాస్కరరావు, ఉపేందర్‌లు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీపీఐ(ఎం)మండల కమిటీ సభ్యుడు కిలారి సురేష్ కుమార్తె ఆదర్శ వివాహం

నవతెలంగాణ - బోనకల్



సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యుడు చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన కిలారు సురేష్, మమత దంపతుల కుమార్తె అఖిల ఆదర్శ వివాహన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అధ్యక్షతన ప్రముఖ ఆచార్యులు మోతుకూరి నరహరి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు రంగరంగ వైభవంగా నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం చిమిర్యాల గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వరరావు, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు వీరేంద్రనాథ్, అఖిల ఆదర్శ వివాహన్ని నరహరి నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ హిందూ సాంప్రదాయం ప్రకారం ఎక్కువమంది వివాహాలు జరిపిస్తున్నారని తెలిపారు. ఈ వివాహ వేడుకలు చాలా వరకు మూఢనమ్మకాలతో కూడి ఉన్నాయన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ యుగములో కూడా మూఢనమ్మకాలతో ఆధారపడి వివాహాలు జరిపించడం పట్ల ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. రిజిస్టర్ మ్యారేజి చేసిన, హిందూ సాంప్రదాయం ప్రకారం వివాహం చేసిన, ఆదర్శ వివాహం చేసినా ఒకటేనన్నారు. ఆదర్శ వివాహం ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఉంటుందన్నారు. మూఢనమ్మకాలతో నిర్వహించే వివాహాలు ఎక్కువ ఖర్చుతో కూడుకున్నవన్నారు. ఆదర్శ వివాహం చాలా సాంప్రదాయ బద్ధంగా ఉంటుందన్నారు. ఆచార్యులు మోత్కూరి నరహరి మాట్లాడుతూ మూఢనమ్మకాలతో నిర్వహించే వివాహాలు సరైనవి కావన్నారు. వందల సంవత్సరాల నాటి ఆచారాలతో మూఢనమ్మకాలతో వ్యవహారాలు జరిపించడం అంటే మనం మూఢనమ్మకాలపై ఆధారపడి ఉన్నామని అర్థం అన్నారు. చంద్రమండలంపై మానవులు, రాకెట్ల ప్రయోగిస్తున్న ఈ ఆధునిక యుగంలో మూఢనమ్మకాల వివాహాలు జరిపించడం బాధాకరమన్నారు. ఆదర్శ వివాహాల పట్ల ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని కోరారు. హిందూ సాంప్రదాయం ప్రకారం నిర్వహించే వివాహాలలో అనేక లోటుపాట్లు ఉన్నాయన్నారు. కానీ ఆ లోటు పాట్లు బ్రాహ్మణులు మనకు ఎవరికీ వివరించి అర్థాలు చెప్పరన్నారు. అందులో అనేక అనర్థాలు చోటుచేసుకున్నాయని, వాటికన్నింటికి దూరంగా మనం ఉంటూ ఆదర్శ వివాహాల పట్ల ప్రతి ఒక్కరూ మక్కువ చూపించాలని కోరారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ఈ వివాహ వేడుకకు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆదర్శ వివాహ అనంతరం పలువురు నూతన దంపతులను ఆశీర్వదించారు. ఆదర్శ వివాహం నిర్వహిస్తున్న సమయంలో ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఆలకించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, బొంతు రాంబాబు, ఖమ్మం టౌన్ కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, సిఐటియు ఆల్‌ఇండియా కోశాధికారి మండడపు సాయిబాబు, సిపిఎం నాయకులు పాపినేని రామ నరసయ్య, బంధం శ్రీనివాసరావు, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, సిపిఎం మండల కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, శాఖా కార్యదర్శులు నూతన దంపతులకు చెందిన ఇరు కుటుంబాల బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

నవతెలంగాణ-వేంసూరు

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి.రామ్మోహన్ అన్నారు. శుక్రవారం వేంసూరు పల్లెవాడ సొసైటీ పరిధిలోని రైతులకు 60 శాతం సబ్సిడీపై తెలంగాణ ప్రభుత్వం పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేస్తుందని, కావలసిన రైతులు పట్టాదారి పాసుబుక్కు, ఆధార్ కార్డు జిరాక్సు తీసుకొని వెళ్ళినట్లయితే 30 కిలోల బస్తా 11,160 ధరకు సొసైటీ కార్యాలయం నందు ఉదయం 8 గంటల నుండి అందజేయడం జరుగుతుందని అన్నారు ఈ అవకాశాన్ని సొసైటీ పరిధిలోని రైతులు వినియోగించుకుని భూసారాన్ని పెంపొందించుకోవాలని అన్నారు



మేఘశ్రీ ఆసుపత్రికి ఐసియూ బెడ్ వితరణ

నవతెలంగాణ - బోనకల్

మండల కేంద్రంలో గత ఐదేళ్లుగా మండల ప్రజలకు మెరుగైన వైద్యసేవలందిస్తూ పేదల ఆసుపత్రిగా పేరు గాంచిన మేఘ శ్రీ హస్పిటల్‌కు బోనకల్ గ్రామానికి చెందిన యార్లగడ్డ నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుమారులు యార్లగడ్డ శ్రీనివాసరావు రూ.20 వేలు విలువ చేసే ఐసియూ బెడ్‌ను గురువారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అత్యవసర సమయంలో వైద్యసేవలు అందిస్తూ ఎందరినో ప్రాణప్రాయస్థితి నుంచి కాపాడుతున్న మేఘశ్రీ హస్పిటల్‌కు తనవంతుగా మా తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఐసియూ బెడ్‌ను వితరణగా అందజేసినట్లు తెలిపారు. ఐసియూ బెడ్‌ను అందజేసిన వారిలో నాగేశ్వరరావు భార్య ఆదిలక్ష్మీ కోడలు శిరీష, మనవళ్లు అయాన్ బాలాజీ, సాకేత్ కుమార్‌లు తదితరులున్నారు. ఆసుపత్రికి ఐసియూ బెడ్‌ను అందజేసిన నాగేశ్వరరావు కుటుంబసభ్యులకు మేఘశ్రీ హస్పిటల్ జనరల్ వైద్య నిపుణులు టి.పవన్ కుమార్, వైద్యులు డి.సాయికుమార్, బిపి, షుగర్ క్యాంపు నిర్వాహకులు ఆకెన పవన్, యంగల గిరి కృతజ్ఞతలు తెలిపారు.

ముత్తారం దేవాలయంలో శ్రీరామ సంకీర్తన

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అవదూతేంద్ర మణికంఠ భజన బృందం ఆధ్వర్యంలో శ్రీరామ సంకీర్తన పారాయణం నామం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీరామ నామము జపం మారుమోగింది.



ఎమ్మెల్సీగా రాకేశ్‌రెడ్డిని గెలిపించుకుందాం

- నేటి పట్టభద్రుల ఆత్మీయ సభను విజయవంతం చేద్దాం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-సత్తుపల్లి

పట్టభద్రుల పక్షాన ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేశ్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించుకుందామని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలు వద్ద జరిగిన బీఆర్ఎస్ పట్టణ, రూరల్ మండల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సండ్ర వెంకటవీరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని బీఆర్ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. విద్యావంతుడు, సేవాభావం గల వ్యక్తి, పట్టభద్రుల పక్షాన పోరాడే సత్తా రాకేశ్‌రెడ్డికే ఉందన్నారు. నియోజకవర్గస్థాయిలో జరిగే ఈ ఆత్మీయ సభకు పట్టభద్రులను ప్రతి ఒక్కరిని ఆహ్వానించాలన్నారు. విద్యావంతులు, విద్యార్థులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రయివేట్ కళాశాలల యాజమాన్యాలను ప్రతి ఒక్కరిని ఈ సభకు ప్రత్యేకించి ఆహ్వానించాలన్నారు. నేడు సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్ ఎదురుగా ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభకు మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, పల్లా రాజేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదనరావు పాల్గొంటారని సండ్ర తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, జెడ్పీటీసీ సభ్యుడు కూసంపూడి రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, బీఆర్ఎస్ పట్టణ, మండల అధ్యక్షులు ఎస్కే రఫీ, యాగంటి శ్రీనివాసరావు, మల్లూరు అంకమరాజు, దొడ్డా శంకరరావు, కాల్నేని వెంకటేశ్వరరావు, పెద్దిరెడ్డి పురుశోత్తమరావు, అమరవరపు కృష్ణారావు, వల్లభనేని పవన్, నడ్డి ఆనందరావు, చిన్నంశెట్టి రాజ్యలక్ష్మి, ఎస్కే కాశీం, మేకల నరసింహారావు, సాదు జానకిరాం, కౌన్సిలర్లు గుండ్ర రాఘవేంద్ర, మారుతి సూరిబాబు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు, ఫీజురీయంబర్స్‌మెంట్స్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్

నవతెలంగాణ- ఖమ్మం

రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం 6 సంవత్సరాల నుండి 7,200 కోట్లు రూపాయలు విడుదల చేయలేదని, నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పూర్తిస్థాయిలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ విడుదల చేయలేదని వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో కోర్సులు పూర్తిచేసి, ప్రవేశ పరీక్షలు, కౌన్సిలింగ్ నిర్వహించే సమయం వస్తోందని, విద్యార్థులు ఒక కళాశాల నుండి మరొక కోర్సులోకి వెళ్ళాలంటే సర్టిఫికేట్ వారి స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్ రాలేదని తమ దగ్గర పెట్టుకుని, వేధింపులు చేస్తున్న పరిస్థితి రాష్ట్రంలో ఉందని, విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పూర్తిస్థాయిలో ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్ విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఫీజులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

బహుమతులు ఎరగా చూపి నకిలీ విత్తనాల అమ్మకం

- అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కొనుగోలు చేసిన విత్తనాలకు బిల్లు తప్పనిసరిగా తీసుకోండి
- పచ్చి రొట్టె ఎరువులు సాగు చేయండి.. భూమి సాంద్రత పెంచండి
- వ్యవసాయశాఖ జేడీఏ ఎం.విజయనిర్మల

నవతెలంగాణ-కల్లూరు



బహుమతులు ఎరగా చూపి విత్తనాలు అమ్మేవారి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండి మోసపోవద్దని, అలాంటివారు గ్రామాల్లోకి రాత్రి పూట వస్తే సమాచారం ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడిఏ విజయనిర్మల కోరారు. గురువారం కల్లూరు సొసైటీలో రాయితీతో కూడిన జీలుగు విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని జెడిఏ ప్రారంభించారు. జెడిఏ మాట్లాడుతూ దయచేసి రైతులు ఎవ్వరు కూడా పంట అవశేషాలను కాల్చ వద్దని తెలిపారు. కాల్చడం వలన భూమిలో మేలు చేసే సూక్ష్మ జీవులు నశించిపోతాయని, పర్యావరణానికి హాని జరుగుతుందని తెలిపారు. విత్తనాల కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధికృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. గ్రామాల్లో రాత్రికి రాత్రి వచ్చి విక్రయించే నకిలీ విక్రయదారులనుండి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదన్నారు. కొనుగోలు చేసిన దుకాణం నుండి రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రసీదుపై విత్తన కంపెనీ పేరు, విత్తన రకం పేరు, లాట్ నెంబర్, గడువు తేదీ ఉండేలా చూడాలన్నారు. లూస్‌గా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్ డబ్బాల్లో ఉన్న విత్తనాలను కొనుగోలు చేయరాదన్నారు. కానుకలు ఎరగా చూపి రైతులను ఆకట్టుకోవాలని చూసిన కంపెనీలను నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ యు.నరసింహారావు, మండల వ్యవసాయ అధికారి ఎం.రూప, సీఈఓ బి. శ్రీనివాసరావు, ఏఈఓలు మరియు రైతులు పాల్గొన్నారు.



వీరస్వామి మృతికి నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

ఇటీవల మరణించిన కొలిపాక వీరస్వామి దశ దిన కార్యక్రమానికి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు హాజరై అమరజీవి కొలిపాక వీరస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైరా మండలం తాటిపూడి గ్రామానికి చెందిన కొలిపాక వీరస్వామి మే నెల 13వ తేదీన గుండెపోటుతో హఠాత్తుగా మరణించారు. వీరస్వామికి భార్య ముగ్గురు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు కొలిపాక రంగారావు వైరా పోలీస్ స్టేషన్లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గురువారం దశ దిన కార్యక్రమం సందర్భంగా సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, వైరా టౌన్, కొణిజర్ల మండలాల కార్యదర్శులు సుంకర సుధాకర్, చెరుకుమల్లి కుటుంబరావు, బోడెపూడి విజ్ఞాన కేంద్రం (ఖమ్మం) బాధ్యులు ఏడునూతల శ్రీనివాసరావు, కళ్యాణ నాగేశ్వరావు తదితరులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం

నవతెలంగాణ-వేంసూరు

బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మండల నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆదేశాలు మేరకు గురువారం చిన్న మల్లెల, జై లక్ష్మీపురం, చోడవరం, పల్లెవాడ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రజా గొంతుక ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలోచించి సరైన అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డ శంకర్‌రెడ్డి, మారోజు సురేష్, ప్రసాద్, సుధాకర్, యర్రా రమేష్, నూనె హరిబాబు ఉన్నారు.

తప్పిపోయిన నాలుగు సంవత్సరాల బాబు

నవతెలంగాణ-బోనకల్



మండల పరిధిలో రావినూతల గ్రామంలో మీ సేవ పక్కన కూర్చొని ఏడుస్తుండగా అదే గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్ మరీదు పుల్లయ్య ఆ బాబుని తన ఇంటి వద్దకు గురువారం తీసుకెళ్లాడు. బాబుకి సుమారు నాలుగు సంవత్సరాల వయసు ఉండవచ్చు. తల్లిదండ్రుల పేరు అడిగితే చెప్పకుండా ఏడుస్తున్నాడు. ఈ బాబు ఎవరికైనా తెలిస్తే సంబంధిత తల్లిదండ్రులకి సమాచారం అందించగలరు. ప్రస్తుతం ఈ బాబు బోనకల్ సెంటర్‌లో బంధం సైదులు దగ్గర ఉన్నాడు. ఈ బాబు సమాచారం కోసం 9676338057, 9398997872 సెల్ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయగలరు.

కుటుంబ గొడవల్లో వ్యక్తి మృతి

నవతెలంగాణ-కూసుమంచి

కుటుంబ సభ్యులు గొడవ పడుతుండగా కుటుంబ పెద్దగా గొడవలు వద్దంటూ సద్ది చెప్పే క్రమంలో తోపులాటల మధ్య ఓ వ్యక్తి మృతి చెందారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని గోరీలపాడు తండ గ్రామంలో గురువారం తేజావత్ బిచ్చు(70) అనే వ్యక్తి ఇంట్లో కుటుంబ సభ్యుల (కూతురు, కోడలు, అల్లుడు) మధ్య గొడవ అవుతుండగా గొడవలకు పోవద్దంటూ వారికి చెప్పే క్రమంలో తోపులాట జరిగిందని, నీ తోపులాటలో కిందపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో 3,036 ఎమ్మెల్సీ ఓట్లు

నవతెలంగాణ-కూసుమంచి

రానున్న ఖమ్మం- వరంగల్- నల్గొండ ఎమ్మెల్సీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం సర్వం సిద్ధమైనట్లు ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 3,036 ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయని, పోలింగ్ స్టేషన్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అందులో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు, ఈనెల 27 ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుందని తెలిపారు.

రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం

నవతెలంగాణ-మధిర

వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎన్నికల బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మధిర మున్సిపాలిటీ కార్యాలయం లో ప్రచారం చేశారు. విద్యావంతుడు ప్రశ్నించే గొంతు ఏనుగుల రాకేష్‌రెడ్డి ని పట్టభద్రుల ఎమ్మెల్సీ మొదటి ప్రాధాన్యత ఓటును రాకేష్‌రెడ్డికి వేసి ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని మున్సిపాలిటీ ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మొండితోక జయకర్, బి టౌన్ అధ్యక్షులు పల్లపోతు వెంకటేశ్వరరావు, మున్సిపల్ కో ఓప్షన్ సభ్యులు రాఘవరావు, 11 వార్డ్ అధ్యక్షులు గద్దల స్వామి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నకు టీజేఎస్ నాయకుల మద్దతు

నవతెలంగాణ-ఖమ్మం

వరంగల్ - నల్గొండ - ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు మద్దతు తెలుపుతున్నట్టు తెలంగాణ జన సమితి (టీజేఎస్)జిల్లా కన్వీనర్ వి.బాబు తెలిపారు. గురువారం ఖమ్మంలోని సంఘం కార్యాలయంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీజేఎస్ జిల్లా నాయకులు జంగిపల్లి రవి, ప్రసాద్, లాళ్ల నరసింహారావు, వి.మోహన్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ మహాసభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఖమ్మం

పాలేరులో జూన్ 8 తేదీన జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) పాలేరు ఏరియా కమిటీ రెండవ మహాసభను జయప్రదం చేయాలని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, పాలేరు ఏరియా కమిటీ అధ్యక్షుడు గోసు పుల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో పాలేరు ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఐఎఫ్టియు సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై అనునిత్యం పోరాడుతుందని, భవన నిర్మాణ, హమాలి ,ఆటో ,గ్రామపంచాయతీ, గవర్నమెంట్ హాస్పిటల్, కేజీబీవీ ,ఆశ, అంగన్వాడి ,మధ్యాహ్న భోజనం ,మిషన్ భగీరథ, తదితర రంగాల కార్మికుల సమస్యలపై పోరాడుతుందని తెలిపారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యలపై ఉద్యమించడానికి, కార్మిక సంఘాన్ని బలోపేతం చేసుకోవడానికి, ఎనిమిదవ తేదీన జరిగే మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పాలేరు ఏరియా కమిటీ కార్యదర్శి పి .రామ్ దాస్ ,నాయకులు శీలం లెనిన్, వై ఉపేందర్, అక్కి నాగరాజు, గుడి చుట్టూ మాధవరావు, ఆర్.రామదాసు, పెదపాక వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీను కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కల్లూరు



కల్లూరు మండలం -యర్ర బోయినపల్లి గ్రామానికి చెందిన పోట్రూ వెంకటేశ్వరరావు(శ్రీను) దశదిన కర్మకు గురువారం రాష్ట్ర కాంగ్రెస్ డాక్టర్ మట్ట దయానంద్ విజయ్ కుమార్ శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్రావు, అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, భాగం ప్రభాకర్ చౌదరి, ఏనుగు సత్యంబాబు, ఆలకుంట నరసింహారావు, పొట్రూ సత్యం, పొట్రూ శ్రీను, తెలుగుదేశం నాయకులు కాకర్ల రంగారావు, కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత కుమారుడి దాష్టికం

- పెళ్లి చేసుకుంటానని గర్భవతిని చేసి మోసం
- పెళ్లి జరిపిస్తామని చెప్పి గర్భాన్ని విచ్ఛిన్నం చేసిన యువకుడి తల్లిదండ్రులు
- చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి
- యువకుడిపై కేసు నమోదు, రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



ప్రేమించాను పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువతిని బీఆర్ఎస్ నేత కుమారుడు లొంగ తీసుకొని గర్భవతిని చేశాడు. సదరు యువతి పెళ్లి చేసుకోవాలని నిలదీయడంతో తల్లిదండ్రులతో కలిసి ఆ యువతిని బలవంతంగా గర్భవిచితి చేశారు. ఈ దారుణమైన ఘటనపై ఖమ్మం రూరల్ మండల పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు అవ్వడంతో వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్లు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నేత బొప్పి ప్రభాకర్ కుమారుడు బొప్పి సంజయ్ ఓ యువతితో గత కొంతకాలంగా ప్రేమాయణం నడిపిస్తున్నాడు. ఆ యువతీని పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా లొంగ తీసుకుని గర్భవతిని చేశాడు. సదరు యువతీ సంజయ్ ని పెళ్లి చేసుకోవాలని గట్టిగా నిలదీసింది. దీంతో అతను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కూడా పెళ్లి చేస్తామని చెప్పారు. కానీ పెళ్లి జరగాలంటే గర్భిణీ ఉంటే కుదరదని, దాన్ని తీపించుకుంటేనే సాధ్యమవుతుందని తల్లిదండ్రులతో ప్రోద్భలంతో నమ్మించాడు. వారి మాటలతో ఆ యువతి వారు ఇచ్చిన మందులు వేసుకొని గర్భ విచ్చితి చేసుకుంది. ఈ నేపథ్యంలో ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఏం జరిగిందని యువతీని గట్టిగా మందలించారు. కాగా జరిగిన విషయం మొత్తం వారికి ఆ యువతి చెప్పడంతో యువకుడి తండ్రి బొప్పి ప్రభాకర్‌ను తమ కూతురిని మీ కుమారుడు వివాహం చేసుకోవాలని కోరారు. మీ అమ్మాయితో మాకు ఎటువంటి సంబంధం లేదని బొప్పి ప్రభాకర్ బెదిరిస్తూ వారిపైనే దాడికి యత్నించాడు. దీంతో తాము మోసపోయామని గుర్తించి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణపాయ స్థితిలో యువతి

గర్భవిచ్ఛిత్తి చేసుకున్న యువతి ప్రస్తుతం ఓ ఆసుపత్రిలో ప్రాణపాయ స్థితిలో చికిత్స పొందుతుంది. వారి మాటలు నమ్మి వేసుకున్న ట్యాబ్లేట్లు ఆ యువతి ప్రాణం మీదికి తీసుకువచ్చాయి. ఆ మందులు వేసుకున్నప్పటి నుంచి బ్లీడింగ్ అవుతున్నప్పటికీ తల్లిదండ్రులకు చెప్పకుండా అంతే ఓర్చుకుంది. ఈ తతంగం పోలీస్ స్టేషన్‌కు చేరి ఆసుపత్రికి వెళ్లిన యువతిని పరీక్షించిన వైద్యులే ఆశ్చర్యపోయారు. మరో రోజు ఆలస్యం అయి ఉంటే ప్రాణాలే పోయి ఉండేవి అని చెప్పడం ఆ యువతి పరిస్థితిని స్పష్టం చేస్తుంది. ఇంత దాష్టికానికి ఒడిగట్టిన వారిపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యువకుడు,తల్లిదండ్రులు సోదరుడిపై కేసు నమోదు

తప్పు చేసిన కుమారుడికి బుద్ధి చెప్పి యువతకి న్యాయం చేయాల్సిన తల్లిదండ్రులు, అతని సోదరుడు వత్తాసు పలకడంతో వారిపై కూడా కేసు నమోదు అయింది. 1) బొప్పి సంజయ్ 2)బొప్పి ప్రభాకర్(తండ్రి),3) బొప్పి దేవమని(తల్లి), 4) బొప్పి అజయ్(సోదరుడు) 417, 493, 420, 506, 323 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. అత్యాచారానికి పాల్పడిన బొప్పి సంజయ్‌ను రిమాండ్‌కు తరలించడంతోపాటు కుటుంబ సభ్యులపై పోలీసులు విచారణ చేపట్టారు.

మల్లన్నను గెలిపించి బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పండి

- ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో పువ్వాళ్ళ రాయల, జావిద్

నవతెలంగాణ-ముదిగొండ



ఈనెల 27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ(ఎం), టీజెఎస్ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధ్యాన్యత ఓటువేసి గెలిపించాలని డిసిసి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, టీపిసిసి సభ్యులు, మధిర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కో-ఆర్డినేటర్ మహ్మద్ జావిద్ కోరారు. ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో కొమ్మినేని రమేష్ బాబు అధ్యక్షతన కార్యకర్తలతో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజార్టితో గెలిపించాలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్, బిజెపి తప్పుడు విధానాలతో అబద్దాలు చెప్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు బిచ్చాల బిక్షం, దేవరపల్లి ఆదినారాయణరెడ్డి కుక్కల వెంగళరావు, దమ్మాలపాటి సరస్వతి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పందిరి అంజయ్య,నాయకులు తాటికొండ రమేష్, పిల్లుట్ల రాఘవ, చిలకల రామకృష్ణ పసుపులేటి దేవేంద్రం, చెరుకుపల్లి రాంబాబు, భూక్య ధర్మానాయక్, దేవరపల్లి అనంతరెడ్డి, మహమ్మద్ అజ్గర్, వల్లూరి భద్రారెడ్డి, సామినేని వెంకటయ్య, మట్టా బాబురామిరెడ్డి, ఇలవల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధిర : మధిర మండల, పట్టణ స్థాయి ఎమ్మెల్సీ సన్నాహక సమావేశం మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిశోర్ అధ్యక్షతన మధిర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఎమ్మెల్సీ ఎన్నికల మధిర ఇంచార్జి, ఖమ్మం పట్టణ అధ్యక్షులు ఎస్‌కే జావిద్, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిరియాల వెంకటరమణ గుప్తా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దార బాలరాజు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్, మున్సిపాలిటీ కౌన్సిలర్ మునుగోటి వెంకటేశ్వరరావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు చిలివేరు బుచ్చిరామయ్య, కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, నిడమనూరు వంశీకృష్ణ, యన్నం కోటేశ్వరరావు, మువ్వ వెంకయ్య బాబు, షేక్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

నవతెలంగాణ-కల్లూరు

బీఆర్ఎస్ పార్టీ తరఫున వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల. రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పలు విద్యాసంస్థలకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. గురువారం పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థలు బాలాజీ, ప్రతిభ, సెంచరీ, తెలంగాణ గ్రామర్ స్కూల్, ల విద్యాసంస్థలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను ఓటు అడిగారు .ప్రైవేటు ఉపాధ్యాయల సమస్యలపై, ప్రజా సమస్యలపై అవగాహన ఉండి ప్రభుత్వంపై పోరాడే రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని, అదేవిధంగా ఎలాంటి సమస్యలు వచ్చిన తను తోడుగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో జడ్పిటిసి కట్ట అజయ్ కుమార్, మండల నాయకులు లక్కినేని రఘు, పెడకంటి రామకృష్ణ, షేక్ కమ్లి, రాచమల్ల నాగేశ్వరావు, అజ్మీర జములయ్య, సిహెచ్.కిరణ్ కుమార్, ఖమ్మంపాటి రమేష్, రామవరపు ప్రసాద్, మార్తాల పిచ్చిరెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విత్తన మేళా, ప్రదర్శన

నవతెలంగాణ-బోనకల్

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలనే ఉద్దేశంతో వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర వారి ఆధ్వర్యంలో మధిరలో శుక్రవారం విత్తన మేళా, ప్రదర్శన నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారిని సర్వసిద్ధి సరిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ పరిశోధన స్థానం నుండి విడుదలైన వివిధ పెసర, మినుము, కంది ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పరిధిలోనే పరిశోధన స్థానాల నుంచి రూపొందించిన వరి వంగడలు విక్రయానికి అందుబాటులో ఉంటాయని తెలిపారు. అదేవిధంగా రైతులకు పంటల సమగ్ర సమాచారం గురించి శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మండల రైతులు ఉదయం 10 గంటలకు మధిర వ్యవసాయ పరిశోధనాస్థానంనకు వెళ్లాలని కోరారు. మధిర వ్యవసాయ పరిశోధన స్థానం నందు అందుబాటులో ఉన్న వివిధ రకాల విత్తనాలు.పెసర విత్తనాలు ఎం జి జి 259, ఎంజిజి 347, ఎంజిజ 351, ఎంజిసి 385, ఐపిఎం 2-14 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మినుము విత్తనాలు ఎంబి జి 1070, పియు 31, టీబీజీ 104 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కంది విత్తనాలు ఎంఆర్‌జి-1004, ఎంఆర్‌జి 66, డబ్ల్యూఆర్‌జి 255 విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి విత్తనం డబ్ల్యూజిఎల్ 962 రకం అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ విత్తనాలు కావలసిన రైతులు మధిర వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉన్నాయని, అవసరమైన రైతులు తెచ్చుకోవాలని కోరారు. విత్తనాలు కావలసిన రైతులు 7675050041 నెంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

మిషన్ భగీరథ పైపు మరమ్మతులు

నవతెలంగాణ-తల్లాడ

మండల కేంద్రమైన తల్లాడ మట్టమ్మ హెూటల్ ఎదురుగా మిషన్ భగీరథ పైపులు లీకై నీరు గత రెండు రోజులుగా వృధాగా పోయాయి. మూడవరోజు అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టారు. రెండు రోజులు వృధాగా నీరు ప్రధాన రహదారిపై వృధాగా పోయింది. గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లడంతో ఎంపీఓ కొండపల్లి శ్రీదేవి, మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి, గురువారం మరమ్మత్తులు చేయించారు. వెంటనే స్పందించి ఉంటే మిషన్ భగీరథ నీళ్ల వృధాను అరికట్టే వారే. కాని అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ప్రజలు కోరుతున్నారు.

గంగమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కామేపల్లి

మండల పరిధిలోని భాసిత నగర్ గ్రామంలో గంగమ్మ తల్లి దేవాలయాన్ని యాదవులు ఏర్పాటు చేసుకున్నారు. గురువారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మ తల్లి అందరినీ చల్లంగా చూడమ్మా అని ఈ సందర్భంగా పూజలు చేశారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆడపడుచులు బినాలతో ఊరేగింపుగా వెళ్ళి పూజలు చేశారు. దీంతో ఆగ్రామంలో పండగ వాతావరణం నెలకొన్నది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కమిటీతో పాటు భక్తులు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నేను ఒక సామాన్య వ్యక్తిని మీలో ఒకరిని

- స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి తాడిశెట్టి క్రాంతికుమార్

నవతెలంగాణ-ఖమ్మం



హనుమకొండ జిల్లా జేఏసీ కన్వీనర్‌గా జల సాధన సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా తెలంగాణ కోసం కష్టపడి పోరాడిన వాడినని, మీలాంటి సామాన్యుడిని, మీ సేవకుడిని అయ్యేందుకు ఒక అవకాశం ఇవ్వండి అని స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి తాడిశెట్టి క్రాంతీకుమార్ పట్టభద్రులను కోరారు. ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు సామాజిక నాయకుడు తాడిశెట్టి క్రాంతి కుమార్ గురువారం ఖమ్మంలో సర్దార్ పటేల్ స్టేడియం, పెవిలియన్ గ్రౌండ్, ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో ఉద్యోగులను, నిరుద్యోగులను వాకర్స్‌ను కలిసి ప్రచార నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ రిజర్వేషన్ల రక్షణకై పోరాడుతానని, నిరుద్యోగ భృతి కై పోరాడుతానన్నారు. ఉద్యోగస్తులకు పాత పెన్షన్లు అమలు చేస్తూ రిటైర్మెంట్ తర్వాత ఇస్తున్న బాండ్ సిస్టమ్‌ని రద్దుచేసి తక్షణమే పూర్తి నగదు నేరుగా ఖాతాల్లోకి వచ్చే విధంగా కృషి చేస్తానని , పెన్షనర్ల ప్రభుత్వ ఉద్యోగాల సమస్యల పరిష్కారాని కై కృషి చేస్తానని తెలిపారు. ఈనెల 27న జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులందరూ మొదటి ప్రాధాన్యత ఓటు బ్యాలెట్ నెంబర్ 33 పై వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావులు, విద్యావంతులు, విద్యార్థులు, పలు ప్రజా సంఘాలు మద్దతు తెలుపుతూ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సన్మానం

నవతెలంగాణ-కామేపల్లి



మండల పరిధిలోని బాసిత్ నగర్ గ్రామంలోని ఇటీవల కాలంలో బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంపీపీ బానోతు సునీత స్వగృహానికి ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య వెళ్లి వారితో మాట మంతి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఎంపీపీ బానోత్ సునిత శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యకర్తలకు అండగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి సాయసక్తుల కృషి చేస్తామని, కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఎంపీపీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాకు అండగా ఉండడంతో పాటు ఎమ్మెల్యే సహాయ సహకారాలు నిండుగా ఉండాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ఎప్పుడు పార్టీ అండతో పాటు తాము అండదండలుగా ఉంటామాయని, ఏ అవసరం వచ్చినా వెంటనే ఫోన్ చేయండి వెంటనే నేను స్పందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గింజల నరసింహారెడ్డి, కామేపల్లి సహకార సొసైటీ చైర్మెన్ గుజ్జర్లపూడి రాంబాబు, కొండాయిగూడెం సహకార సొసైటీ చైర్మెన్ ధనియాకుల హనుమంతరావు, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య ఫత్తేఆహ్మద్, బానోత్ రాందాస్, గ్రామశాఖ అధ్యక్షులు జాజిరి రాము, మాజీ సర్పంచ్ ధరావతు బాలు, వెంకట్రామ్, ధీను తదితరులు పాల్గొన్నారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు : ఏడీఏ

నవతెలంగాణ-కూసుమంచి



విత్తనాలకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించరాదని, ఎక్కడైనా అటువంటి ఫిర్యాదు వస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని ఏడీఏ ఎస్. విజయచంద్ర హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో పురుగుమందులు, ఎరువుల, విత్తన వ్యాపారులతో ఏడిఏ విజయచంద్ర, మండల వ్యవసాయ అధికారి వాణి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. డీలర్లు అందరూ విత్తన చట్టం పురుగు మందుల చట్టం, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ఈ చట్టాలకు లోబడి వ్యాపారం చేయాలని సూచించారు. ప్రతి ఒక్క షాపులో తప్పనిసరిగా లైసెన్సులను డిస్ప్లే చేయాలని, స్టాప్ బోర్డు, ధరల పట్టికను ప్రదర్శించాలని, స్టాక్ బుక్‌లను విధిగా రోజువారీగా అప్డేట్ చేయాలని, లైసెన్స్ నందు పిసిలు ఓ ఫామ్‌లు జతపరచుకోవాలని, పివో ఎస్ మెషిన్ లో ఉన్నటువంటి బ్యాలెన్స్ గ్రౌండ్ బ్యాలెన్స్ సరితూగాలని సూచించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మినట్లు సమాచారం వస్తే వారిపై సంబంధిత చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పురుగుమందుల, ఎరువుల, విత్తన డీలర్లు, ఏఈవోలు పాల్గొన్నారు.

శుభకార్యంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి

నవతెలంగాణ-వేంసూరు



మండల పరిధిలోని జయలక్ష్మిపురం గ్రామంలో వేల్పుల తిరుపతమ్మ కుమార్తెలు భాగ్యశ్రీ రమ్యలను గురువారం ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దీవించి ఆశీర్వదించారు. నూతన వస్త్ర అలంకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు కాసర చంద్రశేఖర్ రెడ్డి, మండల నాయకుడు గడిపర్తి శ్రీనివాసరావు, సుధీర్, వెంకటేశ్వరరెడ్డి, గిరి తదితరులు పాల్గొన్నారు.



గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ శాఖ అధికారుల దాడులు

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల పరిధిలోని దోమల వాగు, గోదావరి పరిసర ప్రాంతాల్లో నిషేధిత గుడుంబా తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన గుడుంబా స్థావరాలపై భద్రాచలం ఎక్సైజ్ సీఐ రహీమున్నిసా బేగం ఆదేశాల మేరకు ప్రత్యేక ఎక్సైజ్ డిటిఎఫ్ అధికారులతో కలిసి గురువారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. భద్రాచలం ఎక్సైజ్ ఎస్సై అల్లూరి సీతారామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దాడులలో సుమారు 400 లీటర్ల బెల్లం పానకం లభ్యం కాగా, గుడుంబా తయారీకి ఉపయోగించే సామగ్రి దొరికినట్లు అధికారులు వెల్లడించారు. గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకాన్ని, డ్రమ్ములను ధ్వంసం చేసినట్లు వారు తెలిపారు. ఎవరైనా నిషేధిత గుడుంబా తయారు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, గుడుంబా తయారీ అమ్మకాలు జరిగితే సమాచారం అధికారులకు ఇవ్వాలని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వారు తెలిపారు. ఈ దాడులలో భద్రాచలం ఎక్సైజ్ కానిస్టేబుల్‌లు వీరబాబు, బాబు డ్రైవర్ వెంకట్ కొత్తగూడెం డిటిఎఫ్ ప్రత్యేక అధికారి గౌతమ్, పాల్వంచ ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది, నూతన ట్రైనింగ్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

చెరువు సింగారం ప్రజల నీటి సమస్యను పరిష్కరించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల

నవతెలంగాణ-బూర్గంపాడు



మండలంలోని చెరువు సింగారం గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉందని ఈ సమస్యను అధికారులు పరిష్కరించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం ముసలమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు సింగారం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ముసలిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో చెరువు సింగారం మిషన్ భగీరథ మంచినీళ్ల పైపు ఆ గ్రామానికి వెళ్లే పైపు లైన్ పగిలిపోయిందని ఆయన అన్నారు. అడవిలో వృధాగా నీళ్లు పోతున్నాయని, ఇప్పటికి పది రోజులైనా పంచాయతీ అధికారులు, కార్యదర్శి ఎవరూ పట్టించుకోవడంలేదని ఆయన ఆరోపించారు. గ్రామపంచాయతీ సిబ్బందికి మంచినీళ్ల రావట్లేదని గ్రామ పెద్దలు ఫోన్ చేసి పైపులేను పగిలిందని చెప్పితే వాల్ బంద్ చేశారు తప్ప, ఆ గ్రామానికి మళ్లీ మంచినీళ్ల ఇద్దామని సోయి అధికారులకు లేదని ఆయన అన్నారు. ముసలిమడుగు పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి పట్టించుకోవటం లేదని ఆయన అన్నారు. నీటి సమస్యను పరిష్కరించాలని జిల్లా ఉన్నత అధికారులు జోక్యం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్ప సత్యనారాయణ, రత్నకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సమ్మక్క-సారలమ్మలను దర్శించుకున్న మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని గురవాయిగూడెం గ్రామంలో జరుగుతున్న శ్రీ సమ్మక్క-సారలమ్మ అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమంలో అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెచ్చా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాటి పోతు రాజు, ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు, దారా యుగంధర్, అబ్దుల్ జిన్నా, పాకనాటి శ్రీను, గాజుబోయిన ఏసు, యార్లగడ్డ శ్రీను, మల్లేష్, రాజు, నాగు తదితరులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి మృతి

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి

పురుగులమందు తాగి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన హేమచంద్రపురం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... గోరంట్ల నారాయణ రాజు (50), బూడిద గడ్డకు చెందిన ఇతను కొత్తగూడెం వెల్డింగ్ షాప్‌లో పనిచేస్తున్నాడు. తల్లితోనే ఉంటున్నాడు. నిత్యం మద్యం తాగడంతో ఇంట్లో మందలించారు. బుధవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వచ్చిన ఇతను హేమచంద్రపురం రైల్వే ట్రాక్ పక్కన పొలాల్లో పురుగుమందు తాగి మృతి చెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.



మతోన్మాద బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించాలి

- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న

నవతెలంగాణ-పినపాక

మతోన్మాద బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నిమ్మల వెంకన్న కోరారు. గురువారం పినపాక మండలం ఈ.బయ్యారంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత సామరస్యాన్ని లౌకిక వాదాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం మతోన్మాద బీజేపీని, అహంకార బీఆర్ఎస్‌ని ఓడించడం కోసం ఇండియా కూటమికి మద్దతు ఇచ్చామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్నను గెలిపించేలా చూడాలన్నారు. అనంతరం పిట్టతోగూ వలస ఆదివాసీ గ్రామంలో పర్యటించి గిరిజనుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంగం నాయకులు మడివి రమేష్, దుబ్బా గోవర్ధన్ , తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

- ఎమ్మెల్యే జారే నివాళి

నవతెలంగాణ-ములకలపల్లి



ములకలపల్లి హెడ్ కోటర్ మాజీ సర్పంచ్ బీబీనేని భద్రం గురువారం మరణించినారు. 2019 నుండి 2024 వరకు ములకలపల్లి సర్పంచ్‌గా ఈయన విధులు నిర్వహించారు. బేబీనేని భద్రం కుటుంబానికి అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భౌతిక గాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ములకలపల్లిని అనేక రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత బీబీనేని భద్రంకు దక్కుతుందన్నారు. అలాగే భద్రంకు నారాటి ప్రసాద్, తెల్ల చెన్నయ్య, బత్తుల అంజి, తిరుపతిరెడ్డి, అలాగే బీఆర్ఎస్ మండల కార్యదర్శి మోరంపూడి అప్పారావు, సెనగపాటి సీతారాములు, చంద్రావు, బిక్కమల్ల సుధాకర్, పలువురు నివాళులు అర్పించారు.

ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్నను గెలిపించండి

- కాంగ్రెస్ మండల నాయకులు నాగేశ్వరరావు

నవతెలంగాణ-జూలూరుపాడు

27వ తేదీన జరగబోయే గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో పోటీ చేయుచున్న బీసీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్‌ని అత్యధిక ఓట్ల మెజారిటీ తోటి గెలిపించాలని మండల కాంగ్రెస్ నాయకులు రామిశెట్టి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. ప్రశ్నించే గొంతుక మన తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తిని పెద్ద చదువులు చదివినటువంటివారు విజ్ఞతతో ఆలోచించి మన మల్లన్నని గెలిపించాలి కోరారు.

మావోయిస్టులతో చర్చలకు సిద్ధం

- పునరావాస విధానం ఏమిటో తెలపాలంటున్న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం

నవతెలంగాణ-చర్ల



ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టులతో చర్చలు జరిపేందుకు అన్ని దారులు తెరిచే ఉన్నాయని ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, హోంమంత్రి విజయ్ శర్మ వ్యాఖ్యానించారు. పర్యటనలో భాగంగా జగదల్పూర్ వచ్చిన సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో పలు విషయాలు మాట్లాడారు. ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో పని చేస్తున్న మావోయిస్టు సంస్థల నుంచి సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు మావోయిస్టులతో చర్చల కోసం చర్యలు తీసుకుంటామని చెప్పారు. మావోయిస్టుల సూచనల కోసం ఇబిమెయిల్ ఐడి, గూగుల్ ఫారమ్ విడుదల చేశామని తెలిపారు. మావోయిస్టుల పునరావాస విధానం ఏమిటో చెప్పాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ సహదేవ్, చిత్రకూట్ ఎమ్మెల్యే వినాయక్ గోయల్, సీనియర్ జర్నలిస్టు సుభౌకశ్యప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
- శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అల

నవతెలంగాణ-పాల్వంచ



శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలను ఆదేశించారు. హైదరాబాద్ నుండి వరంగల్-ఖమ్మం-నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై నల్గొండ జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనతో పాటు, ఉప ఎన్నికలు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్ రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ... పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్, ఇండెలిబుల్ ఇంకు లు మాత్రమే వినియోగించాలని తెలిపారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసినందున ఎంఎల్‌సీ ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలని, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలని, అదేవిధంగా ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రియాంక అల మాట్లాడుతూ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని, జిల్లాలో 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, పోలింగ్ కేంద్రాలు వద్ద ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించామని, పోలింగ్ నిర్వహించిన పనులు తీసుకోవాల్సిన చర్యలు పై అవగాహన కల్పించామని తెలిపారు. పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బందికి ఎన్నికల పంపిణీ నిమిత్తం డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేశామని, సిబ్బందికి అవసరమైన సదుపాయాలన్నీ సమకూర్చాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు. ఈ నెల 27న నిర్వహించే పోలింగ్‌కు నిబంధనలు అనుగుణంగా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు మధు, దామోదర్ రావు, ఎలక్షన్ సూపర్డెంట్ ధారా ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లను కలిసిన ఎమ్మెల్యే జారే

- తీన్మార్ మల్లన్నను గెలిపించాలి

నవతెలంగాణ-దమ్మపేట



మండల పరిధిలోని పట్వారిగూడెం గ్రామంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ కలిసారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న పట్టభద్రులను కలిసిన జారె కాంగ్రెస్ పార్టీ నుండి ఖమ్మం, నల్గొండ, వరంగల్ స్థానానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రశ్నించే గొంతుకను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొయ్యల అచ్యుతరావు, ఎంపిటిసి కోరం అర్జున్‌రావు, వాసం శ్రీను, బొల్లి కొండ నాగేశ్వరరావు, రెడ్డిమల్ల చిట్టి నాయన, చలికాని భాస్కరరావు, ప్రసాద్‌రావు, కోటగిరి యుగంధర్‌రావు, ఎండి బడే, గోళ్ళ ప్రసాద్, రాయల నాగేశ్వరరావు, చెన్నుకృష్ణ, వాసం వేణు, మొగుడా సూరిబాబు, కనకం నరేష్, షేక్ నజీర్ భాష, తోట కృష్ణ, అప్పారావు, పొదిలి రవి తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి పట్టుబడిన డిప్యూటీ తహసీల్దార్

నవతెలంగాణ-చర్ల





లంచం అడిగాడని ఓ రైతు ఫిర్యాదు మేరకు డిప్యూటీ తహసీల్దార్ బీరెల్లి భరణి బాబును ఏసీబీ డీఎస్పీ తన సిబ్బందితో కలిసి గురువారం నిర్బంధించి రిమాండ్‌కు తరలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం...చర్ల మండలంలోని దండుపేట గ్రామానికి చెందిన కర్ల రాంబాబు అనే వ్యక్తి తన భార్య రాజేశ్వరి పేరిట 3 ఎకరాల భూమిని గిరిజనేతరుల నుంచి కొనుగోలు చేశారు. గిరిజన తెగలకు చెందిన తన భార్య రాజేశ్వరి పేరిట పట్టా చేయాలని కోరుతూ అప్పటి తహసీల్దార్, నేటి డిప్యూటీ తహసీల్దార్ భరణి బాబును సంప్రదించారు. పట్టా చేయాలంటే రూ.50 వేలు లంచం అడగటంతో రూ.20 వేలు ఇస్తామని ఒప్పందం కుదిరింది. పట్టా కోసం డబ్బులు అడిగిన విషయంపై బాధిత రైతు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారులు రంగ ప్రవేశం చేసి రంగులు అద్దిన రూ.20 వేల నగదును బాధిత రైతుకు ఇచ్చారు. ఆ డబ్బులు డిప్యూటీ తహసీల్దార్ భరణి బాబుకు ఇస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు. అవినీతి అధికారిని తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కోర్టులో హాజరు పరిచినున్నట్లు తెలిపారు.

మండలంలో ఎవరైనా అధికారులు లంచం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. టోల్ ఫ్రీ నెంబర్ 1064కి ఫోన్ చేసి తమ సమస్యను తెలిపినట్లైతే ఏసీబీ లంచగొండి అధికారులను కట్టుదిట్టం చేయడానికి చర్యలు చేపడుతుందని ఆయన తెలిపారు. కాగా సదరు అధికారి గతంలోనూ బూర్గంపాడులో ఏసీబీ దాడిలో దొరికినట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

సీతారామ కాల్వ పనులు సకాలంలో పూర్తి చేయాలి

నవతెలంగాణ-జూలూరుపాడు



సీతారామ కాల్వ పనులు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సంభందిత అధికారులను ఆదేశించారు. వైరా నియోజవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు, మండల సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డితో కలిసి ఏన్కూరు మండలంలో సీతారామ కాల్వ పనులను తుమ్మల సందర్శించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ సీతారామ కాల్వ పనులు సకాలంలో పూర్తి చేయాలని, రైతులకు సాగునీరు అందించే విధంగా ఉండాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలం ముఖ్య నాయకులు, వెంగన్నపాలెం ఎంపీటీసీ దుద్దుకూరు మధుసూదన్ రావు, ఉద్యమకారుడు వేల్పుల నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా అధ్యక్షులు అల్లాడి నరసింహారావు, లకావత్ లచ్చు నాయక్, సాయిల కృష్ణయ్య ఎల్లంకి చిన్న నాగేశ్వరరావు, ఎల్లంకి పుల్లయ్య, మాచినేని సత్యం, చౌడం నరసింహారావు, పోతురాజు నాగరాజు, కొత్తగూడెం జిల్లా సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నవీన్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డీసీఎస్‌హెచ్ రవిబాబు విధులు

- నియామకాలు, కాంట్రాక్ట్ పనులపై విచారణ జరిపించాలి
- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్

నవతెలంగాణ-పాల్వంచ



డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్‌గా విధులు నిర్వహిస్తున్న రవిబాబు కన్నా 2008 నుండి అనుభవం ఉన్న డాక్టర్లు జిల్లాలో అందుబాటులో వుండగా వారిని కాదని ఏవిధమైన అనుభవం లేని 2018లో నియమకమైన గుగులోతు రవిబాబును నియమించడం నిబంధనలకు విరుద్ధమని, తక్షణమే అతని డీసీహెచ్ఎస్ భాద్యతల నుండి తొలగించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వకేట్ యెర్రా కామేష్ కలెక్టర్ ప్రియాంక అలకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కామేష్ మాట్లాడుతూ రవిబాబు డీసీహెచ్ఎస్‌గా భాద్యతలు చేపట్టిన తర్వాత ఎంబిబిఎస్ చేసిన వారిని మాత్రమే డ్యూటీ డాక్టర్లుగా నియమించాలనే నిభందనలకు విరుద్ధంగా డెంటల్ డాక్టర్లను డ్యూటీ డాక్టర్లుగా నియమించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని అట్టి నియామక ప్రక్రియలో లక్షల రూపాయలు చేతులు మారినట్లు ఆరోపించారు. అదేవిధంగా ఇల్లందు, చర్ల, మణుగూరు, అశ్వారావుపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో లక్షల రూపాయల పనులను టెండర్ ప్రక్రియ పిలువకుండా కేటాయించారని, ఇల్లందు సీహెచ్‌సీలో ఏవిధమైన నిబంధనలను పాటించకుండా పనిముట్లను, సామగ్రిని కోనుగులు చేశారని తెలిపారు. ఇల్లందు సీహెచ్‌సీలో టెండర్ ప్రక్రియ చేపట్టకుండా లక్షల రూపాయల సివిల్ పనులను కేటాయించారని, రవిబాబు భాద్యతలు చేపట్టిన తర్వాత జరిగిన డిప్యూటేషన్‌లపై విచారణ జరిపించి అనుభవం లేని రవిబాబును భాద్యతల నుండి తొలగించి, రవిబాబు భాద్యతలు చేపట్టిన తర్వాత జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇల్లందులో వాహన నిర్వాహణకు టెండర్ ఆహ్వానం

నవతెలంగాణ-ఇల్లందు

సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని వర్క్ షాప్ నందు అద్దె వాహన నిర్వహణకు ఒక 2డబ్లడీ క్యాంపర్ జీప్ వాహనాల కోసం టెండర్ కోరడమైనదని యాజమాన్యం ప్రకటనలో తెలిపింది. చివరి తేదీ జూన్ నెల 15న సా.4.30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు, అదేవిధంగా టెండర్ దరఖాస్తు ఫీజు రూ.590ను జీఎం కార్యాలయంలోని ఫైనాన్స్ విభాగం నందు చెల్లించి దరఖాస్తు ఫారంను పొందాలని, టెండర్ దరఖాస్తు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు.

వాహన టెండర్ దరఖాస్తులకు అర్హులు:

మొదటి ప్రాధాన్యత : ఓసీ ప్రభావిత నివాసులు, భూ నిర్వాసితులు
రెండవ ప్రాధాన్యత : మాజీ కార్మికుల నిరుద్యోగ పిల్లలు,
మూడవ ప్రాధాన్యత : ఓసీ ప్రభావిత ప్రాంత నిరుద్యోగులు. కావున దరఖాస్తు దారులు తగిన ధృవీకరణ పత్రాలు, ఆధారాలతో సంప్రదించి దరఖాస్తు చేసుకొనగలరని, వివరాలకు పర్చేజ్ విభాగం, జీఎం కార్యాలయం, ఇల్లందు ఏరియా నందు సంప్రదించాలని కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



పేదల కోసం పంచుతున్న రేషన్ బియ్యం పెద్దలు పాలు అవుతున్నాయి. పేద ప్రజలు రేషన్ బియ్యం కోసం పోరాడుతుంటే కొంత మంది పెద్దలు పట్టపగలే యధేచ్ఛగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ఎన్ని గ్రామాలు దాటి వచ్చినా ఎక్కడో ఒక చోట దొరికిపోతున్నారు. ఇదే తరహాలో గురువారం అక్రమంగా తరలిస్తున్న 90 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఐసర్(డీసీఎం)వాహనంలో తరలిస్తూ కట్టుగూడెం గ్రామ శివారులో అన్నపురెడ్డిపల్లి పోలీసులకు పట్టుబడ్డారు. సబ్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.... కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన కోరిపల్లి మణికంఠ మండలంలోని గుంపేన రేషన్ దుకాణంలో రేషన్ బియ్యాన్ని కాకినాడకి చెందిన కొర్ల వెంకట్రావుకు సరఫరా చేసేందుకు తన డీసీఎం వాహనం ఏపీ 07 టీఎఫ్ 9068 ఐసర్ (డిసియం)వాహనంలో అక్రమంగా 90 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం రావడంతో కట్టుగూడెం గ్రామ శివారులో చాకచక్యంగా పోలీస్ సిబ్బంది రేషన్ వాహనాన్ని పట్టుకొని పోలీస్ స్టేషన్‌కి తర్లించాము అని, ఆ వాహనంలో 90 క్వింటాళ్ళ రేషన్ బియ్యం వున్నట్లు గుర్తించామని, వాటి విలువ 1.17 లక్షలు వుంటాయి అని తెలియజేశారు. కాకినాడకు చెందిన కోరిపల్లి మణికంఠ, ఉలవకాయల ముత్యలరాజు, కోర్ల వెంకట్రావుతో పాటు కట్టుగూడెం గ్రామానికి చెందిన మీడియం తులశమ్మ, షేక్ అజీమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

మణుగూరు ఏరియాలో పర్యటించిన జీఎం (ఎస్టేట్స్) బి.వెంకయ్య

నవతెలంగాణ-మణుగూరు



జీఎం ఎస్టేట్స్ బృందం మణుగూరు ఓసీ విస్తరణలో భాగంగా అవసరమైనా 58.51 హెక్టార్ల ఫారెస్ట్ ల్యాండ్, 329 హెక్టార్ల రెవెన్యూ లాండ పర్మిషన్ గురించి ఎంఎన్‌జిఓసి ప్రాజెక్ట్ అధికారీ శ్రీనివాస చారితో గురువారం చర్చించారు. అలాగే ఎంఎన్‌జిఓసి వ్యూ పాయింట్ నుండి మణుగూరుఓసి నందు జరుగుతున్న ఉత్పత్తి చేసే విధానాన్ని, పని స్థలాలను పరిశీలించారు. అనంతరం ఎంఎన్‌జిఓసి పునరావాస ప్రాంతమైన కొత్త కొండాపురం ఆర్అండ్ఆర్ కాలనీ నందు సింగరేణి యాజమాన్యం ఏర్పాట్లు చేసిన రోడ్లు, డ్రైనేజ్లు, ఇతర సౌకార్యాలను పరిశీలించారు. అనంతరం ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించి డైరెక్టర్ ఆఫ్ మైన్స్, జియాలజీ నుండి మణుగూరు ఏరియాలో అన్ని ఓసీలకు ఒకటే లీజు తీసుకోవడానికి అవకాశాల గురించి జీఎం (ఎస్టేట్స్) బి.వెంకయ్యతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం శ్యామ్ సుందర్, ప్రాజెక్ట్ అధికారి ఎంఎన్‌జిఓసి శ్రీనివాస చారి, కార్పొరేట్ ఎస్టేట్స్ అధికారి సురేశ్, శ్రీనివాస్, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్, ఏరియా సర్వే అధికారి శైలెందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

ముగ్గురికి గాయాలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనంపై వున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని యర్రగుంట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం యర్రగుంట ప్రధాన సెంటర్ దగ్గర నల్లగొండ జిల్లాలు చెందిన వీఎం బంజర వైపు నుండి కొత్తగూడెం వైపు వెళుతున్న టీఎస్ 17బి2799 కారు యర్రగుంట ప్రధాన సెంటర్ దగ్గర ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ద్విచక్ర వాహనంపై వున్న ఒక వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా వెనుకవున్న సతీష్‌కి కాలు విరగా మరో వ్యక్తి వెంకటకృష్ణకి నడుముకు తీవ్ర గాయం అయ్యింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వగా క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురి అయిన ఇద్దరు వ్యక్తులు గుంపేనకే కాలానికి చెందిన వారు అని మరో వ్యక్తి యర్రగుంట గ్రామానికి చెందిన వ్యక్తి అని తెలియజేశారు. ప్రమాద సంఘటన గురించి సమాచారం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు.



మల్లన్న గెలుపు కోసం ప్రచారం

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని పలు గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపు కోసం పార్టీ మండల అధ్యక్షుడు భూక్య దేవా నాయక్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించినట్టు తెలిపారు. మండలంలోని బేతంపూడి, నర్సాయిగూడెం తదితర గ్రామాలలో గ్రాడ్యుయేషన్ ఓటర్లు ఇండ్లకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి ఓటు వేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈది గణేష్, మధు రెడ్డి, బొడ్డు అశోక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ 8
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com

త్వరితగతిన డీఎంఎఫ్‌టీ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ ప్రియాంక అల



నవతెలంగాణ-పాల్వంచ

జిల్లాలో జరుగుతున్నటువంటి డీఎంఎఫ్‌టీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలో డిఎంఎఫ్టి (డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ (ట్రస్ట్) ద్వారా చేపడుతున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో డీఎంఎఫ్‌టీ ద్వారా పనులు చేపడుతున్న ఏజెన్సీలన్నీ సకాలంలో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. శనివారం సాయంత్రం లోగా జిల్లాలో డీఎంఎఫ్‌టీ ద్వారా చేపడుతున్న పనుల పురోగతి మొదలు పెట్టని పనులు, పురోగతిలో ఉన్న పనులు, పూర్తి అయిన పనులకు సంబంధించి పూర్తి వివరాలు నివేదికలు అందజేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే పూర్తి అయిన పనులు అన్నిటికీ క్వాలిటీ కంట్రోల్ నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌డీఓ విద్యా చందన, పంచాయతీ రాజ్ ఈఈ, ఆర్అండ్‌బీ ఈఈ, మిషన్ భగీరథ ఈఈ, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం-ఆవశ్యకత

- రేపు రౌండ్ టేబుల్ సమావేశం
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం



నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణ కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో మే 25న సాయంత్రం 3 గంటలకు తెలంగాణ రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం-ఆవశ్యకత అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.వీరభద్రం గురువారం ప్రకటన విడుదల చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి విద్యార్థి, యువజన, తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, ఇతర ప్రజాసంఘాలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో యథేచ్ఛగా ఫీజుల దోపిడీ సాగుతోందని ప్రభుత్వం తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. భవిష్యత్తులో ఫీజుల నియంత్రణకై రౌండ్ టేబుల్ వేదికగా ప్రజాసంఘాలను కలుపుకొని పలు తీర్మానాలు రూపొందించి భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. ప్రజా సంఘాల బాధ్యులు హాజరై తమ విలువైన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

హామీల అమలు చేయలేక తడబడుతున్న ప్రభుత్వం

- బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు

నవతెలంగాణ-కొత్తగూడెం

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేక పరిపాలనలో తడబడుతుందని, దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళ్లడం లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు విమర్శించారు. గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెం విచ్చేసిన ఆయన స్థానిక బిజెపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఏమి సాధించారన్నారు. జిల్లాకు ఒక్క యూనివర్సిటీ ఆయన తీసుకువచ్చారా...? అని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్దిష్టమైన ప్రణాళికలు లేకుండా పని చేస్తుందని ఆరోపించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కేంద్రమే ధాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కెవి. రంగా కిరణ్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరు ఏరియా ఉపరితల గనులను పరిశీలించిన సింగరేణి డైరెక్టర్లు

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో పికేఓసి-4, మణుగూరు ఓసీ ఉపరితల గనుల వ్యూ పాయింట్ నుండి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను డైరెక్టర్ (ఆపరేషన్స్), (బిఎడబ్ల్యు) ఎనివికె శ్రీనివాస్, డైరెక్టర్ (పిడిపి) జి.వెంకటేశ్వర రెడ్డి, మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్, సంబందిత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గనుల సంబందిత అధికారులతో మాట్లాడుతూ మణుగూరు ఏరియా నుండి ఏటా పెరుగుతున్న బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించటానికి శ్రామిక శక్తితో పాటు యాంత్రిక శక్తి కూడా ఎంతో అవసరం కాబట్టి యంత్రాల పని గంటలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి తెలిపారు. తద్వారా సింగరేణి మొత్తంలో అధికోత్పత్తి సాధనలో అగ్ర భాగంగా నిలిచిన మణుగూరు ఏరియా 2024-25 సంవత్సరపు ఏరియా నిర్దేశిత వార్షిక లక్ష్యమైన 126.5 లక్షల టన్నుల టార్గెట్‌ను చేరుకొనుటకు అధికారులు, కార్మికులు, సూపర్ వైజర్లు సమిష్టి కృషితో, రక్షణ పరిధిలో పని చేస్తూ అధికోత్పత్తికి పాటు పడాలి అన్నారు.

అలాగే భారీ వర్షాల వల్ల బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగి ఓపెన్ కాస్ట్ గనులలో చేరే వర్షపు నీటిని డిపార్ట్మెంటల్, ఔట్ సోర్సింగ్ ద్వారా బయటకు పంపే విధంగా సరిపడా మోటార్లను సంసిద్ధంగా ఉంచుకోవాలి. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నర్సి రెడ్డి, ప్రాజెక్ట్ అధికారి పికేఓసి టి.లక్ష్మీపతి గౌడ్, ఎస్ఓటు జిఎం శ్యామ్ సుందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ వీరభద్రుడు, మేనేజర్ పి.కేటన్ సురేశ్, ఎంఎస్ జిటన్ రాజేశ్వర రావు, ఏరియా సెక్యూరిటి అధికారి అబ్దుల్ షబీరుద్దీన్, ఇతర అధికారులు, కార్మికులు, ఆఫ్ లోడింగ్ కంపెనీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించాలి

నవతెలంగాణ-టేకులపల్లి

ఖరీఫ్ సీజన్‌కు రైతాంగానికి విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని, నకిలీ విత్తనాలు అరికట్టాలని, బ్యాంకు రుణాలు మాఫీ చేసి నూతన రుణాలు ఇవ్వాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బుర్ర వెంకన్న, సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి డి.వీర బ్రహ్మాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో టేకులపల్లి వ్యవసాయ అధికారికి డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. దేశానికి వెన్నెముకైనా రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, రైతులకు ఎరువులు, విత్తనాలు కూడా సకాలంలో అందించకపోవడం, నకిలీ విత్తనాలు పంపిణీ చేయడం లాంటి చర్యలతో రైతన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాపంథా డివిజన్ నాయకులు సుందర్, ప్రసాద్, టి.బాలు, గల్క భద్రం, రాజు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి



నవతెలంగాణ-మణుగూరు

మే 27న జరిగే వరంగల్, ఖమ్మం, నల్గొండ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డిని గెలిపించాలని గురువారం జడ్పీటీసీ పోశం నరసింహారావు పగిడేరు గ్రామ పంచాయతీలో ఉన్నటువంటి గ్రాడ్యుయేట్స్‌ని కలిసి బ్యాలెట్ నమూనాపై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రాంతం పట్ల మక్కువతో, ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాన్ని వదిలి, రైతు బిడ్డగా కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా ప్రజాసేవయే లక్ష్యంగా వ్యవహరిస్తానని, అలాగే నిరుద్యోగ యువకుల పట్ల మండలిలలో ప్రశ్నించే గొంతుకై ప్రభుత్వాన్ని నిలదీస్తారని అలాంటి మన అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మీ అమూల్యమైన ఓటు బ్యాలెట్ నమూనాలో సీరియల్ నెంబర్ (3) ఎదురుగా మొదటి ప్రాధాన్యతగా(1) నెంబర్ వేసి ఓట్లు వేయాలని గ్రాడ్యుయేట్స్‌లను కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముత్యంబాబు, మణుగూరు సొసైటీ అధ్యక్షులు కుర్రి నాగేశ్వరరావు, రైతు సంఘం అధ్యక్షులు రామసహాయం వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పప్పుల ప్రసాద్, బేతమల్ల సుందర్, వేర్పుల నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- రెండు పరీక్షా కేంద్రాలు
- రోజుకు రెండు పరీక్షలు



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఈ ఏడాది ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుండి జరగనున్నాయి. ఈ నెల 24వ తేదీ నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలు నుండి 12 గంటలు వరకు మొదటి సంవత్సరం, సాయంత్రం 2.30 నుండి 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారు. నియోజక వర్గం కేంద్రం అయిన అశ్వారావుపేటలో ప్రభుత్వ జూనియర్, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 206 మంది, వీకేడీవీఎస్ రాజు జూనియర్ కళాశాలలో 140 మంది విద్యార్థులు పరీక్షలు హాజరు కానున్నట్టు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్‌లు దామెర నరసింహారావు, అలవాల వెంకటేశ్వరరావు, ఎండీ ముంతాజ్ అహ్మద్, ఎల్.శివ ప్రసాద్‌లు తెలిపారు.



ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ప్రియాంక అల

నవతెలంగాణ-సుజాతనగర్

ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రియాంక అలా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి, మాట్లాడుతూ రానున్న రోజుల్లో వర్షాలు అధికంగా కురుస్తాయని కొనుగోలును సాధ్యమైనంత వరకు పూర్తి చేయాలని అన్నారు. తేమ శాతం అధికంగ ఉన్నట్లు గుర్తించి, తదుపరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చినటువంటి ధాన్యం నిర్ణీత తేమశాతం (17శాతం) వచ్చేవరకు ఆరబెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రంలో గల ధాన్యాన్ని అకాల వర్షాలకి తడవకుండా టార్పానులతో కప్పి ఉంచాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని సకాలంలో సంబందిత మిల్లులకు తరలించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ చేసిన రైస్ మిల్లుకు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల కార్పొరేషన్ త్రినాధ్ బాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి రుక్మిణి, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

వానాకాలం సీజన్‌కు వ్యవసాయ శాఖ సన్నద్ధం

- విస్తీర్ణం ఆధారంగా విత్తన అవసరాలకు అంచనా
- విత్తన సేకరణకు రైతుల్లో అవగాహన
- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ జిల్లా అధికారులకు ఆదేశాలు



నవతెలంగాణ-పాల్వంచ

వానాకాలం సీజన్లో మంచి వర్షపాతం నమోదయ అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తీపి కబురు చెప్పిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ సమర్థమైంది. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ డైరెక్టర్ డాక్టర్ గోపి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబురావు ఏరియాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముఖ్యంగా సాగు చేసే పంటలు విస్తీర్ణం ఆధారంగా విత్తన అవసరాలను అంచనా వేసింది. నాణ్యమైన విత్తన సేకరణ కోసం రైతుల్లో అవగాహన కల్పించే దిశలో గ్రామాల వారిగా అధికారులు సందర్శన షెడ్యూల్ను ఖరారు చేశారు. డివిజన్ స్థాయిలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల స్థాయిలో వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ శిక్షణ కార్యక్రమంలో విత్తన కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరిస్తారు. ఈ కార్యక్రమ వివరాలు ముందస్తుగా పంచాయతీ కార్యదర్శి ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం కల్పించేందుకు ఆదేశాలు ఇచ్చారు. రోజువారి రైతులు హాజరు నమోదు చేశారు. మండల వ్యవసాయ అధికారి వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రతిరోజు విత్తన డీలర్ షాపులను సందర్శించి, విత్తనాలు ఎంత పరిమాణంలో అందుబాటులో ఉన్నాయి, రైతులు ఎన్ని కొనుగోలు చేశారు మొదలైనవి పర్యవేక్షణ చేయాలని నిర్ణయించారు. విత్తనాలు విడిగా బ్యాగులో లేనివి కొనుగోలు చేయరాదని, అనుమతి లేని బిజి 3 విత్తనాలు సాగు చేయరాదని, విత్తనాలు కొనుగోలుకు ముందు కాలపరిమితి పరిశీలించి కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. రైతులు విత్తన కొనుగోళ్లకు తప్పనిసరిగా రసీదు బిల్లు తీసుకోవాలని తెలిపారు. అన్ని రకాల పత్తి విత్తనాలు దిగుబడి సామర్థ్యం కలిగి ఉంటాయి కావున ప్రత్యేకంగా ఒకే రకమైన రకాల కోసం రైతులు ప్రాధాన్యత ఇవ్వరాదని చెప్పారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు భావిస్తే రైతులు వెంటనే అట్టి సమాచారాన్ని వ్యవసాయం లేదా పోలీసు శాఖ అధికారులకు తెలియపరచాలని సూచించారు. పత్తి విత్తనాలు అవసరాలకు సరిపడా అందుబాటులో ఉన్నాయి అని రైతులు 40-60 మీ.మీ వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే పత్తి విత్తనాలు ఇత్తారని సూచిస్తున్నారు. రైతులు పచ్చిరొట్టె పైర్లు సాగు చేయడం ద్వారా నీళ్లతో సేంద్రిక పదార్థం పోషకాలు పెంపొందించుకోవాలని, దీని కోసం జనుము, జీలుగు, పల్లి పెసర, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ద్వారా రాయితీలపై విత్తనాలు పొందాలని జిల్లాలో పత్తి 2.16625 ఎకరాల్లో వరి వన్ పాయింట్ సిక్స్ ఫైవ్ పాయింట్ వ్యవసాయ విస్తరణ అధికారులు ద్వారా తోకలు పొంది రాయితీలపై విత్తనాలు పొందాలని జిల్లాలో పత్తి 2.16625 ఎకరాల్లో, వరి 1,65,854 ఎకరాల్లో, మిరప 32,168 ఎకరాల్లో సాగు వంచినా వేగా సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు.

నిరుపేద విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-పాల్వంచ

పేదరికమే శాపంగా మారిన సరస్వతి పుత్రిక దీనగాథను తెలుసుకొని కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు కార్మిక సంఘం సభ్యుల ద్వారా రూ.37,000 సేకరించి గురువారం ప్రాంతీయ కార్యాలయములో సరస్వతి పుత్రిక వంటసాల విజయదుర్గకు మేనమామ నరేష్‌కు టీఆర్‌వీకెఎస్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్, జన్కో సెక్రటరీ చారుగుండ్ల రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విజయదుర్గకు చదువుకోవాలనే పట్టుదలను అభినందిస్తూ భవిష్యత్తులో నీకు అండగా నిలుస్తామని దాతల సహకారాన్ని గుర్తు చేసుకుంటూ పట్టుదలగా చదువుకొని జీవితంలో పైకి రావాలని, నీవు యందరికో ఆదర్శముగా నిలవాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దంచనాల రాంబాబు శ్రీనివాస్, కేటీపీఎస్ ఏడవ దశ రీజనల్ అధ్యక్షులు తోట కోటేశ్వర్ రావు, రీజనల్ కార్యదర్శి ముత్యాల రాంబాబు, రీజనల్ ట్రెజరర్ అచ్చ కోటిలింగం, 5, 6 దశల రీజనల్ కార్యదర్శి సుభాని, రీజనల్ ట్రెజరర్ విజయ్ శంకర్, జెన్కో నాయకులు కాలే కాంతయ్య, ధర్మపురి నాగేశ్వరరావు, తోట అనిల్, అమీన్, సల్లం పరమేష్, రిజినల్ నాయకులు కాలువ రవికుమార్ యాదవ్, మేరెడ్డి వేమారెడ్డి, బ్రాంచ్ నాయకులు మహ్మద్ పఠాన్ ఖాన్, ఖమ్మం శ్రీను, నాయకులు కనకేష్, వెంకటేశ్వర్లు, ఆర్టిజన్ నాయకులు పుల్లంరాజు, పోతురాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం

- కార్మిక పక్షపాతి పర్సా
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే.రమేష్

నవతెలంగాణ-ఇల్లందు

శాసన సభ్యులుగా పని చేసిన సందర్భంలో ప్రజా సమస్యలపై అవగాహనతో కార్మిక నేత పర్సా సత్యనారాయణ అసెంబ్లీలో గళమెత్తేవారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జే.రమేష్ అన్నారు. సీఐటీయు ఇల్లందు మండల కమిటీ ఆధ్వర్యంలో పర్సా వర్ధంతి, శత జయంతి సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ అడ్డావద్ద గురువారం జరిగిన సభలో రమేష్ పాల్గొని మాట్లాడారు. పర్సా సింగరేణి సంస్థలో గుమాస్తాగా చేరి కార్మిక సమస్యలపై పోరాటాలు చేసే వారని, స్వాతంత్ర సంగ్రామం, తెలంగాణ రైతాంగ పోరాటం చేసిన యోధులన్నారు. సీఐటీయూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ వ్యవస్థాపక అధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పనిచేశారని అన్నారు. కార్మికుల కోసం పోరాటాలు ఉధృతం చెయ్యటమే పర్సాకు నిజమైన నివాళి అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి, మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో కామ నాగరాజు మహమూద్ లక్ష్మణ్ రాము పాసి, ఎల్కపల్లి శ్రీనివాస్, పవన్, వెంకన్న, సత్యనారాయణ కోరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఇల్లందు

11కేవి ఇల్లందు టౌన్ ఫీడర్‌లో మరమ్మతులు నిర్వహించుటకు శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు వడ్డెర బజారు, ఇందిరా నగర్, సంజయ్ నగర్, గవర్నమెంట్ హాస్పిటల్, 2 బస్తీ, సీతారామ టాకీస్ వెనక, కాళిమెయిల్ బస్తీ, పోలీస్ స్టేషన్, శివాలయం, ఆం బజారు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఏఈ ప్రకటనలో తెలిపారు.

మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



నవతెలంగాణ-కొత్తగూడెం

ఉమ్మడి నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ప్రశ్నించే గొంతు తీన్మార్ మల్లన్నని శాసనమండలికి పంపాలని, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని టిపిసిసి ఎలక్షన్ మేనేజ్మెంట్ కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్, కో-కన్వీనర్ కత్తి వెంకటస్వామి అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కో-ఆర్డినేటర్, టిపిసిసి సభ్యులు నాగ సీతారాములు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల గ్రాడ్యుయేట్ ఎన్నికలలో సిపిఐ, సిపిఐ(ఎం), టీజేఎస్ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అలియాస్ (చింతపండు నవీన్) పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును మొదటి ప్రాధాన్యతగా తీన్మార్ మల్లన్నకు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వంలో ఇప్పటికే రాష్ట్రంలో 30 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, రానున్న రోజుల్లో మరిన్ని నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. షాబీర్ పాష, సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోటదేవి ప్రసన్న, ఐఎన్టీయూసీ నాయకుడు డాక్టర్ శంకర్ నాయక్, టీజేఎస్ శివప్రసాద్, కోనేరు సత్యనారాయణ, కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మసూద్, భూక్య రమేష్, సలిగంటి శ్రీనివాస్, సుందర్లాల్ కోరి,పాల సత్యనారాయణ రెడ్డి, బాల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ప్రచారం..

మల్లన్న గెలుపుకోసం సిపిఐ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఎల్ఐసి, బ్యాంకులు, విద్యాసంస్థల్లోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ప్రచార కరపత్రాలు అందించి మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా మాట్లాడుతూ రాజధానికే పరిమితమయ్యే బిజెపి అభ్యర్థికి ఓట్లడిగె అర్హత, హక్కు ఎక్కడిదన్నారు. ప్రస్తుత పరిస్థితిలో కమ్యూనిస్టు, కాంగ్రెస్ కలయికనే ప్రజలు కోరుకుంటున్నారని, వారితోనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, గెద్దాడు నగేష్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, ఫహీమ్, జర్పుల ఉపేందర్, బోయిన విజయకుమార్, మాచర్ల శ్రీనివాస్, సత్యనారాయణ చారి, యూసుఫ్, ధర్మరాజు, పిడుగు శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, ఖయూమ్, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.



చర్ల : ఈ నెల 27వ తారీఖున జరగబోయే వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భద్రాచలం నియోజకవర్గం టీపీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్ కోరారు. గురువారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యావంతులందరూ ఆలోచన చేయండి, గత కేసీఆర్ ప్రభుత్వంలో మీ అందరి కోసం ప్రశ్నించి ఎన్నో అవాంతరాలు, ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అన్నారు. బ్యాలెట్ పేపర్‌లో సీరియల్ నెంబర్ 2 పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మల్లన్నను గెలిపించాలని విద్యావంతులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చీమలమర్రి మురళీకృష్ణ, ఎంపీటీసీ మడకం పద్మజ, తాండవ రాయుడు, శ్రీను, పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలి : మెచ్చా



నవతెలంగాణ-దమ్మపేట

ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అశ్వారావుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కోరారు. గురువారం దమ్మపేటలో రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ మెచ్చా పట్టభద్రులను కలుసుకొని ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు, దారా యుగంధర్, బుడే, చిన్నవెంకటేశ్వర్లు, అబ్దుల్‌జిన్నా, ఏసుబాబు, శ్రీను, లక్ష్మీనారాయణ, లక్ష్మయ్య, సురేష్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పినపాక నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పినపాక బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ రెడ్డి కోరారు. గురువారం పినపాక మండలంలో పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలంటే మండలిలో గళమెత్తే నాయకులు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం వైస్ చైర్మెన్ బత్తుల వెంకట రెడ్డి, నాసర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు మండలంలోని సారపాకలో గల ఐటీసీ ఎంప్లాయిస్ కాలనీలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు ఎన్నికల ప్రచారం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల కార్యనిర్వాహక అధ్యక్షులు జలగం జగదీష్, సారపాక పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుపతి ఏసోబు, మండల నాయకులు, చుక్కపల్లి బాలాజీ, బిట్ర సాయి బాబా, కోమటిరెడ్డి రాజశేఖర్ రెడ్డి,పంగి సురేష్, అరుణ్ ప్రసాద్, దాసరి మోహన్ రావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ మద్దతు

- చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్

నవతెలంగాణ-ఇల్లందు

ఈ నెల 27న జరిగే పోలింగ్లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ మద్దతు తెలుపుతున్నట్టు చైర్మెన్ డాక్టర్ శ్రీధర్ కుమార్ లోథ్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని గ్రాడ్యుయేటు ఓటర్లుగా నమోదు చేసుకున్న వారందరికి విజ్ఞప్తి చేశారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేటు ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న రాజకీయ పార్టీలలో కాంగ్రెసు పార్టీ మాత్రమే భారత రాజ్యాంగాన్ని రక్షించడంలో, లౌకిక విధానాన్ని కొనసాగించడంలో, చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న పార్టీగా వున్నదని తెలిపారు. సామాన్యుడు జీవించడానికి కాస్త దోహదపడుతున్న పార్టీగా ఉన్నదని, యువతకు ఉపాధి కల్పనలో కూడా ముందున్నదని, దేశంలో భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడే పార్టీగా ఉన్నందున కాంగ్రేసు పార్టీ అభ్యర్థినే శాసన మండలి సభ్యునిగా గెలిపించుకోవడం మంచిదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల మధ్య మతం పేరిట చిచ్చుపెట్టడం, కాకులను, గద్దలను కొట్టి రాబంధులకు వేసినట్లు, బడా కార్పొరేట్ల ప్రయోజనాల కొరకే పని చేస్తున్నదన్నారు. విద్యారంగాన్ని నూతన విద్యా విధానం పేరిట పూర్తిగా ప్రైవేటీకరించే విధానాలతో దేశపాలన కొనసాగిస్తుందని తెలిపారు. గత రాష్ట్ర ప్రభుత్వం కుడా కేంద్ర ప్రభుత్వం దారిలో పోతున్నట్లే కనిపిస్తుందని, ముఖ్యంగా ఈ పది సంవత్సరాల కాలంలో ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసిందని తెలిపారు. ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు మౌలిక వసతులు, సరిపడా నిధులు కూడా కేటాయించలేదని, యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులకు గత ఏడు సంవత్సరాల నుంచి కూడా జీతాలు పెంచలేదని, అభివృద్ధి పేరిట నిర్మాణాలలో అధిక దుబారా ఖర్చులు చేసినట్టు కన్పిస్తుందని అన్నారు. ఈ పరిస్థితులలో మల్లన్నను గెలిపించటమే ఉత్తమమని ఆయన తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం | మే 24, 2024 | www.navatelangana.com



సిఎంఆర్ రైస్ దిగుమతి లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ విపి.గౌతమ్

నవతెలంగాణ- నేలకొండపల్లి

సీఎంఆర్ బియ్యం దిగుమతుల లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ అన్నారు. గురువారం నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం వద్ద గల అరుణాచలశివ రైస్ అండ్ ఫుడ్ ఇండస్ట్రీస్‌ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్ రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లు సామర్థ్యం, రోజుకు ఎంత మేర ధాన్యం పడతారు, నిల్వ ఉన్న ధాన్యం ఎంత, హమాలీలు ఎంత మంది పనిచేస్తున్నారనే విషయాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ లో సిఎంఆర్ క్రింద 112 ఏసికే ల రైస్ ఇవ్వాలివుండగా, ఇప్పటికి 22 ఏసికే లు అందించారని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జూన్ చివరి నాటికి లక్ష్యానికి అనుగుణంగా సిఎంఆర్ రైస్ అందించాలని, రోజుకు 6 ఎసికేలు అందించాలని కలెక్టర్ మిల్లు యాజమాన్యాన్ని ఆదేశించారు. సిఎంఆర్ రైస్ లక్ష్యం పూర్తయ్యే వరకు ప్రైవేటు మార్కెట్ కి ఒక్క క్వింటా కూడా ఇవ్వకూడదని ఆయన అన్నారు. సామర్థ్యం మేర పూర్తిగా మిల్లు నడిపంచాలని, హమాలీలను సరిపడా అందుబాటులో ఉంచుకోవాలని ఆయన అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సకాలంలో సిఎంఆర్ రైస్ అందించకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ హెచ్చరించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, నేలకొండపల్లి తహసీల్దార్ గౌరీశంకర్, రైస్ మిల్ మేనేజింగ్ పాట్నర్ సంతోష్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి యూఈఈయూ ఆందోళనలు

నవతెలంగాణ-ఖమ్మం

విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారానికి యూఈఈయూ (సీఐటీయూ) ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు యూఈఈయూ (సీఐటీయూ) కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్, అధ్యక్షులు బి.పుష్ప రాణి, కార్యదర్శి కామినేని నాగేశ్వరరావు, ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25 న శనివారం డివిజనల్ ఇంజనీర్లకు, 28న మంగళవారం సూపరిండెంట్ ఇంజనీర్లకు, జూన్ 10న సిఎండిలకు, సామూహిక దరఖాస్తులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యాచరణ హైదరాబాద్‌లో ఉంటుందని, విద్యుత్ శాఖలో అనేక సమస్యల పరిష్కారం కోసం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దశల వారి పోరాట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ కార్మికులు ఉద్యోగులు, ఆర్టిజన్లు మీటర్ రీడర్‌లు, బిల్ కలెక్టర్లు, అన్ మాన్ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తక్కువ సిబ్బందితో అనుకున్నా విధంగా టార్గెట్లు రీచ్ అవుతున్నామని, కానీ రోజు వారీ పనిభారం ఎక్కువవుతుందని, దీనికి అనుగుణంగా, సిబ్బంది లేరని ఉన్నవారిపైనే పని భారం ఎక్కువైందని, డిఎ, ఎరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ప్రమోషన్లు, ఖాళీ భర్తీ, ఎప్పటి నుండో ఉన్నదని, సిబిడి, ట్రాన్స్ కో అనుమాన్ కార్మికుల సమస్యలు ఇందులో ఉన్నాయని, వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం చర్య తీసుకోవాలని, గత ప్రభుత్వం నుండి ఈ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని, కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి నివేదించడం జరిగిందని, కానీ పరిష్కారం కావడం లేదని చెప్పారు. అందుకే ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కిష్టారం ఓసీలో ఘనంగా 'ఈద్ ఉల్ ఫితర్' వేడుక

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి మండలం కిష్టారం ఓసీ ప్రాజెక్టు కార్యాలయం వద్ద గురువారం ప్రాజెక్టు ఆఫీసర్ మునగంటి వేదాద్రి నరసింహారావు ఆధ్వర్యంలో ఈద్ ఉల్ ఫితర్ వేడుకను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో ప్రముఖ వక్త బాసిత్ మాట్లాడుతూ రంజాను ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మిఠాయిలు, సేమియా విందును ఉద్యోగులకు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఓసీ మేనేజర్ రామకృష్ణ, ఇంజినీరు జగదీశ్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రెటరీలు కిశోర్, బాలాజీ, సంక్షేమాధికారి విజయ సందీప్, కిష్టారం ఓసీలో పనిచేసే ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు.

అమలోద్భవి మాత దేవాలయం ప్రారంభించిన పీఠాధిపతులు

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మునిసిపాలిటీ పరిధిలోని సోమవరం గ్రామంలో నూతనంగా పునర్నిర్మాణం చేపట్టిన అమలోద్భవి మాత దేవాలయాన్ని ఖమ్మం పీఠాధిపతులు బిషప్ సగిలి ప్రకాశ్, విశ్రాంతి పీఠాధిపతులు డాక్టర్ పాల్ మైపన్ గురువారం ప్రారంభించారు. ప్రారంభ కార్యక్రమానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, వేలాది మంది భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం పీఠాధిపతులు డాక్టర్ పాల్ మైపన్, సగిలి ప్రకాశం మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచారని, క్రీస్తు జీవితాన్ని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. క్రీస్తును అనునిత్యం తలుచుకునేందుకు ప్రార్థన మందిరాలు ఏర్పాటు చేసుకోవడం మంచి శుభ పరిణామని అన్నారు. ప్రజలు తమ సంపాదనలో కొంత భాగాన్ని సేవకు ఖర్చు చేయాలని, పేదవారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రార్థన మందిరాలు శాంతిని నెలకొల్పుతాయని అన్నారు. అనంతరం కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, దాస్ నాయక్, ఖమ్మం పీఠాధిపతులు పాల్ మైపన్, సగిలి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, శీలం వెంకట నర్సిరెడ్డి, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, పొదిలి హరినాథ్, కొల్లి రమేష్, గొల్లపూడి కృష్ణారావు, మేడిశెట్టి కృష్ణ, జవ్వాజి నాగరాజు, కమిటీ నిర్వాహకులు నంద్రు నాగరాజు, ఇండ్ల పుల్లయ్య, తాటికొండ రాంబాబు, ఎస్.గోపి, కర్రీ నాగభూషణం, ఇండ్ల సురేష్, ఇండ్ల బాబు, ఆది ఆనందరావు తదితరులు పాల్గొన్నారు


వైభవంగా స్వామి వారి కల్యాణం

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ గ్రామ సమీపాన వృద్ధగిరి గుట్ట వద్ద లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణమును ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 22 నుండి లక్ష్మినరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం విధితమే. సువర్ణాపురం, న్యూలక్ష్మీపురం, ముదిగొండ గ్రామాలకు చెందిన స్వామివారి భక్తులు, ప్రజలు, గ్రామ పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తిరు కల్యాణమును తిలకించి పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయని ఆలయ పూజారి రొంపిచర్ల నరసింహచార్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి

నవతెలంగాణ- ఖమ్మం



పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న జరగనున్న ఎంఎల్‌సి ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ ఎంఎల్‌సి. ఎన్నికల ఇంచార్జి గుండాల కృష్ణ కోరారు. రాకేశ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ గురువారం 44, తదితర డివిజన్ల పరిధిలోని పట్టభద్రులను కలసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రకటించిన నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన తదితర హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం విద్యావంతుడైన రాకేశ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సామాన్య కుటుంబం నుండి వచ్చిన ఆయనను గెలిపిస్తే పెద్దల సభలో ప్రశ్నించే గొంతుకగా వ్యవహరిస్తూ పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పట్టభద్రులు బిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, నాయకులు శీలం శెట్టి వీరభద్రం, కన్నం ప్రసన్న, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు తాజుద్దీన్, యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

నవతెలంగాణ-ముదిగొండ



మండల కేంద్రమైన ముదిగొండకు చెందిన యామాల రాము(40) ట్రాక్టర్ డ్రైవర్ ముదిగొండ ఊర చెరువు సమీపంలో వ్యవసాయ పొలంలో పనిచేస్తూ దాహం వేస్తుండగా పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో నీళ్ల తాగినందుకు దిగగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. దీంతో రాముకు ఈత రాకపోవడంతో మృతి చెందాడని ఎస్ఐ గజ్జెల నరేష్ గురువారం తెలిపారు. మృతుడు రాము అక్క కందిమల్ల సరస్వతి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇక నుండి ప్రతి బడి అమ్మ ఒడి

- మహిళలకు పాఠశాలల బాధ్యతలు
- ఈ విద్యా సంవత్సరం నుంచే అమలకు ప్రభుత్వం ఆదేశం

నవతెలంగాణ-బోనకల్



రాష్ట్రంలోని ప్రతీ బడీ.. ఒక అమ్మ ఒడిలా ఉండేలా ప్రభుత్వ పాఠశాలల ఆలనా పాలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సరికొత్త ప్రణాళికకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల బాగోగులను పట్టించుకునే బాధ్యతను ఆ గ్రామాల స్వయం సహాయక సంఘాల మహిళలకు అప్పగించాలని ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. సీఎం ఆదేశాల ప్రకారం ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. కమిటీల్లో ఆయా గ్రామాల మహిళా సంఘం అధ్య క్షులు, పాఠశాల ప్రధానో పాధ్యాయులు, ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారు. ఇకపై పాఠశాలల్లో జరిగే ప్రతీ పనిని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ తీర్మానంతోనే చేపట్టనున్నారు. సంబంధిత కార్యాచరణను ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. పాఠశాలల్లో అవసరమయ్యే తక్షణ పనులను గుర్తించి జూన్ 10 లోగా పూర్తి చేయాలని ఆయన ఉన్నతాధికారులకు సూచించారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రూ.25 వేలలోపు ఖర్చయ్యే పనులను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలే చేపడతాయి. అంతకు మించి, రూ.లక్ష వరకు ఖర్చయ్యే పనులకు ఎంపీడీవో, రూ. లక్ష దాటిన పనులకు జిల్లా కలెక్టర్ల అనుమతిలో చేపట్టాల్సి ఉంటుంది. పాఠశాలల్లో కిటికీలు, తలుపులు, ఎలక్ట్రిక్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్లు, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మతులను ఆయా కమిటీలు చేపట్టను న్నాయి. ఇందుకవసరమైన దాదాపు రూ.600 కోట్లను ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. సంఘాల మహిళలపై భారం పడకుండా ఆదర్శ కమిటీలు చేపట్టే పనులకు రూ.25 వేలు అడ్వాన్సుగా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వీటితోపాటు పాఠశాల విద్యార్థులకు అవసరమైన యూనిఫారాలను కుట్టే పనులను కూడా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకే అప్పగించింది. దీంతో వాటిల్లోని మహిళలకు స్థానికంగా ఉపాధి దొరుకతుందనీ, కొంత మేరకు ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈసారి బడిబాట కార్యక్రమాన్ని కూడా తల్లుల కమిటీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరుగుతుందనీ, తల్లుల పర్యవేక్షణ పెంచటం ద్వారా బడిలో చేరే ఆడ పిల్లల సంఖ్య కూడా పెరుగు తుందని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ప్రయివేటు బడులపై మోజును తగ్గించటమే కాక నాణ్యమైన విద్యనందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించటంలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

'ప్రజాగొంతుక తీన్మార్ మల్లన్నను చట్టసభకు పంపుదాం'

నవతెలంగాణ-పాల్వంచ



ప్రజావ్యతిరేక పాలకులను నిలదిస్తున్న తీన్మార్ మల్లన్న ప్రజాగొంతుక అని, ఈ గొంతుకను చట్టసభకు పంపితే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే.సాబీర్ పాషా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావులి అన్నారు. గురువారం పట్టణ పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సీపీఐ, కాంగ్రెస్, సీపీఎం, మిత్రపక్షాలు బలపరిచిన వరంగల్ ఖమ్మం నల్లగొండ జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయం కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ జర్నలిస్టుగా ప్రజా సమస్యలు, పట్టభద్రుల సమస్యలు తెలిసిన మల్లన్న గెలుపు ప్రస్తుత పరిస్తిలో అవసరమన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్సీ ప్రజలకు చేసింది శూన్యమని, గెలిచిన తర్వాత మొఖం చాటేసి వారి నాయకుడికి ఊడిగం చేశాడని విమర్శించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిస్తే వరుస విజయాలు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండుకోట్ల ఉద్యోగాల హామీతో బిజెపి, రెండు లక్షల ఉద్యోగాల హామీతో బిఆర్ఎస్ నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. మధ్యలో కాడి వదిలేసిన బిఆర్ఎస్ పార్టీకి, ఆ పార్టీ నుంచి పోటీచేస్తున్న అభ్యర్థికి ఓటుఅడిగే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. రెండు కోట్ల ఉద్యోగాల హామీని అమలు చేయకపోగా కోటి మందిని ఉద్యోగాల నుంచి తొలగించి రోడ్డుపాలు చేసిన బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. తీన్మార్ మల్లన్న గెలుపుకోసం కమ్యూనిస్టు, కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరగనున్న ఎన్నికలో తీన్మార్ మల్లన్న సీరియల్ నెంబర్ 2 పై మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, ఎస్కే.లాల్ పాషా, జకరయ్య, కాంగ్రెస్ నాయకులు కొమ్మరిరాజు విజయ, రాంబాబు, భార్గవి, సూరిలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మరణానికి కళాశాల యాజమాన్యమే కారణం

- కళాశాల గుర్తింపు రద్దు చేయాలి
- యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి
- భాద్యులను కఠినంగా శిక్షించాలి
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం

నవతెలంగాణ-కొత్తగూడెం



భద్రాచలం కూనవరం రోడ్డు మారుతి నర్సింగ్ కళాశాలలో విద్యార్థిని అనుమానస్పద మృతికి కళాశాల యాజమాన్యమే కారణమని, తక్షణమే కళాశాల గుర్తింపు రద్దు చేసి కళాశాల బాధ్యులైన యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి బి.వీరభద్రం ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కళాశాల యాజమాన్యం తమదేతప్పు లేకపోతే సీసీ ఫుటేజీలను ఎందుకు డిలీట్ చేసారో తెలపాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని యాజమాన్యమే విచక్షణా రహితంగా కొట్టారని, తీవ్రమైన గాయాలతో చనిపోయిందని, బాత్రూమ్‌లో జారిపడి చనిపోయిందనడం తప్పుదోవ పట్టించేందుకే అని తెలిపారు. యాజమాన్యం డబ్బు బలంతో ఘటనను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని, డాక్టర్‌లను, పోలీసుల విచారణ బృందాలను మేనేజ్ చేస్తుందనీ దీన్ని తీవ్రమైన చర్యగా పరిగణించి యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని నిష్పక్షపాతంగా విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే బాధ్యులను గుర్తించాలని, కళాశాల గుర్తింపు రద్దు చేయాలని, జిల్లా కలెక్టర్, డైరెక్టరేట్ మెడికల్ ఎడ్యుకేషన్, నర్సింగ్ కౌన్సిల్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మల్లన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈనెల 27వ తేదీన జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న అత్యధిక మెజారిటీతో గెలిపించాలని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కొండ చరణ్ పిలుపునిచ్చారు. గురువారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ మండల కమిటీ సమావేశం పార్టీ మండల కమిటీ సభ్యుడు వీరభద్రం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కొండ చరణ్ మాట్లాడుతూ నల్లగొండ వరంగల్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గనికి జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దాసరి సాయన్న, పార్టీ మండల నాయకులు వీరభద్రం, శంకర్‌బాబు, వీరన్న, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దీనస్థితికి చలించి నిత్యావసరాల వితరణ

నవతెలంగాణ-సత్తుపల్లి



మంచానికే పరిమితమై, చూసేవారు కరవై అవస్థ పడుతున్న సత్తుపల్లి పట్టణానికి చెందిన ఓ పేద వృద్ధురాలికి సత్తుపల్లి సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధారాణి అండగా నిలిచారు. వృద్ధురాలి ఇంటికెళ్లి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. పట్టణానికి చెందిన సత్యవతి అనే వృద్ధురాలు వెన్నుముక వ్యాధి కారణంగా కాళ్లు చచ్చుబడి గత పదేండ్లుగా మంచానికే పరిమితమై తన వ్యక్తిగత పనులు కూడా చేసుకోలేని దీనస్థితిలో ఉండి పూట గడవడం కూడా కష్టంగా మారిన నేపథ్యంలో ఆమె పరిస్థితి తెలుసుకున్న సుధారాణి వృద్ధురాలికి బియ్యం, నెలకు సరిపడా నిత్యావసరాలను అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఆళ్ళపల్లి మండల పరిధిలోని తీగలంచ గ్రామ సమీపాన గల ఉడుముల గుట్టపై వెలిసిన లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని ఆళ్ళపల్లికి చెందిన పూజారి చింతకాయల కృష్ణమాచార్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా ఆళ్ళపల్లి మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామానికి చెందిన వజ్జ చిరంజీవి దంపతులు, లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల గ్రామానికి చెందిన కల్తి అర్జున్-ప్రేమ సుమలత దంపతులు పెళ్లి పీటలపై కూర్చున్నారు. ఈ వివాహ మహోత్సవానికి కనులారా చూడడానికి పలు గ్రామాల నుంచి భక్తులు ఉత్సుకతతో అధిక సంఖ్యలో హాజరయ్యారు.

అమరుల ఆశయాలను సాధిస్తాం..

- యాస లక్ష్మీ నరసయ్య పెదమల్ల అప్పారావు వర్ధంతి సభలో భూక్యా ,బోంతు..

నవతెలంగాణ-కొణిజర్ల

అమరుల ఆశయాలను సాధిస్తామని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బోంతు రాంబాబు అన్నారు. మండల పరిధిలోని తనికెళ్ళ గ్రామంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు యాస లక్ష్మి నరసయ్య, పెద్దమాళ్ల అప్పారావుల వర్ధంతి గురువారం గ్రామ శాఖ అద్వర్యంలో నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు స్థూపాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసా లక్ష్మీ నర్సయ్య అప్పారావు సీపీఐ(ఎం) అభివృద్ధి అండతో ప్రజా ఉద్యమాల్లు నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొప్పుల క్రిష్టయ్య జిల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు జిల్లా కార్యదర్శి షేక్ రంజాన్ ఐలూ జిల్లా నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా నాయకులు పివి రావు యాసా వెంకటేశ్వర్లు, కొనపర్తి విష్ణుమూర్తి, సీపీఐ(ఎం) మండల నాయకులు మోత్కూరు వెంకటేశ్వరావు, చల్ల నారాయణ, యాసా వెంకయ్య, యాసా ప్రభాకర్‌రావు, తిలక్, లక్ష్మీ నరసయ్య, కుమారుడు వెంకటేశ్వర్లు, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు వేముల సాంబశివరావు, వేముల శ్రీనివాసరావు, అప్పారావు, సతీమణి పద్మినీ, జోసేటోయిన నరసింహారావు, యాసా రామారావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా కాంగ్రెస్ ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశం

- వేదిక మీదకు ఒక వర్గ నేతలనే పిలిచారంటూ నిరసన
- సమావేశం నుండి వెళ్లిన పొంగులేటి వర్గీయులు

నవతెలంగాణ-కారేపల్లి

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ గురువారం కారేపల్లి లో నిర్వహించిన సమావేశం రసాభసగా మారింది. ఎమ్మెల్యే సమక్షంలోనే కార్యకర్తలు గొడవకు దిగారు. సంత మాజీ చైర్మన్ మల్లెం నాగేశ్వరావు నాయకులను పరిచయం చేస్తూ వేదిక పైకి పిలిచే క్రమంలో పాతతరం నాయకులను ముందు పిలవకుండా ఇటివల పార్టీ లో చేరిన వారిని ముందు స్టేజీ పైకి పిలవటంతో గొడవ ప్రారంభమైంది. దీంతో మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులకు ఇచ్చే విలువ ఇదేనా అంటూ సొసైటీ డైరెక్టర్ బానోత్ హీరాలాల్, గుగులోత్ భీముడు లు అభ్యంతరం తెలిపారు. వీరికి మద్దతు గా వైరా నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు దారావత్ వినోద్ మరికొంత కార్యకర్తలు స్టేజీ దగ్గర కు వచ్చి ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిని పగడాల మంజుల, మేదర్ వీర ప్రతాప్ లు సముదాయిస్తున్నా కార్యకర్తలు వినిపించుకోకుండా వేదిక ముందు నిరసన తెలిపారు. ఇదే క్రమంలో కొందరి వైఖరిని నిరసిస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరావు, గుగులోత్ శ్రీను లు స్టేజి మీద నుంచి దిగిపోయారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, రాష్ట్ర నాయకులు బొర్ర రాజశేఖర్ లు కార్యకర్తలను సముదాయించి సమావేశం కొనసాగేలా చేశారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయానికి అందరూ ఐక్యంగా కషి చేయాలని ఎమ్మెల్యే రామదాసు నాయక్ , బొర్ర రాజశేఖర్ లో కార్యకర్తలను కోరారు.



మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ కలెక్టరేట్‌లో ప్రచారం

నవతెలంగాణ-ఖమ్మం

నల్గొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఎంఎల్సీ పట్టభద్రుల అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ కలెక్టర్ కార్యాలయం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్రా శ్రీకాంత్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు , ఖమ్మం నగర అధ్యక్షుడు పీసీసీ సభ్యులు మహమ్మద్ జావేద్ , 8 వ డివిజన్ కార్పొరేటర్ లాకావత్ సైదులు , జిల్లా కిసాన్ ఉపాధ్యక్షులు అధ్యక్షులు కొంటేముక్కుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లీమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కారేపల్లి

ఇంటర్ సప్లీమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కారేపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం తెలిపారు. గురువారం కారేపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ 24వతేది నుండి 31వ తేది వరకు జరిగే పరీక్షలకు కారేపల్లి జూనియర్ కళాశాల, మోడల్ కళాశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాలలో 400 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. సప్లిమెంటర్ పరీక్షలకు కారేపల్లి, కామేపల్లి కస్తూర్బా విద్యాలయాలు, మైనార్టీ, గిరిజన గురుకులాలు, కామేపల్లి, కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఈపరీక్షలు హాజరు కానున్నారని తెలిపారు.

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కూసుమంచి

రైతులందరూ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏవో వాణి తెలిపారు. గురువారం మండలంలోని కేశవాపురం గ్రామంలో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులందరూ నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఎవరైనా గుడ్డ సంచులలో కానీ, నకిలీ లేబుల్‌తో ఉన్న ప్యాకెట్లలో కానీ విత్తనాలు అమ్మినట్లయితే ఎట్టి పరిస్థితుల్లోనూ అటువంటి వారి వద్ద విత్తనాలు తీసుకోవద్దని, లైసెన్స్ కలిగిన అధికృత డీలర్ నుండి మాత్రమే విత్తనాలను తీసుకోవాలని, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వరి పంట అవశేషాలను తగలబెట్టడం ద్వారా జరిగే అనర్థాలను గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవీందర్, రవితేజ, రైతులు పాల్గొన్నారు.

లైసెన్స్ పొందిన వ్యాపారుల నుండి విత్తనాలు కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-తల్లాడ

లైసెన్స్ పొందిన వ్యాపారుల నుండి విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి షేక్ నాగుల్ మీరా తెలిపారు. మండల పరిధిలోని బిల్లుపాడు గ్రామంలో రైతులకు ఆయన గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ గ్రామాలలో తక్కువ ధరకే విత్తనాలు విక్రయించే వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని పలు సలహాలు సూచనలు చేసి అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు అమ్మేవారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు జక్కంపూడి రమేష్, ఏనికి అనంత రాములు, పులపాల వీరభద్రరావు, శ్రీనివాసరావు, వేముల నరసింహారావు, తదితర రైతులు పాల్గొన్నారు.

కార్డెన్ సెర్చ్

- పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని సుజ్ఞాపురం గ్రామంలో గురువారం దుమ్ముగూడెం పోలీసులు మరియు స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఎటువంటి పత్రాలు లేకుండా ఉన్న 15 మోటార్ సైకిల్‌లను గుర్తించి విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇటీవల కాలంలో దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్‌లో నాటు సారా కేసుల్లో ఎక్కువగా సుజ్ఞాపురం గ్రామస్తులు పట్టుబడుతుండడంతో గ్రామస్తులు అందరిని నాటుసారా తయారీ, అమ్మకం చేయకుండా ఉండేందుకు తగు కౌన్సెలింగ్ ఇచ్చి గ్రామ పెద్దల చేత రాతపూర్వకంగా పోలీసులు హామీ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో దుమ్ముగూడెం ఎస్సైలు పీ. కేశవరావు, పి. గణేష్, ఇన్స్పెక్టర్ బీ. అశోక్, దుమ్ముగూడెం పిఎస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో గాలి వాన

పలుచోట్ల నేల వాలిన వృక్షాలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలో గురువారం సాయంత్రం పెద్దపెద్ద ఉరుములు మెరుపులతో బలమైన గాలులతో ఓ మోస్తరు భారీ వర్షం కురిసింది. గురువారం సాయంత్రం ఒక్కసారిగా గాలులతో కూడిన కురుస్తున్న వర్షానికి ఇండ్లల్లో ఉన్న ప్రజల సైతం భయభ్రాంతులకు గురయ్యారు. గాలివానకు ఇండ్లలో ఉన్న వృక్షాలతో పాటు రహదారి వెంబడి పలు వృక్షాలు నేల వాలాయి. పలుచోట్ల ఇంటి పై కప్పులు లేచిపోయాయి. ఏది ఏమైనా పెద్దపెద్ద ఉరుములతో గాలివాన కురుస్తున్న సమయంలో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు అని చెప్పవచ్చు.

నేడు నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల విస్తృత సమావేశం

నవతెలంగాణ-బోనకల్

బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ పట్టబద్దుర్ల విస్తృత సమావేశం బోనకల్లోనే ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు తెలిపారు. మండల కేంద్రంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టబద్దుర్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు ఈ సమావేశానికి రాష్ట్ర మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆ పార్టీ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు తో పాటు జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఐదు మండలాలకు సంబంధించి ఒక్కో మండలం నుండి నాలుగు వందల మంది గ్రాడ్యుయేట్ ఓటర్స్‌తో పాటు 100 మంది పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు మండల ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు ఆ పార్టీ నాయకులు బానోత్ కొండ, కొనకంచి నాగరాజు, గుండపనేని సుధాకర్ రావు, కంచర్ల బాబు, మోర్ల నరసింహారావు, వడ్డే నరేష్, తన్నీరు పుల్లారావు, కొనకంచి నాగరాజు, బోయినపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మహోన్నత వ్యక్తి పెన్నా అనంతరామ శర్మ

- వారి ఆశయాలు, ఆదర్శాలు యువతరానికి మార్గదర్శకం
- కమ్యూనిస్టులు లేకపోతే దేశానికి భవిష్యత్ లేదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- దొడ్డి కొమరయ్య భవనంలో శర్మ భౌతికకాయానికి నివాళులు
- స్వగ్రామంలో ముగిసిన అంత్యక్రియలు
- పాల్గొన్న పార్టీ రాష్ట్ర నాయకత్వం

నవతెలంగాణ-నల్లగొండటౌన్/కట్టంగూర్

సమ సమాజ స్థాపన కోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులు పెన్నా అనంతరామ శర్మ అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. అనంతరామ శర్మ బుధవారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. అంత్యక్రియలు గురువారం సాయంత్రం ఆయన స్వగ్రామమైన కట్టంగూర్ మండలంలోని పిట్టంపల్లిలో ముగిశాయి. అంతకుముందు ఉదయం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం అనంతరామశర్మ భౌతికకాయాన్ని ఉంచారు. తమ్మినేనితోపాటు రాష్ట్ర నేతలు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడుతూ.. కమ్యూనిస్టులు లేకపోతే దేశానికి భవిష్యత్ లేదన్నారు. అనంతరామశర్మ ఆదర్శ కమ్యూనిస్టుగా జీవించారని కొనియాడారు. నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడిన శర్మ మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటన్నారు. ఆయనతో తనకు సన్నిహిత సంబంధం ఉందని, నమ్మిన సిద్ధాంతం కోసం పోరాడిన వ్యక్తి శర్మ అని అన్నారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలు యువతరానికి మార్గదర్శకం అని చెప్పారు. అనంతరామ శర్మ మరణం కమ్యూనిస్టు పార్టీలకు ముఖ్యంగా సీపీఐ(ఎం)కి తీవ్ర నష్టమని చెప్పారు.

కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. పెన్నా అనంతరామ శర్మ ప్రజా సంఘాల్లో బాధ్యతలు నిర్వహించి కార్మికుల సమస్యలు పరిష్కరించారని గుర్తు చేశారు. కమ్యూనిస్టులకు చివరికి మిగిలేది ఎర్రజెండా మాత్రమే అని అన్నారు. చనిపోయాక కూడా ఎర్రజెండా కప్పుకోవడమే నిజమైన కమ్యూనిస్టు అని తెలిపారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. అనంతరామ శర్మ నిస్వార్థ ఉద్యమకారుడని, ప్రజా ఉద్యమంలో తనతో కలిసి పనిచేశానని గుర్తు చేసుకున్నారు.

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. వయసులో తేడా ఉన్నా ఉద్యమంలో కలిసి పని చేశామని తెలిపారు. అసంఘటిత రంగాన్ని సంఘటితం చేయడంలో అనంతరామ శర్మ కీలక పాత్ర పోషించారన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ మాట్లాడుతూ.. పెన్నా అనంతరామశర్మ మరణం ప్రజాతంత్ర ఉద్యమానికి, పార్టీకి తీరనిలోటని అన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డీజీ నరసింహారావు మాట్లాడుతూ.. అనంతరామశర్మ సీపీఐ(ఎం)లో సీఐటీయూ యూనియన్‌కు సలహాదారునిగా వ్యవహరించి ఎన్నో కార్మికుల సమస్యలు పరిష్కరించారని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. శర్మ చిన్న వయసు నుంచే ఎర్రజెండా పట్టి తుద వరకు ఎన్నో ప్రజాపోరాటాలు చేశారన్నారు. పోరాటాల్లో ఆటుపోటులు, ఆటంకాలు ఎదుర్కొంటూ ముందుకు సాగారని తెలిపారు. జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల కార్యదర్శులు మల్లు నాగార్జున రెడ్డి, ఎండీ.జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కమిటీ సంతాపం

తెలంగాణ రాష్ట్రం నల్లగొండ జిల్లా సీపీఐ(ఎం) నాయకులు, కార్మికోద్యమ నాయకులు పెన్నా అనంతరామ శర్మ మృతికి సీపీఐ (ఎం) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ తీవ్ర సంతాపం ప్రకటించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు గురువారం ఈ మేరకు ఒక సంతాప సందేశాన్ని పంపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రముఖ పాత్ర నిర్వహించడమే కాక ఆ తర్వాత పార్టీ విచ్ఛిన్నాలను ఎదుర్కొని దృఢంగా నిలబడ్డ నాయకుడు అనంతరామ శర్మ అని ఆయన కొనియాడారు. చివరి శ్వాస వరకు నిలబడి ఉద్యమాన్ని కాపాడి, దాని అభివద్ధికి అహరహం కృషిచేసిన అనంతరామశర్మ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని వ్యాఖ్యానించారు. ఆయనకు సీపీఐ(ఎం) ఆంధ్ర ప్రదేశ్ కమిటీ శ్రద్ధాంజలి ఘటిస్తున్నదని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తున్నదని శ్రీనివాసరావు తన సందేశంలో పేర్కొన్నారు.

పోరాట యోధునికి ఘనంగా తుది వీడ్కోలు

సీపీఐ(ఎం) శ్రేణులు, పెద్దఎత్తున తరలివచ్చి పోరాట యోధునికి ఘనంగా తుది వీడ్కోలు పలికారు. అనంతరామ శర్మ స్వగ్రామం కట్టంగూరు మండలంలోని పిట్టంపల్లి గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. అనంతరామశర్మ కుమారులు పెన్నా రవికాంత్ శర్మ, పెన్నా యాదగిరి శర్మ, సరేశ్ శర్మ, కుమార్తె సీతమ్మ కార్యక్రమాలు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎండీ జహంగీర్, మల్లు నాగార్జున రెడ్డి, నాయకులు నారి ఐలయ్య, పాలడుగు నాగార్జున, బొజ్జ చిన్న వెంకులు, చిన్నపాక లక్ష్మీనారాయణ, దండంపల్లి సత్తయ్య, నాంపల్లి చంద్రమౌళి, ప్రభావతి, పెంజర్ల సైదులు, ఇటుకల సురేందర్, చిలుముల హేమంతయ్య, ఎన్నా నర్సిరెడ్డి, సయ్యద్ హాశం, కారింగు మల్లేష్, జాలాంజనేయులు, గోలి స్వామి, గుండమల్ల బిక్షం, కటికం సత్తయ్య గౌడ్, మాజీ ఎంపీపీ కొండా లింగస్వామి, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, పాటల వెంకట్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మెన్ చేగోని సాయిలు, పల్నాటి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

మిల్లర్ల నుంచి క్వింటాకు రూ.216 వసూలు నిజం కాదా?





- సమాధానం చెప్పలేకనే మొహం చాటేసిన మంత్రి ఉత్తమ్
- జగ్గారెడ్డికేం తెలుసు.. మంత్రి ఎప్పుడొచ్చినా చర్చకు సిద్ధం
- బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- ఉత్తమ్ వైట్‌పేపర్ లాంటోడు.. ఆయనపై ఇంక్ చల్లకండి : జగ్గారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధాన్యం కొనుగోళ్లలో మిల్లర్ల నుంచి క్వింటాకు రూ.216 అదనంగా వసూలు చేసింది నిజం కాదా? అని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ శాఖలో జరిగిన అవినీతి, అక్రమాలపై సమాధానం చెప్పడానికి చేతగాకనే మంత్రి మొహం చాటేశారనీ, అధికారులతో స్టేట్మెంట్లు ఇప్పిస్తున్నారని విమర్శించారు. ప్రజాసమస్యలపై ప్రతిపక్ష నేతగా ప్రశ్నిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయించి కేసులు పెట్టిస్తారా? ప్రజాపాలన అంటే ఇదేనా? అని నిలదీశారు. తాను ఎత్తిచూపిన లోపాలను ఎలా సరిచేసుకోవాలనే దానిపై ఆలోచించుకోవాలని సూచించారు. తన దగ్గర అన్ని ఆధారాలున్నాయనీ, దీనిపై మంత్రి ఉత్తమ్ ఎప్పుడొచ్చినా చర్చకు సిద్ధమేనని మరోమారు సవాల్ విసిరారు. సివిల్ సప్లయ్ శాఖ అవినీతిపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జగ్గారెడ్డికి ఆ శాఖపై ఏం అవగాహన ఉందని ప్రశ్నించారు. తాను బాధ్యతగల ప్రజాప్రతినిధిగా బయటపెట్టానన్నారు. జనవరి 25 ఒక్కరోజే టెండర్ల కమిటీ వేయడం, గైడ్‌లైన్స్ రూపొందించడం, గ్లోబల్ టెండర్ల ప్రకటన చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి ముందుకొచ్చిన కాంట్రాక్టర్లను కొందరు అధికారులు బెదిరించారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని జలసౌధలో రైస్‌మిల్లర్లతో ఒప్పందాలు చేసుకున్నారని విమర్శించారు. క్వింటాకు రూ.216ను మిల్లర్ల నుంచి వసూలు చేసింది నిజం కాదా? మిల్లర్లు బియ్యం ఇస్తామంటే డబ్బులే ఇవ్వాలని బెదిరించింది వాస్తవం కాదా? స్థాయికి మించి అదనపు ధాన్యాన్ని మిల్లర్లకు ఇస్తే ఎలా భరిస్తారు? జలసౌధలో మీరు చేసిన అరాచకాలు బయటపెట్టాలా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. కాంట్రాక్టర్ మే 23లోపు ధాన్యాన్ని పూర్తిగా లిఫ్ట్ చేయకపోతే బ్లాక్ లిస్టులో పెడతామన్నారు కదా ఎందుకు అలా చేయలేదని నిలదీశారు. క్వింటాకు రూ.2259 చొప్పున లక్షా 59 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం అమ్మేశారని తెలిపారు. ఇప్పుడు మధ్యాహ్న భోజనం, హాస్టల్ విద్యార్థుల కోసం అంటూ మళ్లీ ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. క్వింటాకు రూ.5700 చొప్పున 22 లక్షల క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేశారని చెప్పారు. 10శాతం నూక ఉన్న బియ్యం బహిరంగ మార్కెట్ లో రూ.38 రూపాయలకే దొరుకుతున్నదన్నారు. రూ.2259కి ప్రభుత్వం అమ్మేసి ఇప్పుడు రూ.5700 చొప్పున ఎందుకు కొంటున్నదని ప్రశ్నించారు. సివిల్ సప్లయ్ శాఖలో ఇలా జరిగిన ఎన్నో అవినీతి, అక్రమాలపై తమ దగ్గర స్పష్టమైన ఆధారాలున్నాయని చెప్పారు. కాలేజీలను, కోట్ల ఆస్తులను వదులుకుని ప్రజా సేవ కోసం రాజకీయాల్లో వచ్చాననీ, కేసులకు భయపడే వ్యక్తిని కాదని చెప్పారు.

ఉత్తమ్ వైట్‌పేపర్ లాంటోడు : జగ్గారెడ్డి

భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వైట్ పేపర్ లాంటోడనీ, ఆయనపై ఇంక్ చల్లొద్దంటూ బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వరరెడ్డికి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి హితవు పలికారు. యూ ట్యాక్స్ అంటూ ఆరోపించిన ఏలేటి... మీ వద్ద ఆధారాలుంటే మీడియాకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిది ఉన్నట్టు బట్టకాల్చి మీద వేయొద్దంటూ ఆయన హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధికార ప్రతినిధులు డాక్టర్ లింగం యాదవ్, చనగాని దయాకర్‌గౌడ్‌తో కలిసి జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడారు. ఉత్తమ్‌పై ఆయనకు ఎందుకు కోపమొచ్చిందో అర్థం కాలేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షపాతి, రైతు పక్షపాతి అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక వర్షాలు పడి ధాన్యం తడిసిపోయిందన్నారు. తడిసిన ప్రతీ గింజా ప్రభుత్వం కొంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులు, రైస్ మిల్లర్లు ఇబ్బంది పడకుండా, నష్టపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అధికార పార్టీపై ప్రతిపక్షాలు బురద జల్లడం సహజమేనన్నారు. ఐదేండ్లు రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని స్పష్టం చేశారు. ఆయన్ను ఎవరూ డిస్టర్బ్ చేయబోరని ఈ సందర్భంగా జగ్గారెడ్డి తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల ఫలితాలనంతరం

బీఆర్ఎస్ భూస్థాపితం

ఆ పార్టీ ఎక్కడా గెలవదు

- అందులో ఒక్కరూ మిగలరు : మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్య

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం బీఆర్ఎస్ పార్టీ భూస్థాపితం అవుతుందనీ, ఆ పార్టీలో ఒక్కరూ మిగలరని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. గురువారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మీడియాతో మంత్రి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎక్కడా గెలవదనీ, ఒకటి, రెండు చోట్ల డిపాజిట్లు మాత్రమే వస్తాయని అన్నారు. పదేండ్లు అధికారంలో ఉండి నాలుగు నెలల్లో బంద్ అయిన చరిత్ర ప్రపంచంలో ఎక్కడా లేదన్నారు. ఆ రికార్డును బీఆర్ఎస్ సృష్టించబోతున్నదన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంటు స్థానాల్లో బీఆర్ఎస్‌కు కనీసం ఏజెంట్లు కూడా లేరని చెప్పారు. బీజేపీకి ఓటువేయాలని బీఆర్ఎస్ నాయకులే ఎన్నికల్లో బహిరంగంగా చెప్పారని గుర్తు చేశారు. జూన్ నాలుగో తేదీ తరువాత బీఆర్ఎస్‌ను మూసివేస్తారనీ, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును ఆపార్టీ కార్యకర్తలే కొడతారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ తొమ్మిది నుంచి 14 లోక్‌సభ సీట్లను గెలుచుకుంటుందని చెప్పారు. కవిత జైల్లో ఉండటం, ఎన్నికల్లో ఓటమి పాలుకావడం, ఇంట్లో గొడవల కారణంగా కేటీఆర్ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని విమర్శించారు. 30 వేల ఉద్యోగాలను ఎన్నికల ముందు ఎందుకు ఇవ్వలేదో కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో ఉంటే, మంత్రులను డమ్మీలను చేసి రాజ్యం నడిపింది కేటీఆర్ కాదా ? అని ప్రశ్నించారు. కేబుల్ బ్రిడ్జిని చూపించి హైదరాబాద్ అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న కేటీఆర్, మూసీ నదిని ఎందుకు అభివృద్ధి చేయలేదో చెప్పకపోవడం గమనించాలని ప్రజలను కోరారు. హైదరాబాద్ నుంచి ఏ కంపెనీ పోలేదనీ, కేటీఆర్ అర్థం లేకుండా మాట్లాడుతున్నారని అభిప్రాయపడ్డారు. త్వరలో ఓల్డ్ సిటీలో మెట్రోను ప్రారంభించబోతున్నామని చెప్పారు. బీఆర్ఎస్ అవినీతి దేశమంతా తెలుసనీ, పక్క రాష్ట్రాలకు పోతే తెలంగాణ అనగానే కాళేశ్వరం, లిక్కర్ స్కాంను గుర్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓఆర్ఆర్ టెండర్లను తక్కువ ధరకు కోట్ చేసి, కమిషన్లు దండుకున్నారనీ, దీనిపై విచారణ జరుగుతున్నదన్నారు. ఆగస్టులో ఆర్ఆర్ఆర్ టెండర్లను పిలుస్తామని చెప్పారు. భూసేకరణకు హడ్కో రుణం తీసుకుంటామని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో కేటీఆర్ మాట్లాడుతూ తీన్మార్ మల్లన్న మీద కేసులున్నాయని అంటున్నారనీ, ఆ కేసులు పెట్టింది మీరు కాదా ? అని మంత్రి ప్రశ్నించారు. మందకృష్ణ మాదిగ మీద కూడా కేసులు పెట్టారని గుర్తు చేశారు. పదేండ్లపాటు కాంగ్రెస్ లీడర్లను గృహనిర్బంధం చేశారని వివరించారు.

కసితో చదివాను...

మహిళలు.. అందునా గిరిజన నేపథ్యాల నుండి వచ్చిన వారు అనేక సవాళ్లను ఎదుర్కొవలసి వస్తుంది. అటువంటి నేపథ్యం నుండి వచ్చిన సవితా ప్రధాన్ తన ఆశయ బలాన్ని దృఢంగా నమ్మారు. అసమానతలకు వ్యతిరేకంగా పోరాడి సివిల్స్ సర్వీసెస్‌లో విజయం సాధించారు. సంకల్పం, విద్య ద్వారా కష్టాలను అధిగమించగలం అని చెప్పేందుకు ఈమె జీవితం ఒక శక్తివంతమైన ఉదాహరణ. కనీస సౌకర్యాలు లేని చిన్న పల్లెటూరిలో పెరిగిన ఆమె చదువుతో తన జీవితాన్ని మార్చుకుని ఇప్పుడు ఇతరులకు సహాయం చేసే స్థితికి ఎదిగారు. తన విజయాన్ని అట్టడుగు వర్గ మహిళలకు అంకితం చేసిన ఆమె స్ఫూర్తిదాయక పరిచయం నేటి మానవిలో...



పేదరికం మధ్య సవిత ప్రయాణం మధ్యప్రదేశ్‌లోని మండై అనే చిన్న గిరిజన గ్రామంలో ప్రారంభమైంది. ఆధునిక సౌకర్యాలకు ఆమడదూరంలో ఉన్న గ్రామం అంది. అయినా ఆమె తల్లిదండ్రులు విద్యకు విలువిచ్చారు. చాలా మంది తమ ఆడపిల్లలను పాఠశాలకు పంపించేవారు కాదు. అలాంటి చోట సవిత పాఠశాల విద్య కఠినమైన పరిస్థితుల్లో ప్రారంభమైంది. పొలం పనుల్లో సహాయం చేయడానికి తెల్లవారకముందే మేల్కొనేది. దాంతో బాగా అలసిపోయేది. అయినా చదువు విషయంలో మాత్రం స్థిరంగా ఉండేది. 'పాఠశాలకు వెళ్లడానికి ఉదయం పనులు ముగించుకొని చాలా దూరం నడవాల్సి వచ్చేది. దాంతో బాగా అలసిపోయేదాన్ని. కానీ అది నా వేరే జీవితానికి ద్వారంగా మారింది' అంటూ ఆమె గుర్తుచేసుకున్నారు.

జీవశాస్త్రాన్ని ఎంచుకొని

సవిత డాక్టర్ కావాలనే లక్ష్యంతో ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రాన్ని ఎంచుకున్నారు. జీవశాస్త్రం వల్ల వైద్య విద్యకు గేట్‌వే అయిన PMT పరీక్షలో ఉత్తీర్ణత సాధించవచ్చని ఆమె గ్రహించారు. 'నేను నా జీవితాన్ని మార్చుకోవాలన్నా, ఇతరులకు సహాయం చేయాలనుకున్నా డాక్టర్ కావడమే మార్గం అని నమ్మాను. జీవశాస్త్రం నన్ను ఆకర్షించింది. అదే సరైన మార్గంగా అనిపించింది' అని సవిత వివరించారు.



ఆమె కలలు పట్టాలు తప్పాయి

డాక్టర్ కావాలని కలలు కంటున్న సమయంలో ఆమె జీవితంలో ఊహించని కుదుపు. చిన్న వయసులోనే తల్లిదండ్రులు బలవంతపు పెండ్లి చేశారు. కూతురు గౌరవనీయమైన, ధనవంతుల ఇంటికి కోడలిగా వెళుతుందని వారు సంబరపడ్డారు. 'నేను నిరసన తెలిపేందుకు ప్రయత్నించాను. అప్పుడే పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదని, చదువుకుంటానని మా నాన్నకు చెప్పాను. కానీ అంగీకరించలేదు' అంటూ ఆమె ఆనాటి తన నిస్సహాయ స్థితిని వివరించారు. వివాహం సవితకు తీవ్ర బాధను మిగిల్చింది. అత్తమామలు ఆమెను దూషిస్తూ, ఓ పని మనిషిగా చూసేవారు. 'ఆ బాధలు భరించలేక చివరకు చచ్చిపోవాలనుకున్నాను. కానీ గర్భవతిని అని తెలిసి విరమించుకున్నాను. అప్పుడు కూడా నాకు కడుపునిండా తిండి పెట్టేవారు కాదు. రోటీలను నా బట్టలలో దాచుకుని తినేదాన్ని. ఇది అక్కడ నా మనుగడ' ఇలాంటి బాధాకర సంఘటనలను ఆమె వేదనతో గుర్తుచేసుకున్నారు.

నిర్ణయం కష్టమైనదే...

సవిత ఆ సమయంలో ఎవరి మద్దతు లేక ఒంటరిగా ఉంది. 'నా దగ్గర డబ్బు లేదు, పాఠశాలకు వెళ్లడానికి మార్గం లేదు. నేను ఇతరులపై పూర్తిగా ఆధారపడి ఉన్నాను' ఆమె వివరించారు. ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం ఆమె చదువు కొనసాగించేందుకు అడ్డంకిగా మారింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల నుండి విముక్తి పొందాలని, తన పరిస్థితిని మార్చుకోవాలనే సంకల్పం మరింత బలపడింది. ఇక హింసించే భర్తను విడిచిపెట్టాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయం అత్యంత కష్టమైనదే. అయితే తనకు, తన పిల్లలకు మంచి జీవితం, స్వేచ్ఛ కోసం ఇది తప్పదు.

మా అమ్మ నాకు ఆధారం

'ఈ సమాజంలో భర్తను వదిలిపెట్టడం అంటే వెలుతురు ఎక్కడుందో తెలియక చీకటిలోకి అడుగు పెట్టడం లాంటిది' అని సవిత అంటున్నారు. ఆమె ఒక రాత్రి తన వస్తువులను బ్యాగ్‌లో సర్దుకుంది. ఆమె గుండె భయంతో కొట్టుకుంది. కానీ తన పిల్లలకు మెరుగైన జీవితం కోసం ఆశతో ఆజ్యం పోసింది. తిరిగి పుట్టింటికి వచ్చినప్పుడు తల్లి ఆమె నిర్ణయాన్ని సమర్థించినప్పటికీ సంఘం ప్రశ్నించింది. 'నా తల్లి నాకు ఆధారమయింది. నాకు నేను కుంగిపోయినట్టుగా అనిపించినప్పుడు ఆమె నాలోని శక్తిని కనుగొనడంలో సహాయపడింది' ఆమె గుర్తుచేసుకున్నారు.

జీవితాన్ని పునర్నిర్మించుకోవాలని

తన జీవితాన్ని పునర్నిర్మించాలని, పిల్లలకు సురక్షితమైన భవిష్యత్తును అందించాలని నిర్ణయించుకున్న సవిత అనేక ఉద్యోగాలు చేశారు. పగలు కుట్టేది, రాత్రి ఆఫీసులు శుభ్రం చేసేవారు. ప్రతి ఉద్యోగం సవాళ్లను అందించింది. 'ప్రతి రోజు ఓ పరీక్ష, కానీ ప్రతి రాత్రి ప్రశాంతంగా నిద్రపోతున్న నా పిల్లలను చూసినప్పుడు నేను కొనసాగించాలని అనుకున్నాను' అంటున్న ఆమె పని, చదువులు, మాతృత్వాన్ని సమతుల్యం చేయడంలో అనేక కష్టాలు అనుభవించారు. నిరంతర పనితో అలసిపోయినప్పటికీ సవిత తన విద్యను తిరిగి ప్రారంభించారు. దూరవిద్యలో చేరి పిల్లలు నిద్రపోయిన తర్వాత అర్ధరాత్రి వరకు చదువుకునేవారు.

సివిల్ సర్వీసెస్

ఎమ్మె పూర్తి చేస్తున్నప్పుడు సవిత ఒక వార్తాపత్రిక చదివారు. ఇది సివిల్ సర్వీసెస్‌లో ఉద్యోగాల గురించి. ప్రారంభ జీతం సుమారు 16,000 రూపాయలు. తన పిల్లలకు మంచి జీవితం, చదువు చెప్పించాలనుకున్న ఆమెకు ఈ ఉద్యోగం ఓ గొప్ప అవకాశంగా అనిపించింది. 'నేను సివిల్ సర్వీసెస్ ఉద్యోగంతో ఎంత సంపాదించవచ్చో చూసినప్పుడు, నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని నిర్ధారించుకున్నాను. అత్తింట్లో పడిన కష్టాలు గుర్తుకొచ్చి కసితో చదివాను' అని ఆమె వివరించారు. తన కుటుంబాన్ని పోషించడం, పిల్లలకు మంచి అవకాశాలు ఇవ్వడం ఆమె లక్ష్యం. ఏండ్ల పోరాటం తర్వాత సవిత తన మొదటి ప్రయత్నంలో రాష్ట్ర సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం



సాధించారు. 'నాకు ఉద్యోగం వచ్చిన రోజు నా కష్టాలు తీరిపోయాయని భావించాను. ఇప్పుడు నేను ఇతరులకు సహాయం చేసే స్థితిలో ఉన్నాను' అంటూ సాధికారత వైపు తన ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు.

ఇతరులకు సాయం చేస్తూ...

ఇప్పుడు ఆమె విద్య, మహిళల హక్కుల కోసం మాట్లాడుతున్నారు. సమాజంలోని మహిళలు, పిల్లల జీవితాలను మెరుగుపరచడంపై దృష్టి పెట్టారు. తన స్వానుభావాల నుండి నేర్చుకున్న గుణపాఠాల ద్వారా విద్యావకాశాలు అందరికీ, ముఖ్యంగా అట్టడుగు వర్గాలకు చెందిన బాలికలకు అందుబాటులో ఉండేలా ప్రయత్నిస్తున్నారు. సాధికారతకు, సామాజిక సమానత్వానికి విద్య కీలక సాధనం అని ఆమె వాదిస్తున్నారు. మహిళల స్వాతంత్ర్యానికి మద్దతు ఇచ్చే కార్యక్రమాలను అమలు చేయడానికి, సమాజంలో వారి పాత్రను మెరుగుపరచడానికి ఆమె తన స్థానాన్ని ఉపయోగించుకుంటున్నారు. 'ఎన్ని కష్టాలు వచ్చినా మీ కలలు వదులుకోవద్దు. మీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మార్చడానికి విద్య మీ ఆయుధం. ప్రతి పోరాటానికి ఇదే విలువైనది' అంటూ సవిత తన మాటలు ముగించారు.

- సలీమ



క్రూరత్వాన్ని ధైర్యంగా ఎదుర్కొని

బ్యాచిలర్ డిగ్రీని పూర్తి చేసిన తర్వాత స్థిరమైన భవిష్యత్తు కోసం తన విద్యను ఇంకా కొనసాగించాలనుకున్నారు. ఓ స్పష్టమైన లక్ష్యంతో ఎమ్మెలో చేరారు. చదువు, పని, పిల్లలను సమతుల్యం చేసుకునేందుకు ఆమె రోజు సూర్యోదయానికి ముందే మొదలై సూర్యాస్తమయం తర్వాత ముగుస్తుంది. క్రూరత్వాన్ని ధైర్యంగా ఎదుర్కోవడం సవిత విద్యా విజయానికి దారితీసింది. భర్త ఆమె ప్రయత్నాలను అణగదొక్కేందుకు ఆమె పరీక్షలు రాసేందుకు వెళుతున్న రోజు ఇంటిలోకి ప్రవేశించి ఆమెపై మూత్రం పోశాడు. తన గౌరవాన్ని కాపాడేది విద్య మాత్రమే అని ఆమె బలంగా నమ్మారు. కనుక తన లక్ష్యాల గురించి చాలా స్పష్టంగా ఉన్నారు. 'ప్రతి సవాలు ఎంత క్రూరమైనదైనా విజయం సాధించాలనే నా సంకల్పానికి ఆజ్యం పోసింది' అంటున్న ఆమె తర్వాత కాలంలో తన విద్యను మరింత ఉత్సాహంతో కొనసాగించారు. అనుకున్నట్టుగానే ఎమ్మెలో మంచి ఉత్తీర్ణ సాధించారు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో కళాశాలలో అగ్రస్థానంలో నిలిచారు. ఇది ఆమె భవిష్యత్ విజయాలకు పునాది వేసింది.

గోళ్లు కొరుకుతున్నారా?

చాలా మందికి గోళ్లు కొరికే అలవాటు ఉంటుంది. చిన్న పిల్లలకే కాకుండా కొందరు పెద్దలు కూడా గోళ్లు కొరుకుతుంటారు. గోళ్లు కొరకడం మంచి అలవాటు కాదని తెలిసినా ఈ అలవాటును అస్సలు మానుకోలేకపోతుంటారు. ఆటోమెటిక్‌గా వాటంతటవే గోళ్లు నోట్లోకి వెళ్లిపోతుంటాయి. ఇంతకీ అసలు ఈ అలవాటు ఎలా వస్తుంది.? దీనిని మానుకోవాలంటే ఏం చేయాలి ఇప్పుడు తెలుసుకుందాం..



సాధారణంగా గోళ్లు కొరికే అలవాటు చిన్ననాటి నుంచే వస్తుంది. క్రమేణా పెద్దయ్యాక కూడా అలవాటుగా మారిపోతుంది. చాలా మంది అసలు గోళ్లు కొరుతున్నామని తెలియకుండానే ఆ పనిచేస్తుంటారు. ఈ అలవాటును వైద్య పరిభాషలో ఒనికోఫాగియా అని పిలుస్తారు. అయితే గోళ్లు ఎందుకు కొరుతారనే దానికి ఎలాంటి నిర్దిష్ట కారణం లేకపోయినప్పటికీ.. కొందరు మాత్రం టెన్షన్, ఆతృతతో గోళ్లు కొరుకుతుంటారని నిపుణులు చెబుతున్నారు.

గోళ్లు కొరకడం చిన్న సమస్యలాగే అనిపించినా ఇది చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు. గోళ్లలో ఉండే మురికి నోట్లోకి వెళ్లి కడుపులో ఇన్ఫెక్షన్లను అయ్యే అవకాశాలు పెరుగుతాయి. అంతేకాకుండా నిత్యం గోళ్లను కొరకడం వల్ల వేళ్ల చివర ఉండే చర్మం దెబ్బతింటుంది. వేళ్లు అందవిహీనంగా మారుతాయి.

అయితే కొన్ని రకాల టిప్స్ పాటించడం వల్ల ఈ సమస్య నుంచి బయట పడొచ్చని నిపుణులు చెబుతున్నారు. వీటిలో మొదటిది మీ గోళ్లను అందంగా తీర్చిదిద్దుకోవడమే. గోళ్లను అందంగా తీర్చిదిద్దుకుంటే వాటిని కొరకాలనే భావన కలగదు. నెయిల్ పాలిష్ వేసుకోవడం వల్ల కూడా గోళ్లు కొరికే ఆలోచన తగ్గిపోతుంది. దీనికి కారణం నెయిల్ పాలిష్ చేదుగా ఉండడమే. ఒక ఒత్తిడికి గురైన సమయంలో సొంపు వేసుకోవడం లేదా చూయింగమ్ తినడం వంటివి అలవాటు చేసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ■

ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టులు, పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీస్ ఉన్నతాధికారులు ధ్రువీకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతేవాడ, నారాయణపూర్ జిల్లాల సరిహద్దులోని అబుజ్‌మడ్‌లోని రేకవాయా ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో దంతేవాడ, బస్తర్, నారాయణపూర్ జిల్లాల నుండి 1000 మందికి పైగా డీఆర్‌జీఎస్, టీఎఫ్ జవాన్లు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ సమయంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు సాయుధ మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. దంతెవాడ డీఆర్‌జీ జవాన్లు ఐదుగురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకోగా, నారాయణపూర్ జిల్లా జవాన్లు ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఘటనాస్థలిలో ఆటోమేటిక్ ఆయుధాలతో పాటు పెద్ద మొత్తంలో మావోయిస్టుల దైనందిక సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టు అగ్రనేతలూ మరణించినట్టు సమాచారం.

దశాబ్దకాలంలో అనేక పాఠశాలల మూసివేత

తెరిపించేందుకు కార్యాచరణ రూపొందించాలి : టీపీటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత దశాబ్దకాలంలో రాష్ట్రంలో అనేక పాఠశాలలు మూతపడ్డాయని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అశోక్ కుమార్ అధ్యక్షతన వర్చువల్ పద్ధతిలో ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ, ఉమ్మడి నల్గొండ - వరంగల్ - ఖమ్మం జిల్లాల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నాగిరెడ్డి సంఘ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూతబడిన పాఠశాలలు తెరిపిస్తామని సీఎం చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నట్టు తెలిపారు. సమాజానికి అనుగుణంగా అది ఆమోదించేలా కార్యాచరణను రూపొందించాలనీ, విద్యావిధానంలో మార్పు తీసుకురావడానికి తల్లిదండ్రులకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని కోరారు. ప్రతి తరగతికి ఒక టీచర్‌ను కేటాయించాలనీ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో విద్యావాలంటరీలను నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్,పి.నారాయణమ్మ, పి.మహేందర్ రెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు యస్. కనకయ్య ,రావుల రమేష్,ఎం.రాములు, కే.భోగేశ్వర్ ,ఎస్. కవిత, ఉమ్మడి వరంగల్ ,నల్గొండ,ఖమ్మం జిల్లాల పరిధిలోని జిల్లాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

83 శాతం ధాన్యానికి చెల్లింపులు : డీఎస్ చౌహాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యానికి గానూ 83 శాతం చెల్లింపులు చేసినట్టు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్.చౌహన్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని పౌరసరఫరాలశాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొనుగోళ్ల కోసం రాష్ట్ర, జిల్లా స్థాయిలో యాక్షన్ ప్లాన్ రూపొందించుకున్నామని చెప్పారు. గతంలో ఏప్రిల్ తొలి వారం తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరిచే వారని గుర్తుచేశారు. అందుకు భిన్నంగా ఈ ఏడాది మార్చి 25లోపు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరిచినట్టు చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వం 7,241 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు కొనసాగుతున్నాయని తెలిపారు. ధాన్యం తీసుకువస్తున్న రైతులతో తాను నేరుగా మాట్లాడినట్టు వెల్లడించారు. అమ్మిన మూడు రోజుల్లోనే డబ్బులు పడ్డాయని రైతులు చెప్పినట్టు తెలిపారు.. దాదాపు 80 కొనుగోలు కేంద్రాలను తాను స్వయంగా పరిశీలించినట్టు చెప్పారు. రైతులకూ ఫోన్ చేసి ఏమైనా సమస్యలున్నాయా? అని ఆరా తీస్తే అంతా బాగానే ఉందని చాలా మంది సంతృప్తిని వ్యక్తం చేశారని గుర్తు చేశారు.

మట్టినీ మింగుతుండ్రు

(మొదటిపేజీ తరువాయి)

భూముల్ని టార్గెట్ చేసి ఎర్రమట్టిని తరలిస్తున్నారు. హైదరాబాద్-ముంబయి జాతీయ రహదారి వెంట పటాన్‌చెరు నుంచి బీదర్ వరకు రెండు వైపులా వందలాది ఎకరాల్లో వెంచర్లు వెలుస్తున్నాయి. అనేక నిర్మాణాలు జరుగుతుండటంతో కోట్ల వ్యాపారం జరుగుతున్నట్టు తెలిసింది. సిద్దిపేట జిల్లాలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మల్లన్నసాగర్, కొండపోచమ్మ కాల్వల మట్టిని సైతం మట్టి మాఫియా తవ్వకెళ్లినా అధికారులకు పట్టడం లేదన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికే నంగునూరు ప్రాంతంలో మెదక్ జిల్లాలోని కొల్చారం, నర్సాపూర్, శివంపేట, కౌడిపల్లి మండలాల్లోని గుట్టలు, అసైన్డ్ భూములు, అటవీ ప్రాంత భూముల్లో మట్టి తవ్వకాలు గుట్టుగా సాగుతున్నాయి.

అవసరాన్ని బట్టి మారే ట్రాక్టర్ మట్టి ధర

గ్రామాల్లో ఒక ట్రాక్టర్ మట్టి ధర రూ.1200 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తారు. అదే పెద్దపెద్ద వెంచర్లకు, హైవేల మీదుగా ట్రిప్పర్ల ద్వారా పంపుతారు. వాటికి రూ.5 వేల వరకు వసూలు చేస్తారు. అవసరాన్ని బట్టి 100 నుంచి 200 ట్రిప్పుల మట్టి కావాలని వ్యాపారులతో వెంచర్ల యజమానులు మాట్లాడుకుంటారు. దాన్ని బట్టి తవ్వకాలు ఉంటాయి. అంతేకాదు, ధర ఎప్పుడూ ఒకేలా ఉండదు. అవసరాన్ని, సందర్భాన్ని, దూరాన్ని బట్టి మారుతూ ఉంటుంది. ఎలాంటి అనుమతులు లేకుండా చేసే చీకటి వ్యాపారం కాబట్టి.. పోలీసులకు, ఇతర అధికారులకు, చోటామోటా నేతలకు మామూళ్ల రూపంలో ఎంతో కొంత ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి ధర వీటిపై కూడా ఆధారపడి ఉంటుంది.

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

మట్టి, ఇసుక, చెట్ల రవాణా పనులు వాల్టా చట్ట పరిధిలో అనుమతులు పొంది చేయాల్సినవి. కానీ..! అధికార యంత్రాంగం చోద్యం చూస్తూ చట్టానికి తూట్లు పొడుస్తున్నది. వాల్టా చట్టం ప్రకారం ప్రభుత్వ, ప్రయివేట్ భూముల్లోంచి మట్టిని తవ్వి తరలించాలంటే ముందస్తుగా అనుమతులు పొందాలి. మట్టి తవ్వకాలు చేయాల్సి వస్తే హెక్టారుకు రూ.50 వేలు చెల్లించాలి. విక్రయాలపై 2.25 శాతం పన్ను చెల్లించాలి. ఇండ్ల నిర్మాణాలకు, తక్కువ మొత్తంలో అవసరమున్న వాటికి తహసీల్దార్ నుంచి ఎన్‌ఓసీ తీసుకోవాలి.

తర్వాత మీ సేవ ద్వారా గనులు, భూగర్భ జల శాఖకు దరఖాస్తు చేయాలి. ఒక నెల వరకు మట్టిని తవ్వేందుకైతే జిల్లా కలెక్టర్ అనుమతి పొందాలి. అంతకు ముందే భూగర్భ, మైనింగ్, కాలుష్య నియంత్రణ బోర్డు, ఆర్డీఓ, డీఎఫ్ఓ, తహసీల్దార్ అనుమతులు పొందాలి. కలెక్టర్ నుంచి అనుమతి రావాలంటే వీళ్లంతా మట్టిని తవ్వే స్థలాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలి. ఇంత వ్యవహారం ఉన్నప్పటికీ ఎక్కడా అమలు కావడం లేదు. పెద్ద కంపెనీలు, గోదాములు, వెంచర్లు వేసే వాళ్లు కొద్దిపాటి మట్టి కోసం స్థానిక తహసీల్దార్ల అనుమతి ఉందని చెప్పి గుట్టల్ని తవ్వేస్తున్నారు.

అనుమతుల్లేకుండా మట్టి తవ్వకాలు చేస్తే చర్యలు: విజయ్‌కుమార్, ఏడీ మైనింగ్

అనుమతుల్లేకుండా మట్టిని తవ్వితే చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో మట్టి తవ్వకాల సమాచారం తెల్సిన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. గుట్టలు, కాల్వ కట్టలు, ప్రభుత్వ భూముల్లో మట్టిని తవ్వితే ఉపేక్షించేది ఉండదు. ప్రయివేట్ భూముల్లోనే అనుమతులు లేకుండా మట్టి తవ్వొద్దు.

హత్యా రాజకీయాలు

- కాంగ్రెస్‌ది ప్రతీకార పాలన
- శ్రీధర్‌రెడ్డి హత్య అత్యంత కిరాతకం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- లక్ష్మీపల్లిలో బీఆర్ఎస్ నేత హత్య
- నిరసనగా రాస్తారోకో
- అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రులు



నవతెలంగాణ -మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీకార పాలన.. హత్యా రాజకీయాలు చేస్తోంది.. తెలంగాణ అభివృద్ధికి అవి మంచివి కావు.. నాలుగు నెలల కాలంలోనే ఇద్దరు బీఆర్ఎస్ నేతల హత్యలకు కారణమైన మంత్రి జూపల్లి కృష్ణారావును మంత్రివర్గం నుంచి తొలగించాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో బుధవారం రాత్రి బీఆర్ఎస్ నేత బొడ్డు శ్రీధర్‌రెడ్డి(45)పై గుర్తు తెలియని వ్యక్తులు గొడ్డలితో దాడి చేసి హత్య చేశారు. విషయం తెలిసిన వెంటనే గురువారం కేటీఆర్ గ్రామానికెళ్లారు. కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల్లో కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. శ్రీధర్‌రెడ్డిని కిరాతకంగా చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి మంత్రి జూపల్లినే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేరుకేమో ప్రజాపాలన.. చేస్తున్నది ప్రతీకార పాలన అని విమర్శించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని ఫ్యాక్షన్ సంస్కృతిని మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్‌లో తీసుకొచ్చారన్నారు. జనవరిలో మల్లేష్ యాదవ్, ఇప్పుడు శ్రీధర్‌రెడ్డి హత్యకు కారణమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రమేయం, ప్రోద్భలం



లేకుండా ఆయన అనుచరులు ఇంత దారుణాలకు తెగబడరని అన్నారు. స్థానిక పోలీసులపై తమకు నమ్మకం లేదని, వరుస హత్యలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ ఏర్పాటు లేదా జ్యుడీషియల్ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ఇదే దాడుల సంస్కృతి కొనసాగితే తమ కార్యకర్తలను కూడా తాము నియంత్రించలేమన్నారు. హత్యా రాజకీయాలు కొనసాగితే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్ల ముట్టడికి వెనుకాడబోమని చెప్పారు.

మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీధర్ రెడ్డి హత్య ముమ్మాటికీ రాజకీయ హత్య అని అన్నారు. అతని రాజకీయ ఎదుగుదలను గిట్టని కొందరు వ్యక్తులు మంత్రి ప్రోద్భలంతోనే హత్య చేశారని ఆరోపించారు. శ్రీధర్‌రెడ్డి హత్యపై సీబీఐ విచారణ చేపట్టి మంత్రి జూపల్లి కృష్ణారావును బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారీ ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయని వాటిని కట్టడి చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు శ్రీధర్‌రెడ్డి హత్యకు నిరసనగా మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. ర్యాలీగా లక్ష్మీపల్లికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

ఇండియా ఫోరందే అధికారం

(మొదటిపేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఏడు సీట్లకు ఏడూ ఇండియా ఫోరమే గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. రాజ్యాంగం, రిజర్వేషన్లపై మోడీ, బీజేపీ దాడి చేస్తోందని ఫైర్ అయ్యారు. మోడీ ప్రధానిగా 22 మంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పని చేశారని విమర్శించారు. దేశ సంపదను అదానీకి దోచిపెట్టారని ఆరోపించారు. దళితులు, ఆదివాసీలు, వెనకబడిన వర్గాలకు ఈ ఎన్నికలు అత్యంత కీలకమని రాహుల్ వ్యాఖ్యానించారు.

రేపే ఆరో దశ పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిది, హర్యానాలో పది, ఢిల్లీలో ఏడు, పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది, జార్ఖండ్‌లో నాలుగు, ఒడిశాలో ఆరు స్థానాలకు పోలింగ్ జరగనుంది. అయితే మూడో దశ (మే 6)లో జరగాల్సిన జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్ లోక్‌సభ నియోజకవర్గం పోలింగ్, మే 25 ఆరో దశ పోలింగ్ కు మార్చారు. జమ్మూకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ, హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్ లాల్ కట్టర్, కాంగ్రెస్ నేతలు కన్నయ్య కుమార్, దీపేందర్ సింగ్ హుడా, బీజేపీ నేత మనోజ్ తివారీ బరిలో ఉన్నారు.

ఐఐటీల్లో చదివినా కొలువుల్లేవ్

(మొదటిపేజీ తరువాయి)

యువ గ్రాడ్యుయేట్లు ఎదుర్కొంటున్న ఎన్నడూ లేని విధంగా ఉద్యోగ సంక్షోభం నెలకొంది" అని ధీరజ్ సింగ్ తెలిపారు.

ఐఐటీ ఢిల్లీలో గత ఐదేండ్లలో 22 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు దక్కకపోగా, 2024కు వచ్చేసరికి 40 శాతం మందికి అదే పరిస్థితి ఎదురైంది. గత రెండేండ్లలో 600 మందికి ఉద్యోగాలు దక్కలేదు. 2022 నుంచి 2024 వరకు పాత తొమ్మిది ఐఐటీల్లో నమోదు చేసుకున్న విద్యార్థుల సంఖ్య 1.2 రెట్లు పెరగ్గా, ఉద్యోగాలు సాధించనివారి సంఖ్య 2.1 రెట్లు పెరిగింది. అలాగే, నూతన ఐఐటీల్లో నమోదిత విద్యార్థుల సంఖ్య 1.3 రెట్లు పెరిగింది. కానీ ఉద్యోగాలు దక్కని విద్యార్థుల సంఖ్య కూడా 3.8 రెట్లు పెరిగింది. ఈ సంక్షోభం విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ఈ ఏడాది ఆరుగురు ఐఐటీ విద్యార్థులు ఆత్మహత్య చేసుకోగా, అనేక మంది తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు ఎదుర్కొంటున్నట్టు పలు నివేదికలు పేర్కొంటున్నాయి.

కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

థానే (మహారాష్ట్ర) : మహారాష్ట్రలో భారీ పేలుడు సంభవించింది. థానే సమీపంలోని డొంబ్లివిలోని ఎంఐడీసీ ప్రాంతంలో ఓ కెమికల్ ఫ్యాక్టరీలోని బాయిలర్‌లో గురువారం అమాంతంగా.. మంటలు చెలరేగాయి. అనంతరం భారీ పేలుడు సంభవించడంతో నలుగురు కార్మికులు మృతి చెందారు. 25 మందికి పైగా గాయాలయ్యాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఎనిమిది ఫైర్ ఇంజన్ల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో గాయపడిన, మంటల్లో చిక్కుకున్న వారి గురించి ఎలాంటి సమాచారం తెలియలేదు. ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నదని వైద్యులు తెలిపారు. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మత్తెక్కింది..నిజమే


(మొదటిపేజీ తరువాయి)

పాజిటివ్‌గా తేలినట్టు బెంగళూరు పోలీసులు వెల్లడించారు. పలువురు నటుల రక్త నమూనాల్లో మాదక ద్రవ్యాల ఆనవాళ్లు లభ్యమైనట్టు తెలిపారు. నగర శివారులో ఆదివారం రాత్రి నిర్వహించిన రేవ్ పార్టీని పోలీసులు భగ్నం చేసిన విషయం తెలిసిందే. తెలుగు సినీ రంగానికి చెందిన కొందరు నటులు, బుల్లితెర నటులు, మోడల్స్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరైనట్టు పోలీసులు ఇప్పటికే వెల్లడించారు. వారంతా మత్తు పదార్థాలు తీసుకున్నారో.. లేదో పరీక్షించడానికి రక్తనమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపించామని తెలిపారు. ఈక్రమంలో తాజాగా డ్రగ్స్ పరీక్షల వివరాలు వెల్లడించారు.



నైట్‌రైడర్స్ పిలుస్తోంది!

- ఫైనల్లో చోటు కోసం రైజర్స్, రాయల్స్ తహతహ
- నేడు ఐపీఎల్ క్వాలిఫయర్ 2 పోరు
- చెపాక్‌లో సన్‌రైజర్స్, రాయల్స్ అమీతుమీ



ఐపీఎల్ 17వ సీజన్ ఉత్తమ బ్యాటింగ్ జట్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఒకటి. 16 సీజన్ల ఐపీఎల్‌లో అత్యధిక స్కోరును సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ సీజన్‌లో ఏకంగా మూడు సార్లు తిరగరాసింది. రికార్డులు బద్దలు కొడుతూ, ఆ రికార్డులను మళ్లీ తిరగరాస్తూ సాగింది సన్‌రైజర్స్ బ్యాటింగ్ విధ్వంసం. పవర్‌ప్లేలోనూ ఏకంగా రెండు సార్లు 100 ప్లస్ పరుగులు చేసింది.

సన్‌రైజర్స్ తరహా విధ్వంసక బ్యాటింగ్ లేకపోయినా.. ఐపీఎల్ 17వ సీజన్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ బృందం రాజస్థాన్ రాయల్స్ సొంతం. నాణ్యమైన ఇద్దరు స్పిన్నర్లు, ప్రపంచ శ్రేణి లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌తో రాయల్స్ అద్భుతాలు చేసింది. పదునైన పేస్, మాయతో ప్రత్యర్థులను తికమకపెట్టింది. ఈ సీజన్లో రాయల్స్ బౌలర్ల దెబ్బకు దాదాపుగా అన్ని జట్లూ తలొంచాయి!.

ఉత్తమ బ్యాటర్లతో ఉత్తమ బౌలర్లు నేడు చెన్నై చెపాక్ స్టేడియంలో అమీతుమీకి సిద్ధమయ్యారు. క్వాలిఫయర్ 2లో విజయం సాధించిన టైటిల్ పోరులో కోల్‌కత నైట్‌రైడర్స్‌ను ఢీకొట్టేందుకు ఇరు జట్లు తహతహ లాడుతున్నాయి. సన్‌రైజర్స్ బ్యాటర్లు వర్సెస్ రాయల్స్ బౌలర్లుగా సాగుతున్న ఈ సమరంలో ఎవరు పైచేయి సాధిస్తారో చూడాలి.

నవతెలంగాణ-చెన్నై

సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ నేడు ఐపీఎల్ క్వాలిఫయర్ 2లో చావోరేవో తేల్చుకోనున్నాయి. ఐపీఎల్ ఫైనల్స్‌కు చేరుకునే మార్గంలో.. సన్‌రైజర్స్ హైదరాబాద్ తొలుత క్వాలిఫయర్ 1లో కోల్‌కత నైట్‌రైడర్స్ చేతిలో పరాజయం పాలైంది. ఎలిమినేటర్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌ను ఓడించిన రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2కు చేరుకుంది. వరుసగా నాలుగు మ్యాచుల్లో ఓటముల పరంపరకు తెరదించిన రాజస్థాన్ రాయల్స్ నేడు క్వాలిఫయర్ 2లోనూ అదే జోరు చూపించేందుకు సిద్ధమవుతోంది. మొతెరాలో నిరాశపరిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నేడు చెపాక్‌లో సూపర్ విక్టరీపై కన్నేసింది. క్వాలిఫయర్ 2 విజేత ఆదివారం ఐపీఎల్ 17 ఫైనల్లో కోల్‌కత నైట్‌రైడర్స్‌తో ఢీకొట్టనుంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ క్వాలిఫయర్ 2 పోరు నేడు.

ఆ ఇద్దరు మెరవాలి : సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసక బ్యాటింగ్ మంత్రకు కారణం ఓపెనర్లు. ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మలు పవర్‌ప్లేలో పిండుకునే పరుగులతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అలవోకగా భారీ స్కోర్లు సాధించింది. కీలక క్వాలిఫయర్ 2లో హెడ్, శర్మ రాణించటం కీలకం. అభిషేక్ శర్మ ఈ సీజన్లో ఏ ఇన్నింగ్స్‌లోనూ 30 బంతులు ఆడలేదు. అయినా, 500 పరుగుల చేరువలో ఉన్నాడు. పవర్‌ప్లేలో రాయల్స్ పేసర్లను ఓపెనర్లు చిత్తు చేస్తే సన్‌రైజర్స్‌కు ఎదురుండదు. వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్‌గా నిష్క్రమించిన ట్రావిశ్ హెడ్ నేడు ఎలా ఆడతాడో చూడాలి. మిడిల్ ఓవర్లలో క్లాసెన్, నితీశ్, త్రిపాఠి త్రయం స్పిన్ ద్వయం అశ్విన్, చాహల్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. చెపాక్ పిచ్‌పై సహజంగానే ఈ ఇద్దరు ప్రమాదకారులు. క్లాసెన్, నితీశ్, అబ్దుల్ సమద్ స్పిన్ వార్‌కు సిద్ధంగా ఉన్నారు. నాల్గో విదేశీ ఆటగాడి కోటాలో గ్లెన్ ఫిలిప్స్ జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. స్వల్ప స్కోర్ల చెపాక్‌లో అదనపు బ్యాటర్ అవసరం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఎడన్ మార్‌క్రామ్ సైతం అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు. విజయకాంత్ స్థానంలో స్పిన్ వనరులుగా మార్కండెను వాడుకునే వీలుంది. పాట్ కమిన్స్, నటరాజన్, భువనేశ్వర్‌లు మంచి ఫామ్‌లో ఉండటం హైదరాబాద్‌కు అదనపు బలం.

సమిష్టి ప్రదర్శనపై.. : రాజస్థాన్ రాయల్స్ సమిష్టి ప్రదర్శనపై ఆధారపడి ఉంది. జోశ్ బట్లర్ దూరమవటం రాయల్స్‌కు గట్టి ఎదురుదెబ్బ. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, కెప్టెన్ సంజు శాంసన్ ఇద్దరూ ఫామ్‌లోకి రావటంతో రాయల్స్ శిబిరంలో జోశ్ పెరిగింది. రియాన్ పరాగ్ నిలకడగా రాణిస్తూ మిడిల్ ఆర్డర్ బ్యాటింగ్ భారం మోస్తున్నాడు. ధ్రువ్ జురెల్, హెట్‌మయర్ సైతం అంచనాలు అందుకుంటే రాయల్స్‌కు తిరుగుండదు. ట్రెంట్ బౌల్ట్ పదునైన పేస్, అశ్విన్-చాహల్ జోడీ మాయ రాయల్స్ ప్రధాన బలం. ఈ ముగ్గురు వికెట్ల వేటలో రాణించటంపైనే రాజస్థాన్ విజయావకాశాలు ఎక్కువగా ఆధారపడి ఉన్నాయి. సందీప్ శర్మను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఈ సీజన్‌లో సందీప్ శర్మ విస్మరించలేని ప్రదర్శన చేశాడు.

పిచ్, వాతావరణం : చెన్నై చెపాక్ పిచ్ స్వభావరీత్యా నెమ్మదిగా స్పందిస్తుంది. నాణ్యమైన స్పిన్నర్లు ఇక్కడ మ్యాచ్ ఫలితాలను ప్రభావితం చేయగలరు. రెండో ఇన్నింగ్స్ సమయంలో మంచు ప్రభావం సైతం ఉంటుంది. టాస్ నెగ్గిన తొలుత బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ జరిగిన ఏడు మ్యాచుల్లో ఐదింట రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్టు విజయం సాధించింది. ఇక్కడ సూపర్‌కింగ్స్ చేతిలో సన్‌రైజర్స్, రాయల్స్ పరాజయాలు చవిచూశాయి.



తుది జట్లు (అంచనా)

సన్‌రైజర్స్ హైదరాబాద్ : ట్రావిశ్ హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, గ్లెన్ ఫిలిప్స్, నితీశ్ కుమార్ రెడ్డి, హెన్రిచ్ క్లాసెన్ (వికెట్ కీపర్), అబ్దుల్ సమద్, షాబాజ్ అహ్మద్, పాట్ కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్ కుమార్, టి నటరాజన్.

రాజస్థాన్ రాయల్స్ : యశస్వి జైస్వాల్, టామ్, సంజు శాంసన్ (కెప్టెన్, వికెట్ కీపర్), రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, షిమ్రోన్ హెట్‌మయర్, రోవ్‌మాన్ పావెల్, అశ్విన్, ట్రెంట్ బౌల్ట్, అవేశ్ ఖాన్, సందీప్ శర్మ, యుజ్వేంద్ర చాహల్.

చెమటోడ్చిన సింధు!

- అష్మిత అదిరే విజయం
- మలేషియా మాస్టర్స్ 2024



కౌలాలంపూర్ : వరల్డ్ నం.15, భారత అగ్రశ్రేణి షట్లర్ పి.వి సింధు మలేషియా మాస్టర్స్‌లో చెమటోడ్చింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్స్ మ్యాచ్‌లో పి.వి సింధు 2-1తో గట్టెక్కింది. వరల్డ్ నం.54 దక్షిణ కొరియా షట్లర్ సిమ్ యు జిన్‌పై 59 నిమిషాల మ్యాచ్‌లో గట్టెక్కింది. 21-13, 12-21, 14-21తో పి.వి సింధు మూడు గేముల పాటు పోరాడింది. మరోవైపు అష్మిత చాలిహ ప్రీ క్వార్టర్స్‌లో అదిరే విజయం సాధించింది. అమెరికా షట్లర్ బీవెన్ జాంగ్‌ను చిత్తు చేసి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. మూడో సీడ్ చాలిహ 19-21, 21-16, 12-21తో చాలిహ ముందు తేలిపోయింది. పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్ నిరాశపరిచాడు. 13-21, 18-21తో వరుస గేముల్లో ఐదో సీడ్ జియ (మలేషియా) చేతిలో ఓటమి చెందాడు. పురుషుల డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్, సాయిప్రతీక్ జోడీ 11-21, 9-21తో చేతులెత్తేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్ రెడ్డి, సిక్కి రెడ్డి జంట సైతం 9-21, 15-21తో ఓటమిపాలైంది. మహిళల డబుల్స్‌లో సిమ్రన్ సింగ్, రితికా ఠాకూర్‌లు 17-21, 11-21తో వరుస గేముల్లో రెండో సీడ్ జంట చేతిలో మట్టికరిచారు. ఏడో సీడ్ ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి జంట 18-21, 22-20, 14-21తో మూడు గేముల పోరులో పోరాడి ఓడింది.

కోచ్ రేసులో లేము!

- పాంటింగ్,లాంగర్ వెల్లడి



న్యూఢిల్లీ : ఐపీఎల్ 17వ సీజన్ మే 26న ముగియనుంది. మే 27న భారత జట్టు చీఫ్ కోచ్ పదవికి దరఖాస్తులు చేసుకునేందుకు తుది గడువు. కోల్‌కత నైట్‌రైడర్స్ మెంటార్ గౌతం గంభీర్‌ను బీసీసీఐ సంప్రదించినట్టు వార్తలు వచ్చినట్టే.. రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్, స్టీఫెన్ ఫ్లెమింగ్‌లను సైతం బోర్డు వర్గాలు కలిసినట్టు సమాచారం. భారత క్రికెట్ చీఫ్ కోచ్ పదవి రేసులో ప్రస్తుతానికి లేమని రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్ తెలిపారు. 'ఇలాంటి వార్తలు ముందుగా సోషల్ మీడియాలోనే ముందుగా చూస్తాం. ఐపీఎల్ సందర్భంగా చిట్‌చాట్‌లో ఆసక్తి ఉందా అని అడిగిన మాట వాస్తవమే. ఓ జాతీయ జట్టుకు చీఫ్ కోచ్‌గా పని చేయడానికి ఇష్టపడతాను. కానీ ఇప్పుడు నా లైఫ్‌స్టయిల్‌కు చీఫ్ కోచ్ పదవి సరిపడదు. ఐపీఎల్, ఆసీస్‌లో టెలివిజన్ బాధ్యతలు ఉన్నాయి. ఏడాదికి 9-10 నెలలు కుటుంబానికి దూరంగా ఉండే పరిస్థితులు లేవు' అని పాంటింగ్ అన్నాడు. జస్టిన్ లాంగర్ సైతం భారత మెన్స్ జట్టుకు శిక్షణ సారథ్యం వహించేందుకు సిద్ధంగా లేనట్టు తెలిపాడు. ఈ విషయంపై కెఎల్ రాహుల్‌తో ఓసారి మాట్లాడాడు. 'ఐపీఎల్ జట్టులో ఒత్తిడి, పాలిటిక్స్ ఎలా ఉంటాయో మీకు తెలుసు. భారత జట్టు చీఫ్ కోచ్‌గా అందుకు వెయ్యి రెట్లు ఎక్కువ ఒత్తిడి, పాలిటిక్స్ ఉంటాయి' అని రాహుల్ నాతో చెప్పాడు. ఇక స్టీఫెన్ ఫ్లెమింగ్ సైతం చీఫ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయలేదని చెన్నై సూపర్‌కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపారు. సాధారణ సంభాషణలో అడుగగా.. ఆసక్తి లేదని ఫ్లెమింగ్ తెలిపినట్టు కాశీ విశ్వనాథన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు.

బుజ్జితో భైరవ చేసిన ప్రయాణం అద్భుతం


ప్రభాస్

ప్రభాస్ నటిస్తున్న గ్లోబల్ ప్రాజెక్ట్ 'కల్కి 2898 ఎ.డి.' నిర్మాతలు కస్టమ్-మేడ్ వాహనాన్ని విడుదల చేయడానికి హైదరాబాద్‌లో ఒక వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే బుజ్జిని ప్రపంచానికి పరిచయం చేయడానికి దాదాపు 1 నిమిషం నిడివి గల టీజర్‌ను కూడా విడుదల చేశారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో జరిగిన ఈ వేడుకకు భారీ స్థాయిలో ఆహుతులు హాజరయ్యారు. రెగ్యులర్ ఫిల్మ్ ఈవెంట్‌ల మాదిరిగా కాకుండా ఈ ఈవెంట్‌లో బైకర్లు కొన్ని అద్భుతమైన విన్యాసాలు చేశారు. అమెరికాస్ గాట్ టాలెంట్ సీజన్ 2ను గెలుచుకున్న ముంబైకి చెందిన వి.అన్‌బీటబుల్ జట్టు వేదికపై ప్రభాస్ మెడ్లీపై ప్రదర్శన ఇవ్వడం హైలైట్‌గా నిలిచింది.

కస్టమ్ మేడ్ వెహికల్ బుజ్జి బిల్డింగ్ వెనుక ఉన్న టీమ్‌ని నాగ్ అశ్విన్ పరిచయం చేశాడు. 'బుజ్జి పేరు చిన్నగా అనిపించినా అది మాకు చాలా ప్రత్యేకమైనది. కల్కి 2898 ఎడి తీయడం చాలా కష్టమైన చిత్రం. నేను ఇంజనీరింగ్ చేయలేదు. నేను సహాయం కోసం ఆనంద్ మహీంద్రాకు ట్వీట్ చేసాను. ఆయన తన బృందాన్ని యాక్టివేట్ చేశాడు. వారు మమ్మల్ని కోయంబత్తూర్‌లోని జయం మోటార్స్‌కు తీసుకువెళ్లారు. ఇది చాలా ప్రయోగాత్మక రేసింగ్ కార్-బిల్డింగ్ కంపెనీ. ఇలాంటి ఫీచర్లతో కూడిన కారును తయారు చేసేందుకు భారీ పరిశోధన అవసరం. కారు భారీగా ఉంది. మేము దానిని కల్కి, భైరవ కోసం సిద్ధం చేశాం' అని దర్శకుడు నాగ్ అశ్విన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభాస్ మాట్లాడుతూ, "నా దర్శకుడు నాగ్ అశ్విన్ నన్ను 3 సంవత్సరాలు టార్చర్ పెట్టాడు. ఈ కార్యక్రమానికి క్యాజువల్‌గా రావాలనుకున్నాను. కానీ నాగ్ అశ్విన్ నన్ను ఈ విన్యాసాలు చేసేలా చేశాడు. క్యూరియాసిటీని పెంచడానికి 'ఎవరో స్పెషల్' అనే ట్వీట్‌ను పోస్ట్ చేయాలనేది నా దర్శకుడి ఆలోచన. బుజ్జి చాలా ప్రత్యేకం. బుజ్జి టీజర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాను. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ వంటి దిగ్గజాలతో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం. ఈ ఇద్దరు నటుల ద్వారా యావత్ భారతదేశం స్ఫూర్తి పొందింది. దీపిక అత్యంత అందమైన సూపర్ స్టార్. ఆమె అంతర్జాతీయ సినిమాలు, అంతర్జాతీయ ప్రకటనలు చేస్తోంది.

నవచిత్రం

సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే


రష్మిక మందన్న

ఇటీవలే 'పుష్ప పుష్ప పుష్ప రాజ్' అంటూ తొలి లిరికల్ సాంగ్‌తో ప్రపంచవ్యాప్త శ్రోతలను అలరించి.. యూట్యూబ్ వ్యూస్‌లో ఆల్ టైమ్ రికార్డులు నెలకొల్పిన 'పుష్ప-2 ది రూల్'లోని పుష్పరాజ్ టైటిల్ సాంగ్ ఇంకా అంతటా మారుమోగుతూనే ఉంది. తాజాగా మరో లిరికల్ అప్‌డేట్ వచ్చింది. పుష్పరాజ్ జోడి అయిన శ్రీవల్లి పుష్పరాజ్‌తో కలిసి పాడుకున్న మెలోడి సాంగ్‌ను కపుల్ సాంగ్‌గా ఈ నెల 29న ఉదయం 11:07 నిమిషాలకు విడుదల చేయనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను గురువారం విడుదల చేశారు. ప్రోమోలో కేశవ వాయిస్‌తో సెకండ్ సాంగ్ గురించి రష్మికను అడుగుతాడు. మేకప్ వేసుకునేందుకు సిద్ధంగా ఉన్న శ్రీవల్లి 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామీలా వుంటాడే నా సామి అంటూ ఆమె పాడుతూ ఐకానిక్ స్టెప్పుతో అలరించింది. ఈ ప్రోమో చూసి సాంగ్ అదిరిపోయే మెలోడిలా ఉండబోతుందని అందరూ అంచనా వేస్తున్నారు. అల్లుఅర్జున్, సుకుమార్ కాంబోలో రాబోతున్న ఈ చిత్రంపై సర్వత్రా భారీ అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నారు.



ఛాలెంజింగ్ స్క్రిప్ట్‌తో చేసిన సినిమా : దిల్ రాజు

ఆశిష్, వైష్ణవి చైతన్య హీరో, హీరోయిన్లుగా శిరీష్ సమర్పణలో దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్ మీద హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించిన చిత్రం 'లవ్ మీ'. ఈ చిత్రానికి అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. ఈ హారర్ థ్రిల్లర్‌ను ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 25న గ్రాండ్‌గా రిలీజ్ చేస్తున్నారు.

ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ, 'ఆశిష్ హండ్రెడ్ పర్సెంట్ ప్రామిసింగ్ పర్సనాలిటీ. ఇలాంటి యంగ్ హీరో ఈ బ్యానర్‌లో వర్క్ చేస్తే మంచి ఫలితం రావటం తథ్యం. ఇది తనకు బిగినింగ్ మాత్రమే. డైరెక్టర్ అరుణ్‌ని కలిశాను. కొత్త వాళ్లతో సినిమా చేసే ధైర్యం దిల్ రాజు అండ్ టీమ్‌కి మాత్రమే సాధ్యం. బేబీతో ఓ ఊపు ఊపేసిన వైష్ణవి చైతన్య ఇందులో చక్కగా నటించిందని ట్రైలర్ చూస్తుంటే అర్థమైంది' అని అన్నారు. 'లవ్ మీ ఇఫ్ యు డేర్‌కి సీక్వెల్‌గా కిల్ మీ ఇఫ్ యు లవ్ అనే సీక్వెల్ కూడా ఉంది. త్వరగా ఆశిష్‌తో దాన్ని స్టార్ట్ చేయాలని కోరుకుంటున్నాను. దిల్ రాజు, శిరీష్‌కి స్పెషల్ థ్యాంక్స్. ఈ మూవీలో ప్రియ అనే పాత్ర రాసుకునే సమయంలో వైష్ణవి చైతన్యనే అనుకున్నాను. ఈనెల 25న ఆడియెన్స్ ఓ మ్యాజిక్‌ను చూడబోతున్నారు' అని దర్శకుడు అరుణ్ భీమవరపు చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం.కీరవాణి మాట్లాడుతూ, 'సాధారణంగా నాన్ లీనియర్ నెరేషన్ అంటే అర్థం తెలియని దర్శకులుండరు. అటువంటిది అరుణ్ భీమవరపు.. లవ్ మీ సినిమాతో నాన్ లీనియర్ నేరేషన్‌కు కొత్త నిర్వచనాన్నిచ్చారు. చాలా డీప్‌గా వెళ్లారు. సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

దర్శకుడిగా మారుతున్న కొరియోగ్రాఫర్ సతీష్‌రాజ్

తెలుగు తెరపై ఇప్పటిదాకా పలువురు కొరియోగ్రాఫర్‌లు దర్శకులుగా మారారు. ప్రభుదేవా, లారెన్స్, విజయ్ బిన్నీ, గణేష్ మాస్టర్ లాంటి కొరియోగ్రాఫర్స్ దర్శకులుగా మారి భారీ సినిమాలను రూపొందించారు. వీరి బాటలోనే మరో కొరియోగ్రాఫర్ సతీష్ రాజ్ కూడా చేరబోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎస్ ఆర్ మూవీ జంక్షన్ పేరుతో ఓ బ్యానర్‌ను స్థాపించారు. ఈ బ్యానర్ లోగోను నటుడు మురళీ మోహన్ ఆవిష్కరించారు.

సతీష్ రాజ్ సాయి బాబా భక్తుడు అవడంతో స్వీయ దర్శకత్వంలో సినిమా ప్రారంభించే ముందు తన ఇష్టదైవమైన సాయి బాబాకు అంకితం ఇవ్వాలనే ఆశయంతో 'శ్రద్ధ సబూరి' పేరుతో ఓ పాటను రూపొందించారు. ఈ పాటను కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ మాస్టర్, ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ కలిసి ఆవిష్కరించారు. ఒక దర్శకుడు సినిమా మొత్తాన్ని మూడు గంటల్లో చూపిస్తే కేవలం మూడు నిమిషాల్లో కథ మొత్తం అర్థమయ్యేలా ఒక్క పాటలో చూపించగలిగిన దర్శకుడే కొరియోగ్రాఫర్ అని ఈ సందర్భంగా మురళి మోహన్ అన్నారు. సతీష్ రాజ్ లాంటి కొరియోగ్రాఫర్లు దర్శకులుగా మారడం వల్ల చిత్రపరిశ్రమలో మరిన్ని మంచి సినిమాలు వస్తాయని ఆయన అన్నారు. ఫిలిం ఛాంబర్ కార్యదర్శి దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ,'ప్రతి కొరియోగ్రాఫర్ ఒక దర్శకుడే. తెలుగు సినిమా పరిశ్రమలో ప్రతిభావంతులైన కొరియోగ్రాఫర్లు చాలా మంది ఉన్నారు. అనేక మంచి అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారు. అలాంటి అవకాశం ఇప్పుడు సతీష్ రాజ్ మాస్టర్‌కు వచ్చింది' అని తెలిపారు.

సతీష్ రాజ్ మాస్టర్ దర్శకుడిగా మారడం తనకెంతో సంతోషంగా ఉందని కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ అన్నారు. కొరియోగ్రాఫర్, దర్శకుడు విజయ్ బిన్నీ మాట్లాడుతూ,'అన్ని విధాలుగా అనుభవం ఉన్న సతీష్ రాజ్ దర్శకుడిగా మారడం నాకెంతో సంతోషంగా ఉంది' అని చెప్పారు. పోలంకి మాస్టర్ మాట్లాడుతూ,'సతీష్ రాజ్ మాస్టర్ దర్శకుడిగా కూడా సక్సెస్ అవుతారనే నమ్మకం ఉంది' అని తెలిపారు. ఈ వేడుకలో సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, దర్శకుడు చంద్రమహేశ్, కాదంబరి కిరణ్, వినోద్ బాల, హీరోయిన్ శిరీష, నిర్మాత అర్చన తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886